3-4Pg1exHMNWJQE.qxd:3-4Pg1exHMNWJQE.qxd 1/1/02 6:38 AM Page 1

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-4-2026 శుక్రవారం

సంపుటి: 32 సంచిక: 62

పేజీలు: 16 వెల: 6.50



అమరావతికి చట్టబద్ధత రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఎపి ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు, వారి సంకల్పానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష. అమరావతికి వెన్నుదన్నుగా నిలిచిన ప్రధాన మంత్రి మోడీ, అమిత్‌షాకు ధన్యవాదాలు.
-సిఎం చంద్రబాబు

# ప్రజారాజధానికి 'పెద్దలు' సై

## ఉభయసభల ఆమోదంతో ఇక నిర్విఘ్నంగా అమరావతి

**చట్టబద్ధత బిల్లుకు దాదాపు అన్ని పార్టీల మద్దతు**

**బిల్లును వ్యతిరేకిస్తూ వైసిపి సభ్యులు వాకౌట్**

## అమరావతి ఇక అన్‌స్టాపబుల్

### ఆంధ్రప్రదేశ్ ప్రగతికి నాంది

**ఈ చారిత్రక విజయం అమరావతి రైతులకు అంకితం**

**ప్రధాని మోడీ, అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు: సిఎం చంద్రబాబు**

**విజయవాడ ఏప్రిల్ 2, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించడం..రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్లమెంటులోని ఉభయ సభల్లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 ఏకగ్రీవంగా ఆమోదం పొందటంపై ఆయన హర్షం వ్యక్తం >>2



రాజ్యసభలో బిల్లు ఆమోదంతో గురువారం అమరావతిలో రైతుల సంబరాలు

## పార్లమెంటులో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం

**విజయవాడ, ఏప్రిల్2, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత పార్లమెంట్‌లో ఓ చారిత్రత్మక ఘట్టం ఆవిష్కృతమైంది.ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే క్రమంలో కీలక అంకం పూర్తయింది. రాజ్యసభ గురువారం ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధతను కల్పించే బిల్లుకు ఆమోదం తెలిపింది.నిన్ననే లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభకు నేడు చేరింది.. రాజ్యసభలో బిల్లుపై జరిగిన చర్చలో అమరావతికి తిరుగులేని మద్దతు దక్కింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ బిల్లును కేంద్రమంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాక్రిష్ణన్ బిల్లుపై చర్చకు ఆమోదం తెలిపారు.
అమరావతికి చట్టబద్ధతకు కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ. తెలుగు దేశం, ఆమ్ ఆద్మీ. తృణమూల్, బిజెడి,, జెడియు. ఆర్‌జెడి., బిఆర్ఎస్. ఉద్ధవ్ శివసేన పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలుగు ప్రజలందరికి ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని అన్నారు. "బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతి చరిత్రలో గుర్తుంటుంది. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. రాజధాని కోసం ఉద్యమించిన రైతులు, మహిళలకు సరైన న్యాయం దక్కింది. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది, మరో రాష్ట్రానికి లేదు అని వెల్లడించారు. సభ్యులు అడ్డుకున్నారు. మహిళా రిజర్వేషన్లపై 30 ఏళ్ల పాటు ఏం చేశారని ఖర్గే ప్రశ్నించారు. బిల్లు ప్రవేశపెట్టడం రైతుల విజయమని రేణుకా చౌదరి అన్నారు. ఉద్యమ సమయంలో రైతులను, మహిళలను తీవ్రంగా హింసించారన్నారు. రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టతగా ఉందని వెల్లడించారు. అస్పష్టత వల్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయని >>2



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి లోకేష్

## మీకు కంగ్రాట్స్

**తనను కలిసిన మంత్రి లోకేష్, ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ**

**ప్రధానిని శాలువతో సత్కరించిన లోకేష్**

**విజయవాడ, మార్చి2, ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించడంపై ప్రధాని మోదీకి మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ఎంపీలతో కలిసి నేడు మోడీని ఆయన కలిశారు. మంగళగిరి శాలువాతో ప్రధానిని లోకేశ్ సత్కరించారు. ఈ సందర్భంగా "కంగ్రాట్స్" అని లోకేశ్‌కు మోదీ చెప్పినట్లు తెలిసింది. ప్రధాని నరేంద్ర మోడీతో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీల బృందం భేటీ అయింది. లోక్ సభలో అమరావతి చట్టబద్దత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో లోకేశ్ తో పాటు ఎంపీలు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. మోదీని శాలువాతో లోకేశ్ సత్కరించారు. ఈ సందర్భంగా కంగ్రాట్స్ అంటూ ఆయన్ను ప్రధాని అభినందించారు. అనంతరం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లను కూడా లోకేశ్ ఎంపీలు కలిశారు. సభ లో బిల్లు పెట్టి ఆమోదం పొందేందుకు >>2

## నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు

**పేరుకుపోయిన బకాయిలే కారణం**

**విజయవాడ, ఎప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిచాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) వరుసగా రెండవ రోజు నిలిపివేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు ఆగిపోయాయి. దీంతో వైద్యం అందకపోవడంతో రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రులు సేవలను కొనసాగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం ఆషా నాయకులతో చర్చలు జరిపింది. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్యాలయంలో ఈ చర్చలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం, ఆషా మధ్య సమన్వయం రాకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. తమకు మొత్తం రూ.3 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఆషా నాయకులు >>2

## అమరావతికి పార్లమెంట్ ఆమోదం

# తిరుగులేని శాసనం

**రాజధానికి వ్యతిరేకంగా వాకౌట్ చేసిన వారిని బ్లాకౌట్ చేయాలి**

**మావిగన్ అంటూ అపహాస్యమా?: రైతుల సభలో సిఎం చంద్రబాబు**

**సతీసమేతంగా దీపహారతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి**



గురువారం అమరావతి బిల్లు ఆమోదంతో ఉద్దండరాయుని పాలెంలో అమరావతికి భూమిపూజ జరిగిన ప్రాంతంలో సాష్టాంగ ప్రణామం చేస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రాజధానికి చట్టబద్దత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభలో ఆమోదం లభించిన నేపథ్యంలో ఎపి సిఎం చంద్రబాబు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.ఆయన ఎంతో ఉత్సాహంతో తన ఆనందాన్ని అందరితో పంచుకున్నారు.చంద్రబాబు పట్టరాని సంతోషంతో అమరావతి రాజధానికి నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోడీ భూమి పూజచేసి ప్రాంతానికి సాష్టంగ ప్రణామం చేసారు.అక్కడ దీపహరతిలో పాల్గొన్నారు.ఇక అమరావతి రాజధానిగా చట్టబద్దత కల్పిస్తూ పార్లమెంటులో తిరుగులేని శాసనం చేశారని.. ఇది ప్రజా సంకల్పానికి దక్కిన గౌరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెం వద్ద గురువారం రైతులతో కలిసి సతీ సమేతంగా అమరావతికి దీపహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."దేశ చరిత్రలో అమరావతి విజయం సువర్ణ అక్షరాలతో లిఖించదగింది. అమరావతి చరిత్ర శాశ్వతం.. అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని రాజధానిని దక్కించుకున్నాం. రాజధానిని స్మశానం అన్న వారు నేడు అడ్రస్ లేకుండా పోయారు. అమరావతిపై పార్లమెంటులో తిరుగులేని శాసనం చేసుకున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు, కానీ నేడు ఒక శాశ్వత అడ్రస్ వచ్చింది. అమరావతి రాజధాని ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చి చేసిన త్యాగం వల్లే ఈ విజయం సాధ్యమైంది. 1,631 రోజుల ఉద్యమం ఒక చరిత్ర. ఉద్యమాన్ని అడ్డుకున్న ప్రభుత్వంపై రాజధాని రైతులు, మహిళలు వీరత్వం, ప్రతాపం చూపారు. నాడు ముళ్ల కంచెలు దాటుకుని ఉద్యమం చేస్తున్న రైతుల వద్దకు పవన్ కళ్యాణ్ వచ్చారు. భువనేశ్వరి తన చేతికి ఉన్న రెండు గాజులను రాజధాని రైతుల ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. ఎంతో మంది రైతులకు అండగా నిలిచారు. అమరావతి ఉద్యమం కోసం నేను స్వయంగా జోలె పట్టాను. న్యాయస్థానం టు దేవస్థానం కార్యక్రమాన్ని నాటి ప్రభుత్వం అడ్డుకుంది. ఒక్క అడుగూ వెనక్కుక తగ్గినా... తర్వాత పది అడుగులు వేసి సింహాల్లా దూకారు. 2024లో కూటమి >>2



## ప్రమాదంలో బస్సు దగ్ధం

**38 మంది కార్మికులు సురక్షితం**

**బైక్‌పై వచ్చి ఢీకొన్న వ్యక్తి మృతి**

**బాలాయపల్లి (తిరుపతి జిల్లా), ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** వెంకటగిరి-నాయుడుపేట రోడ్డులోని బాలాయపల్లి మండలం మెల్చూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన పెదికూరు ప్రదీప్ రెడ్డి (40) కన్నుమూశాడు. మేనకూరు సెజ్, నాయుడుపేట నుండి వెంకటగిరి వైపు వెళ్తున్న బ్రేక్స్ ఇండియా బస్సు ఈ ప్రమాదంలో అగ్నికి ఆహుతైంది. బస్సు >>2

### ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్

## బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

**ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా... పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం**

**బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని సిఎం సూచన**

**విజయవాడ, ఏప్రిల్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షి ంచారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. సీఎం సూచనల మేరకు కసరత్తు చేశామని... నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు. ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ. 3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ. 223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు సీఎంకు చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత >>2

రవివర్మ పెయింటింగ్ రూ.167 కోట్లు 2లో



## విజయవాడ-హైదరాబాద్ 2 కొత్త విమానాలు

**విజయవాడ, ఏప్రిల్2 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ నుంచి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించే వారికి ఇది తీపి కబురే! ఈ రెండు నగరాల మధ్య విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయి. కొత్తగా మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నట్లు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీ కాంతరెడ్డి తెలిపారు. ఫ్లై91 ఎయిర్ లైన్స్ సంస్థ ఈ సర్వీసులను నడపనున్నట్లు వెల్లడించారు. మొదటి సర్వీసు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ విమానం ప్రతిరోజూ ఉద యం 6:05 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 7:10 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి విజయవాడ నుంచి ఉదయం 7:30 గంటలకు >>2




గురువారం పోలవరం ప్రాజెక్ట్ మీటింగ్ హాలులో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సన్మానిస్తున్న మంత్రి నిమ్మల

## పోలవరంతో రాష్ట్రం సుభిక్షం

**ప్రాజెక్టును దర్శించడం నా అదృష్టం..**

**నిర్దిష్ట వ్యవధిలో నిర్మాణం పూర్తి: గవర్నర్ అబ్దుల్ నజీర్**

**డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయింది: మంత్రి నిమ్మల**

**ఏలూరు జిల్లా బ్యూరో, ఏప్రిల్ 2 ప్రభాత వార్త:** పోలవరం ప్రాజెక్ట్ ని పరిశీలించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల ప్రగతిపై ప్రాజెక్ట్ మీటింగ్ హాలులో జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, అధికారులు, జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో గవర్నర్ సమీక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ >>2

03-04Pg3exHMNWJQEK.qxd:03-04Pg3exHMNWJQEK.qxd 1/1/02 5:52 AM Page 1



## హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** హనుమత్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడికి పరమ భక్తుడు, అపార బలం, జ్ఞానం, ధైర్యానికి ప్రతీక హనుమంతుడు ఉన్నాడని చెప్పారు. హనుమంతుడిని ఆరాధిస్తే ధైర్యం, ఆరోగ్యం కలుగుతాయని భక్తుల నమ్మకం అన్నారు. ప్రజల జీవితాల్లో హనుమంతుడు కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. ఇకహనుమత్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని ఆంజనేయుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పరిటాల హనుమంతుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక

### - మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఏప్రిల్2, ప్రభాతవార్తప్రతినిధి.:** హనుమాన్ జయంతి సందర్భంగా తెలుగు ప్రజలకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలి పారు. 'ఎక్స్' మాధ్యమంలో తన ట్వీట్‌లో హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అని అన్నారు. హనుమాన్ జయంతి మనసుకు, శరీరానికి శక్తిని, నిబద్ధతను ఇచ్చే పర్వదినమని అభివర్ణించారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గొప్ప గుణానికి ఆంజనేయుడే నిదర్శనమని కొనియాడారు. ప్రజలందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుని, పవనపుత్రుడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షి ంచారు.

## తక్కువ సమయంలోనే పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్ నిర్మాణం

### - ఇంజనీర్లకు అభినందనలు తెలిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్2,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో నేడు మరో కీలక ఘట్టం పూర్తయ్యిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు "ఎక్స్" వేదికగా అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1372 మీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులకు, ఇంజనీర్లకు అభినందనలు. దీనికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డీ వాల్ దెబ్బతినడంతో అదనంగా రూ.1000 కోట్లు వెచ్చించి నిర్మించాం. డయాఫ్రమ్ వాల్ పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (నిదిళినీ) డ్యామ్ పనులు వేగవంతం అవుతాయి. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తి చేసి 2027 పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితమిస్తామన్నారు.

## ఉచిత విద్యుత్ పథకంతో చేనేత కుటుంబాలకు ఉపశమనం

### - డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ ఏప్రిల్ 02 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తెచ్చి మరో ఎన్నికల హామీని నెరవేర్చిందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ పథకం కింద మగానికి 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని ఎక్స్ వేదికగా బుధవారం పోస్ట్ చేశారు. ఈ పథకం అమలుతో చేనేత కుటుంబాలకు ఉత్పత్తి వ్యయం తగ్గి ఉపశమనం కలుగుతుంది. 2017 లో చేనేత కార్మికులు నన్ను కలిసి వారి కష్టాలు చెప్పినప్పుడు నా మనసు చలించింది. వారికి నా వంతు అండగా నిలిచేందుకు చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు ముందుకొచ్చా. వారంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చా. అది యువతలో చైతన్యం నింపింది. నివార్ తుపాను కారణంగా వెంకటగిరి చేనేత మగ్గాలకు నష్టం జరిగినప్పుడు స్వయంగా వెళ్లి వారి కష్టాల్ని చూసి అండగా ఉంటానని భరోసానిచ్చా. ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యపక్షంగా ఉన్నందుకు ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు.



# శనగ కొనుగోళ్ల పెంపుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ

## కొనుగోలు లక్ష్యం పెంచాలని కేంద్రానికి సిఎం లేఖ

## గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు

**సచివాలయం, ఏప్రిల్ 2, ప్రభాత వార్త :** రాష్ట్రంలో శనగ ఉత్పత్తి భారీగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేం దుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ చూపారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన కొనుగోలు పరిమితి సరిపోదని గుర్తించిన మంత్రి, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళారు. మంత్రి అచ్చెన్నాయుడు సూచనల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు.ఇప్పటికే రాష్ట్రంలో ఏపి మార్క్‌ఫెడ్ ద్వారా 72వేల మెట్రిక్ టన్నులు, నాఫెడ్ ద్వారా 12వేల మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు చేశారు. మొత్తం 84వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తవడంతో ప్రస్తుతం ఉన్న లక్ష్యం త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం 3,88,413హెక్టార్లకు పెరిగింది.ఉత్పత్తి కూడా 4,57,365 మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి 94,500మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు లక్ష్యం మాత్రమే ఉన్నప్పటికీ పెరిగిన ఉత్పత్తి దృష్ట్యా దాన్ని 4,57,365 మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్రాన్ని కోరారు.ప్రస్తుతం మార్కెట్‌లో శనగ ధర కనీస మద్దతు ధరకంటే తక్కువగా ఉండడంతో రైతులు తమ మొత్తం ఉత్పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు.ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు అదనపు కొనుగోళ్ళు తప్పనిసరి అని మంత్రి అచ్చెన్నా యుడు భావించారు. రైతుల ప్రయోజ నాలను దృష్టిలో పెట్టుకొని,పెరిగిన ఉత్పత్తికి అనుగుణంగా శనగ కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

# ఎపి రాజధానికి చట్టబద్ధత బిల్లు

# అమరావతి రైతుల విజయం

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధానికి చట్టబద్దత బిల్లు అమరావతి రైతుల విజయమని రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి అభివర్ణించారు. గురువారం రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉద్యమ సమయంలో రైతులు, మహిళలను తీవ్రంగా హింసించినా, వారు వెనకడుగు వేయకుండా పోరాటం కొనసాగించారని గుర్తుచేశారు. గత 12 ఏళ్లుగా ఏపీ రాజధానిపై కొనసాగుతున్న అస్పష్టత వల్లే రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయని రేణుకా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధానే లేకుండా చేశారని ఆమె

**కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి**

విమర్శించారు. కేవలం బిల్లు పెట్టడమే కాదు, నిర్ణీత సమయంలో రాజధానిని పూర్తి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలతో ఆటలు ఆడుతోందని ఆమె మండిపడ్డారు. దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్‌ను ముగిసిన అధ్యాయాలుగా మార్చేశారని విమర్శించారు. తెలంగాణకు హామీ ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలను కూడా కేంద్రం ఇవ్వలేదని తెలిపారు. ఇన్నేళ్లయినా హామీలు ఎందుకు నెరవేర్చలేదో కేంద్రం సమాధానం చెప్పాలని, రెండు రాష్ట్రాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్ల గడిచినా, లక్షా 47 వేల కోట్ల విలువైన ఆస్తుల పంపకాలు ఇంకా పూర్తి కాలేదని ఆమె గుర్తుచేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్న ఐదు గ్రామాల ప్రజలు తెలంగాణలో ఉండాలని కోరుకుంటున్నా, వారిని ఏపీలో కలపడంతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పరిస్థితులు ఎలా ఉన్నా, రెండు తెలుగు రాష్ట్రాలు కలిసే ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రేణుకా చౌదరి తన ప్రసంగాన్ని ముగించారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో తెలుగు దినపత్రికలు చదివించాలి

### మంత్రి లోకేశ్‌ను కోరిన పూల త్రివిక్రమరావు

**విజయవాడ ఏప్రిల్ 02 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో తెలుగు భాష నైపుణ్యాలు పెంచడానికి దినపత్రికలుచదివించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు కోరారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో లోకేశ్‌ను కలిసి తెలుగు భాష ఔన్నత్యాన్ని నిలబెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక భాషను తెలుగులో బోధించాలి. ఇంటర్, డిగ్రీలో తప్పనిసరిగా తెలుగును రెండో భాషగా ఉంచాలి. ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనితెలుగు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులు పదవీవిరమణ చేశాక ఆ ఖాళీలను భర్తీ చేసేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడాలి అని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన లోకేశ్ తెలుగు భాష పునర్వైభవానికి కృషి చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## మోడీ సంకల్పం సాకారానికి వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం

### బిజెపి రాజ్యసభ ఎంపి కె.లక్ష్మణ్

**విజయవాడ ఏప్రిల్ 02 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని కోసం 29వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని భాజపా రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. భవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని చెప్పారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకమని తెలిపారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరముందని అన్నారు. రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిని మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి బిల్లు ఆమోదం కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. తెలుగు వారి కోసం ఆంధ్రరాష్ట్రం రావాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్ర ఇచ్చింది. దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు. అమరావతి రాజధాని సంకల్పం తీసుకొని ముందుకెళ్లారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని ప్రకటించారు. కానీ, జగన్ మూడు ముక్కలాట ఆడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారు అని లక్ష్మణ్ అన్నారు.

## ఆర్టీపిపిలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి

### - రాష్ట్ర జెన్‌కో ఇంజనీర్లకు అభినందనలు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదే శ్ రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో ఏపీ జెన్కో మరో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గ దర్శ కత్వంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు అత్యధిక విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. 1,650 మెగావాట్ల ఆర్టీపీపీ మొత్తం సామర్థ్యానికి గానూ, బుధవారం నాడు 1,643 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. ఆర్టీపీపీ తొలిసారి ఈ రికార్డు సాధిం చడం పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ ఇంజ నీర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాంట్ చరిత్రలో తొలిసారిగా 99.58 శాతం ప్లాంట్ లోడింగ్ ఫ్యాక్టర్ (శిలీసీ) నమోదు చేయడం ఏపీ జెన్కో సాధించిన ఘన విజయ మని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. సీఎం ఆశయ సాధన దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న జెన్కో ఇంజనీర్ల అంకితభావం వల్లే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షి ంచారు. కేవలం విద్యుత్ ఉత్పత్తిలోనే కాకుండా, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు డిస్కంలు, ట్రాన్స్‌కో ఇంజనీర్లు సమిష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సస్పెన్షనే: మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** సింహాచలం ఎంపీజే గురుకుల పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఎలుకల కరిచిన ఘటనపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే విద్యార్థులకు వైద్య సేవలందించాలని ఆదేశించారు. విద్యార్థులను కన్న బిడ్డల్లా సాకాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సింహాచలం ఎంపీజే గురుకుల పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఎలుకల కరిచిన ఘటన గురించి ఆ స్కూళ్ల కార్యదర్శి మాధవీలతతో మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గాయం తగ్గేవరకూ వైద్య సేవలు అందిస్తూ ఉండాలని స్పష్టంచేశారు. విద్యార్థులు ఉంటున్న గదిలోకి ఎలుకలు ఎలా ప్రవేశించాయని ప్రశ్నించారు. విద్యార్థుల గదుల్లోకి దోమలు, ఎలుకలు, ఇతర ప్రాణాంతక జీవాలు, విషపూరిత కీటకాలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలత మాట్లాడుతూ, హాస్టల్ లో మరమ్మతులు చేయడం వల్ల కిటికీ మెస్ లు తొలగించారని, దానివల్లే ఎలుకలు గదిలోకి ప్రవేశించాయని వివరణ ఇచ్చారు. విద్యార్థులను వేరే గదికి తరలించామన్నారు. ఎలుకలను పట్టుకోడానికి బోనెలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యసేవలందిస్తున్నామని వివరించారు. మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రస్తుతం గురుకులంలో ఉన్న ఎలుకలను పారదోలాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందికి మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో తమ బిడ్డలను హాస్టళ్లు, గురుకులాల్లో చేర్పిస్తున్నారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. హాస్టళ్లలో విద్యానభ్యసించే విద్యార్థులను కన్నబిడ్డల మాదిరి చూసుకోవాలన్నారు. బీసీ బిడ్డలపై నిర్లక్ష్యం చూపితే సహించేది లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీ విద్యార్థులకు ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు.

## గ్రహణం వీడి ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత వచ్చింది :మంత్రి లోకేష్

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రుల కల అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధ హామీలో మరో కీలక ముందడుగు పడిందని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లు ఇరు సభల్లోనూ ఆమోదం తెలిపింది. ఇప్పటికే సీఎం చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు.రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజారాజధాని అమరావతికి చట్టబద్ధత వచ్చిందని మంత్రి నారా లోకేశ్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. చట్టబద్ధతకు సహకరించిన పార్టీలు, నేతలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఆనంద సమయంలో అమరావతికి దీపహారతులు ఇద్దామన్నారు. ఈరోజు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి ఈ చారిత్రాత్మక విజయాన్ని జరుపుకుందామని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ దీపాలతో సెల్ఫీ తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని సూచించారు. మన రాజధాని మన గౌరవం అన్నారు. ఏపీ థ్యాంక్స్ ఇండియా హ్యాష్‌ట్యాగ్‌తో అందరూ షేర్ చేయాలని ఎక్స్ వేదిక ద్వారా లోకేశ్ కోరారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో పాల్గొన్న ఎంపీలకు లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ గ్యాలరీ నుంచి బయటకొచ్చాక పలు పార్టీల ఎంపీలను లోకేశ్ కలిశారు. రాజ్యసభ క్యాంటీన్‌లో ఎంపీలతో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టగా, సుమారు రెండు గంటల చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

## ప్రజా రాజధానిగా అమరావతి

### - అమరావతి చట్టబద్ధత పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

### - రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టం - రైతులు, మహిళల దీక్షకు గౌరవం

### - సిఎం చంద్రబాబు దూరదృష్టి.. ప్రపంచ స్థాయి అమరావతి నిర్మాణం

**సచివాలయం,ఏప్రిల్ 2,ప్రభాతవార్త :** అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్త చేస్తూ,ఇది రైతులు త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.ప్రజా రాజధాని అమరావతి కోసం 29వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు.1600రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు,మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ,ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు.గత 12ఏళ్ళుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్రాభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని,మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతి కి మద్దతు ఇచ్చి, అధికారంలోనికి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని,ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని,ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్రాభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని,రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని వివరిస్తూ, "మావిగన్" వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికీ నిదర్శనమని అన్నారు.అమరావతి గ్రామాలైన తుళ్ళూరు,

వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు, మహిళలు బాణాసంచా కాల్చి,మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకోవడం ప్రజల ఆనందానికి నిదర్శనమని తెలిపారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్ అందిస్తుందని,

అమరావతి నిత్య శాశ్వత రాజధానిగా నిలుస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తంచేశారు.

## నకిలీ ధ్రువపత్రాల ఎఫెక్ట్!

### - ఎస్పీడిసిఎల్‌లో 69 మంది షిఫ్ట్‌ఆపరేటర్ల తొలగింపు

**తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలోని వివిధ సర్కిళ్ళలో వున్న సబ్‌స్టేషన్లలో పొరుగు సేవల ద్వారా షిఫ్ట్‌ఆపరేటర్ పోస్టుల నియామకాలకై నకిలీ ధృవ పత్రాలను సమర్పించిన వ్యక్తులపై చర్యలు తీసుకున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని సబ్ స్టేషన్లలో పొరుగు సేవల ద్వారా షిఫ్ట్‌ఆపరేటర్ల పోస్టుల నియామకాల కోసం కొందరు అభ్యర్థులు నకిలీ ధృవ పత్రాలతో ఆ పోస్టులను పొందారని ఫిర్యాదులు అందాయి. ఈ అంశంపై విచారణ నిర్వహించామని, తిరుపతి జిల్లా పరిధిలో ముగ్గురు, చిత్తూరు4, నెల్లూరు4, కడప38, కర్నూలు16, అన్నమయ్య1, అనంతపురం జిల్లాలో ముగ్గురు కలిపి మొత్తం 69 మంది ఐటీఐ విద్యను అభ్యసించకుండానే ఐటిఐ (ఎలక్ట్రిషియన్) పూర్తి చేసినట్లు నకిలీ ధృవపత్రాలను సమర్పించి, వాటి ద్వారా ఆ పోస్టులలో నియామకమైనట్లు విచారణలో వెల్లడైందని వివరించారు.

ఈ నేపథ్యంలో నకిలీ ధృవ పత్రాలను సమర్పించిన 69 మంది షిఫ్ట్ ఆపరేటర్లను ఆ పోస్టుల నుంచి తొలగించాల్సిందిగా సంబంధిత ఏజెన్సీలకు నోటీసులు

జారీ చేస్తూ సర్కిళ్ళ సూపరింటెండింగ్ ఇంజనీర్లను ఆదేశించారు.

## హెచ్ఐవి వ్యాప్తి నియంత్రణలో ఏపి శాక్స్ పనితీరు భేష్

### - 2025-26లోని 9నెలల పనితీరులో దేశంలోనే ఫస్ట్-న్యాకో వెల్లడి

### - మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**సచివాలయం,ఏప్రిల్ 2,ప్రభాతవార్త :** హెచ్ఐవి కేసుల నియంత్రణ,బాధితులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ - ఏపి శాక్స్) ఉత్తమ పనితీరు కనబరిచి,దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.2025-26లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు (9నెలలు)దేశంలోని ఎయిడ్స్ నియంత్రణ సంస్థల పనితీరును నాట్కో (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్)మదింపు చేసి,ఏపి శాక్స్ తొలిస్థానంలో ఉందని తాజాగా ప్రకటించిందని తెలిపారు.మొత్తం నిర్దేశించిన 33ఇండికేటర్లను కలిపి 141కు 107 (75.9శాతం) స్కోర్ సాదించి రాష్ట్ర శాక్స్ మిగిలిన రాష్ట్రాలను మించి తొలి స్థానానికి ఎగబాకిందన్నారు.2024-25లో ఇదే సమయంలో (ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు) రాష్ట్ర ఎయిడ్ నియంత్రణ సంస్థల పనితీరు పరిశీలించినప్పుడు ఏపి ఏడో స్థానంలో ఉందని వెల్లడించారు.

అదేవిధంగా 2024-25ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి ఏపి శాక్స్ 12వ స్థానంలో ఉందని తెలిపారు.2025-26ఆర్థిక సంవత్సరంలో ప్రతి త్రైమాసిక ర్యాంకింగ్‌లో ఏపి ముందంజలో ఉందని చెప్పారు...

## మహిళల భద్రత, విద్యార్థులకు రక్షణపై మార్గదర్శకాలు



**తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల భద్రత ,విద్యార్థినులకు రక్షణపై తిరుపతి జిల్లా పోలీసులు మార్గదర్శకాలు రూపొందించారు. అభివృద్ధిచెందిన సాంకేతిక వినియోగంపై జాగ్రత్తలు తెలిపేలా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి మహిళా డిఎస్పి శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీసులు మహిళలకు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్, సైబర్ క్రైమ్, మహిళల అక్రమ రవాణా, పని ప్రదేశాల్లో వేధింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు,రాపిడో ద్విచక్రవాహనాలు, ఆటో సేవలకు సంబంధించిన భద్రతా అంశాలపై వివరించారు. అదనంగా శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో 112 కాల్ సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థల్లోవిద్యార్థులకు ప్రత్యేకంగా "గుడ్ టచ్.,మ బ్యాడ్ టచ్" పై అవగాహన కల్పించి, వారి వ్యక్తిగత భద్రతపై సూచనలు ఇచ్చారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండటం వంటి అంశాలపై వివరించారు. పిల్లలు ఎటువంటి ప్రమాదంలో ఉన్నా చైల్డ్ లైన్ నంబర్ 1098, అత్యవసర పోలీస్ సహాయం కోసం 112 నంబర్లను వినియోగించాలని తెలియజేశారు.

# ఆకాంక్షల నుంచి సాధనతో విజయం

## - అమరావతి బిల్లు ఆమోదంతో పద్మావతి వర్సిటీలో సంబరాలు



**తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిన సందర్భంగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు , సిబ్బంది ఉత్సాహంగా ఇంజినీరింగ్ కళాశాల ధృతి హాల్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. బిల్లు ఆమోదించబడినట్లు సభాధ్యక్షుడు ప్రకటించిన క్షణంలో హాల్ అంతా హర్షధ్వానాలు, చప్పట్లతో మార్మోగింది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. అనంతరం జరిగిన సంబరాలు రాష్ట్ర ఆకాంక్షలతో విశ్వవిద్యాలయ కుటుంబానికి ఉన్న భావోద్వేగ అనుబంధాన్ని ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. వర్సిటీ విద్యార్థినులు ఆశ, సహనశక్తి ఎంతోకాలంగా ఎదురు చూసిన కలల సాకారానికి ప్రతీకలుగా రంగురంగుల ముగ్గులు వేశారు. పాటలు పాడుతూ, సాయంత్రం క్యాంపస్‌ను వెలుగులతో అలంకరించారు. గురువారం సాయంత్రం ఆనందోత్సాహాలతో పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం క్యాంపస్ నిండిపోయింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేకుండా ప్రజల ఆశలతో మాత్రమే మిగిలిపోయిన కఠిన పరిస్థితులను గుర్తుచేశారు. అమరావతి నిర్మాణం కోసం వేలాది మంది రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారని, ప్రాజెక్ట్ నిలిచిపోయిన సమయంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావించారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ బిల్లు ఆమోదం పొందడం ప్రజల ఆశయాలను సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగని, ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేదిగా పేర్కొన్నారు.

3-4Pg7exHMNWJQE.qxd OK:3-4Pg7exHMNWJQE.qxd 1/1/02 7:02 AM Page 1



# మద్యం అమ్మకాల్లో గణనీయ వృద్ధి

- బీర్ విక్రయాల్లో 70% పెరుగుదల
- అమ్మకాల లెక్క ఘనంగా ఉన్నా ఆదాయం పెరుగుదల స్వల్పమే

విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా బీర్, ఐఎంఎల్ విక్రయాలు భారీగా పెరగడంతో మొత్తం అమ్మకాల విలువ 6.11 శాతం పెరిగింది. అయితే ధరల మార్పులు, ఇతర ఆదాయ వనరుల తగ్గుదల కారణంగా మొత్తం రెవిన్యూ పెరుగుదల మాత్రం కేవలం 0.68 శాతం మాత్రమే నమోదైంది. ముగిసిన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుండి మార్చి 31 వరకు గణాంకాలను పరిశీలిస్తే, భారతీయ తయారీ మద్యం(ఐఎంఎల్) కేసులు 362 లక్షల నుంచి 414 లక్షలకు పెరిగి 14.59 శాతం వృద్ధిని నమోదు చేశాయి. బీర్ విక్రయాలు 1.36 లక్షల కేసుల నుంచి 232 లక్షల కేసులకు పెరిగి 70.29 శాతం భారీ వృద్ధి సాధించాయి. మొత్తం సేల్స్ విలువ రూ.29,440 కోట్ల నుంచి రూ.31,237 కోట్లకు పెరిగి 6.11 శాతం వృద్ధి నమోదైంది. సేల్స్ ద్వారా వచ్చే రెవిన్యూ రూ.24,734 కోట్ల నుంచి రూ.25,727 కోట్లకు పెరిగి 4.01 సాధించింది. అయితే ఎల్ఎఫ్ ఇతరాలు విభాగంలో ఆదాయం రూ.4,112 కోట్ల నుంచి రూ.3,316 కోట్లకు తగ్గి 19.37 శాతం పడిపోయింది. దీని ప్రభావంతో మొత్తం రూ.28,846 కోట్ల నుంచి రూ.29,042 కోట్లకు మాత్రమే పెరిగి 0.68 శాతం స్వల్ప వృద్ధి నమోదైంది. అధికారిక గణాంకాల ప్రకారం తక్కువ ధరల మద్యం అమ్మకాలు పెరగడం వల్ల ఆదాయం అనుకున్నంతగా పెరగలేదు. విక్రయాలలో రూ.99 ధర ఉన్న 180 మిల్లీ లీటర్ బాటిళ్ళ వాటా పెరగడం వల్ల సుమారు రూ.442 కోట్ల వరకు నష్టం జరిగింది. అలాగే ప్రముఖ బ్రాండ్ల ధరలు తగ్గించడంతో రూ.972 కోట్ల వరకు ఆదాయం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే 100 మిల్లీ లీటర్ బాటిల్ సగటు ధర రూ.180 నుంచి రూ.160కి తగ్గింది. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన సుమారు రూ.1,900 కోట్ల నాన్-రిఫండబుల్ ఫీజులు ఈసారి లేకపోవడం కూడా మొత్తం ఆదాయంపై ప్రభావం చూపింది. అయినా మద్యం అమ్మకాలతో వినియోగం పెరుగుతున్నట్లు ఈ గణాంకాలు స్పష్టంగా తెలియచేస్తున్నాయి.




# సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

## 91.17 ఎంఎంటీ సరుకు రవాణా చేశాం: పోర్టు ట్రస్ట్ చైర్మన్

విశాఖపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 91.17 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరుకు రవాణా నమోదు చేసి చారిత్రక మైలురాయిని అందు కుంది అని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తు తెలిపారు. గురువారం బీచ్ రోడ్‌లో హోటల్‌లో స్టేక్‌హోల్డర్స్ మీట్ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే సుమారు 10.35శాతం వృద్ధిని సాధించి, దేశంలోని ప్రధాన పోర్టుల్లో సముచిత స్థానాన్ని సాధించిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 82.62 ఎంఎంటీని అధిగమిస్తూ, పోర్ట్ తన కార్యకలాపాల్లో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందన్నారు. ఈ విజయానికి తోడ్పడిన పోర్ట్ సిబ్బంది, స్టేక్‌హోల్డర్లు, రైల్వేలు, కస్టమ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా 100 ఎంఎంటీ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. మూలపేట పోర్టును ప్రభుత్వంతో కలిసి నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అలాగే దుగ్గరాజపట్నం పోర్టు, షిప్‌బిల్డింగ్ యూనిట్ కోసం సంయుక్తంగా ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ధూళి రహిత సరుకు నిర్వహణపై దృష్టి సారిస్తున్నామని, బొగ్గు రవాణాను మూలపేట పోర్టుకు మళ్లించే ప్రణాళికలు ఉన్నాయని తెలియజేశారు. అలాగే పోర్టు విస్తరణను యాంత్రీకరణ ద్వారా చేపడతామని చెప్పారు. ప్రపంచ స్థాయి సముద్ర భద్రతా వ్యవస్థలు కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటి ఎంఎస్, ఏఐఎస్ ఆధారిత ఆధునిక నావిగేషన్ వ్యవస్థలతో నిరంతర సేవలు అందిస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టడంతో 176 కి.మీ పైగా రైల్వే నెట్‌వర్క్, 40 పైగా సైడింగ్‌లు, మెరుగైన రహదారులు, నిల్వ సదుపాయాలు అని చెప్పారు. భారీ నౌకల నిర్వహణ సామర్థ్యం పెంచడం వల్ల 200,000 డిడబ్ల్యుటి వరకు కేప్‌సైజ్ నౌకలు, 16-21 మీటర్ల లోతు ఉందని అన్నారు.

**నవీన విధానాలు:** జెమినీ ఆపరేషన్స్ ద్వారా హెవీ లిఫ్ట్ సరుకు వేగవంతమైన నిర్వహణ చేపట్టడంతో సౌకర్యాల సమర్థ వినియోగం చేయగలుగుతున్నామని అంగముత్తు తెలిపారు. ఎస్‌పిఎం ద్వారా తొలిసారి క్రూడ్ ఆయిల్ లోడింగ్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. 91.17 ఎంఎంటీ విజయంతో పోర్ట్ తన సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సమన్వయం రంగాల్లో అగ్రగామిగా నిలిచింది వివరించారు. 2026-27లో 100 ఎంఎంటీ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని పోర్ట్ ఉపాధ్యక్షురాలు రోష్నీ అపరంజి కోరాటి సూచించారు.

# ఉత్పత్తి, అమ్మకాల్లో విశాఖ ఉక్కు గణనీయ వృద్ధి




విశాఖపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: విశాఖ ఉక్కు ఉత్పత్తి, అమ్మకాల్లో గతేడాదితో పోల్చితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో గణనీయ వృద్ధిని సాధించిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. హాట్ మెటల్ ఉత్పత్తి 2024-25లో 3.91 మిలియన్ టన్నుల నుంచి 5.95 మిలియన్ టన్నులకు పెరిగి, 52 శాతం వృద్ధిని నమోదు చేసిందని అధికారులు తెలిపారు. అదే విధంగా లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 3.75 మిలియన్ టన్నుల నుంచి 5.69 మిలియన్ టన్నులకు పెరిగి మరో 52 శాతం వృద్ధిని సాధించిందన్నారు. క్రూడ్‌స్టీల్ ఉత్పత్తి కూడా గతేడాది 3.58 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇప్పుడు 5.43 మిలియన్ టన్నులకు చేరి 51 శాతం వృద్ధిని కనబర్చిందన్నారు.

**అమ్మకాల్లోనూ టాప్:** గియర్ ఉక్కు అమ్మకాల విషయంలోనూ విశాఖ స్టీల్ టాప్ గియర్‌లో ఉందని అధికారులు తెలిపారు. 2024-25లో రూ.18,288 కోట్ల నుంచి సుమారు రూ.22,311 కోట్ల అమ్మకాల టర్నోవర్ సాధించి, 22శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. అమ్మకాల పరిమాణం కూడా గణనీయంగా మెరుగుపడి, గతేడాది 3.49 మిలియన్ టన్నులతో పోలిస్తే సుమారు 4.42మిలియన్ టన్నులకు చేరుకుందని, ఇది 27శాతం వృద్ధిని నమోదు చేసుకుందన్నారు. ఉద్యోగుల పని తీరు, మెరుగైన కార్యాచరణ సామర్థ్యాన్ని, పెరిగిన సామర్థ్య వినియోగాన్ని, మెరుగైన మార్కెట్ విస్తరణను స్పష్టం చేస్తోందన్నారు. ఉత్పత్తి, అమ్మకాల విభాగాల్లో ఈ వృద్ధి, ఉద్యోగుల నిరంతర కృషి, ఉత్పాదకత, వ్యయ నియంత్రణ, వినియోగదారుల సంతృప్తిపై కంపెనీ దృష్టిని ప్రతిబింబిస్తుందని యాజమాన్యం పేర్కొంది. రానున్న రోజుల్లో విశాఖ ఉక్కు తన ప్రధాన కార్యకలాపాల్ని బలోపేతం చేయడం, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడం, మార్కెట్లో తన ఉనికిని విస్తరించడంపై దృష్టి సారిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చింది.

# కేరళంలో వచ్చేది మేమే

## వచ్చేది కూడా మా ప్రభుత్వమే: ప్రధాని మోడీ



**తిరువనంతపురం, ఏప్రిల్ 2:** కేరళలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయం ఇందుకు నిదర్శన మన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ఈ సారి కేరళ కేవలం కొత్త ప్రభుత్వాన్నే కాకుండా, కొత్త వ్యవస్థను కూడా ఎన్నుకుంటోం దని స్పష్టమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కేరళలోని బీజేపీ బూత్ కార్యకర్తలతో వర్చువల్‌గా సమావేశమై ప్రసం గించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎన్‌డీఏకు మద్దతు పెరుగుతోంది. తిరువ నంతపురం ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. ఇప్పటివరకు ఎలాంటి దుష్పరిపాలన జరిగినా, అధికారాన్ని పంచుకోవచ్చని వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు రెండూ భావించేవి. ఆ భావనను తిరువనంతపురం బద్దలుకొట్టింది. దీని ఫలితంగానే యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ ఇప్పుడు ఒకరిపై ఒకరు కాకుండా బీజేపీపైనే తమ దాడులను కేంద్రీకరిస్తున్నాయి. యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌ల దోపిడీలతో ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. ప్రధాని మోడీ కేరళ బ్యాటర్ సంజు శాంసన్‌ను ప్రస్తావించారు. సంజు శాంసన్ ప్రదర్శనల్లో మనం దీనిని తరచుగా చూస్తుంటాం. ప్రపంచ కప్ సమయంలో, టోర్నమెంట్ కీలకమైన నాకౌట్ దశకు చేరుకున్నప్పుడు అతడి ప్రదర్శన పతాక స్థాయికి చేరింది. ఆరంభం నుంచి ముగింపు వరకు అతడి ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం మరింత బలపడ్డాయి. ఇవి ఒక నిజమైన క్రీడాకారుడి లక్షణాలు. ఒక గొప్ప ఆటగాడు తన జట్టుకు అత్యంత అవసరమైనప్పుడు ఎల్లప్పుడూ రాణిస్తాడు. ఈ సమయంలోనే మీ అంకితభావం అత్యంత ముఖ్యం. విజయాన్ని సాధించడానికి మీరు అదనపు గంటలు పనిచేయాల్సి రావచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.

# రోదసీయాత్రకు వ్యోమగాములు

## కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఆర్టిమిస్ ప్రయోగం

**ఫ్లోరిడా, ఏప్రిల్ 2:** ఆర్టెమిస్2 వ్యోమనౌకను నాసా గురువారం ప్రయోగించింది. 50ఏళ్ల తర్వాత మళ్లీ చంద్రుడి వద్దకు వ్యోమగాముల్ని నాసా పంపుతోంది. ఆ ట్రిప్‌లో నలుగురు వ్యోమగాములు ఉన్నారు. పది రోజుల పాటు రోదసిలో ఆ ఆస్ట్రోనాట్స్ ప్రయాణం చేస్తారు. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి రాకెట్ ఎగిరింది. రీడ్ వైజ్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు జెర్మీ హన్సెన్ ఆ మూన్ రాకెట్‌లో ఉన్నారు. పది రోజుల జర్నీలో భాగంగా ఆస్ట్రోనాట్స్.. చంద్రుడిని చుట్టి వస్తారు. జాబిలిని సర్కిల్ వేసిన తర్వాత మళ్లీ భూమి పైకి వ్యో మగాములు రానున్నారు. ఓరియన్ క్యాప్సూ ల్‌లో వాళ్లు ల్యాండ్ అవుతారు. 1972లో చేపట్టిన అపోలో 17 మిషన్ తర్వాత లో ఎర్త్ ఆర్బిట్‌లో చేపట్టిన మొదటి మిసన్ ఇదే కావడం గమనార్హం. ఏప్రిల్ ఆరవ తేదీన ఓరియన్ క్యా ప్సూల్.. చంద్రుడి చుట్టూ తిరగనున్నది. చరిత్రలో తొలిసారి ఆస్ట్రోనాట్స్ భూమికి దూరంగా ప్రయాణం చేయనున్నారు. గతంలో అపోలో 13 మిషన్‌లో భాగంగా ఆస్ట్రోనాట్స్ 400,171 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ప్రస్తుతం ఆర్టెమిస్2లో వెళ్తున్న వ్యోమ గాములు ఆ దూరాన్ని బ్రేక్ చేయనున్నారు.

# వైభవంగా బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి

- సింహవాహనంపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్లు
- కోలాహలంగా గిరిప్రదక్షిణ



వెండి రథంపై భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీ స్వామి అమ్మవార్లు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని గురువారం ఉదయం 9 గంటలనుండి పూర్ణాహుతి కార్యక్రమం యాగశాలలో వైభవంగా జరిగింది. అనంతరం శాస్త్ర ప్రకారం ధాన్య కొట్నోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. తదుపరి అవభృత స్నానం (పవిత్ర కృష్ణానదిలో) కోసం గంగా, పార్వతీ(దుర్గా) సమేత మల్లేశ్వరులను అర్చకులు, వేదపండితులు ఆలయ స్థానాచార్య వి శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకువెళ్లి, పుణ్యనదిలో అవభృత స్నానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనానాయక్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు జి.సరోజినీ దేవి, పి.రాఘవరాజు, ఎం.కళావతి, ఎస్.సరిత, జివి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**వెండి రథంపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్లు:** బ్రహ్మోత్సవ వాహన సేవలో భాగంగా సాయంత్రం శ్రీ మల్లేశ్వరస్వామివారు అమ్మవార్లతో కలిసి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల వాహనసేవలో పలు రకాల విన్యాసాలతో భక్తులు ముందు సాగారు. కోలాటాలు, తప్పెట్లు, సాము గిరికీలు, భజన బృందాలు, శంఖ, భేరి, ఢక్క, ఢమరుక నాదాలతో స్వామి అమ్మవార్లకు పలు భక్తబృందాలు నీరాజనాలు పలుకుతూ వాహనసేవకు ముందుగా కదులుతుండగా తమ ప్రాంతాలకు వచ్చిన శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా ప్రాంత భక్తులు రథం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయజయధ్వానాలు చేశారు. మంగళహారతులతో స్వాగతం పలికి పండ్లు, పూలు సమర్పించి మొక్కుకున్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ శీనా నాయక్, పాలకమండలి, స్వాములు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

**గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం:** చైత్రమాస శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో సాగింది. ఉదయం 5:55 గంటలకు గిరి ప్రదక్షిణను ఆలయ ఈవో వికె శీనా నాయక్ కొబ్బరికాయ కొట్టి ఈ ఆధ్యాత్మిక యాత్రను అధికారికంగా ప్రారంభించారు. పల్లకిపై కొలువుదీరిన అమ్మవారు, స్వామివార్ల ఉత్సవ మూర్తుల వెంట భక్తులు కాలినడకన జై దుర్గ.. జై జై దుర్గ అనే నినాదాలతో ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివ ప్రసాద్, అర్చక బృందం ఉత్సవ విభాగం సూపరింటెండెంట్ సతీష్, సిబ్బంది, వేలాది మంది భక్తులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

**ఆదిదంపతుల కృష్ణానదీ విహారం:** శుక్రవారం సాయంత్రం శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల "నదీ విహారము" (నౌకా విహారం) పవిత్ర కృష్ణా నదిలో కనులపండువగా జరుగుతుందని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 4:30 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం ఆలయం నుండి నది వరకు స్వామి వార్లను ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకెళ్లి అక్కడ తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 7:30 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, 8:30 గంటలకు పుష్ప యాగశయనోత్సవము (పవళింపు సేవ)తో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయన్నారు.




సిఎస్ఎస్ఆర్ పోటీల్లో సత్తా చాటిన ఎపిఎస్‌డిఆర్ఎఫ్ టీమ్ సభ్యులతో డిజిపి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

# సిఎస్ఎస్ఆర్ పోటీల్లో ఎపిఎస్‌డిఆర్ఎఫ్ సత్తా

## - రూ.75 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించిన డిజిపి హరీష్‌కుమార్ గుప్త

విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: జాతీయ స్థాయి సిఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎపిఎస్‌డిఆర్ఎఫ్) ప్రతిభ చాటుకుంది. న్యూఢిల్లీలోని ఘజియాబాద్‌లో 8వ బెటాలియన్ ఎన్‌డిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఎనిమిది రాష్ట్రాలకు (బీహార్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్) చెందిన బృందాలు పాల్గొనగా, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ జట్టు రన్నర్‌అప్-2గా నిలిచింది. ఈ జట్టుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, ఎన్‌డిఆర్ఎఫ్ డిజి పీయూష్ ఆనంద్ చేతుల మీదుగా ట్రోఫీతో పాటు రూ.50 వేల నగదు బహుమతిని అందుకుంది.

అంతకు ముందు నిర్వహించిన రీజినల్ స్థాయి పోటీల్లోనూ ఎపిఎస్‌డిఆర్ఎఫ్ జట్టు రన్నరప్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకుంది. ఈ పోటీల్లో దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ చెందిన టీంలు పాల్గొన్నాయి.

పోటీల్లో విజయం సాధించిన బృందాన్ని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అభినందించి రూ.75వేల నగదు ప్రోత్సాహకాన్ని గురువారం మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణ, సమర్థవంతమైన శిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విపత్తు నిర్వహణలో వారి సామర్థ్యం మరింత బలపడిందని అన్నారు.

2024లో సంభవించిన బుడమేరు వరదలలో ఎపిఎస్‌డిఆర్ఎఫ్ టీమ్స్ చేసిన అత్యున్నత సేవను గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.2కోట్లు బడ్జెట్‌ని కేటాయించిదన్నారు. ఆ నిధులతో ఆధునిక పరికరాలు కొనుగోలు చేసిందన్నారు. ఈ ఆధునిక పరికరాల సాయంతో ఎపిఎస్‌డిఆర్ఎస్ బృందం ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు.. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్‌కుమార్ గుప్తాతోపాటు సిఐడి విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, పోలీసు నియామక మండలి చైర్మన్ ఆర్కే మీనా, శాంతిభద్రతల విభాగం అదనపు డిజిపి ఎన్. మధుసూదన్ రెడ్డి, నిఘా విభాగాధిపతి మహేష్ చంద్ర లడ్డా, బెటాలియన్ ఐజి బి రాజకుమారి, ఐజీలు సిహెచ్ శ్రీకాంత్, పిహెచ్ డి రామకృష్ణ, రవిప్రకాశ్, ఆకే రవి కృష్ణ, డిఐజీలు సెంథిల్ కుమార్, ఫక్కీరప్ప, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కోర్టు జడ్జి తీర్పులో 29 అక్షరాల పదం

## నెట్టింట వైరల్ అయిన 'ఫ్లాక్సినాసిని హిలిపిలిఫికేషన్'



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఢిల్లీ కోర్టు జడ్జి గురువారం ఓ కేసు తీర్పులో ఏకంగా 29 అక్షరాల పొడవైన పదాన్ని ఉపయోగించారు. ఈ పదం అర్థం ఏమిటా అని నెటిజన్‌లు ఇంటర్నెట్‌లో జోరుగా వెతుకుతున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఉపయోగించిన ఆ ఇంగ్లిష్ పదం ఇప్పుడు తెగ ట్రెండ్ అవుతోంది. నిర్మలా సీతారామన్‌పై ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సోమనాథ్ భారతి భార్య లిపికా మిశ్రా గతంలో పరువు నష్టం దావా వేశారు. 2024 ఎన్నికల సమ యంలో ఓ మీడియా సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తమ వైవాహిక విభేదాలను ప్రస్తావిస్తూ పరువుకు భంగం కలిగేలా మాట్లాడారని దావాలో పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఫ్లాక్సినాసినిహిలిపిలిఫికేషన్ అనే పదాన్ని ప్రయోగించారు. లిపికా మిశ్రా ఆరోపణల్లో నిజం లేదని, ఈ పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదని జడ్జి అన్నారు.

కాగా ఈ ఫ్లాక్సినాసిని హిలిపిలిఫికేషన్ అనే పదాన్ని ఏదైనా ఒక విషయాన్ని నిరుపయోగమైనదిగా పరిగణించే సమయంలో ఉపయోగిస్తారు. అంటే ఆ విషయం అంతగా విలువ లేనిదని, పనికిరానిదని అర్థం. లాటిన్ మూలాల నుంచి ఈ పదం వచ్చింది. ఫ్లాక్సీ, నాసీ, నిహిలి, పిలి అనే నాలుగు పదాలను కలిపి దీన్ని రూపొందించారు. వీటన్నింటి అర్థం విలువ లేదు అని పరిగణిస్తారు. అయితే చూడటానికి చాలా పొడవుగా పలకడానికి చాలా క్లిష్టంగా ఉండటంతో రోజువారీ సంభాషణల్లో దీన్ని ఎక్కువగా ఉపయోగించడం లేదు.

# 'సర్' అధికారులను నిర్బంధిస్తారా?

- 'సుప్రీం' అధికారానికే ఇది సవాల్
- మమత సర్కార్‌పై సిజెఐ సూర్యకాంత్ ఆగ్రహం
- సిఎస్, డిజిపిలకు నోటీసులు
- ఘటనపై సిబిఐ లేదా ఎన్ఐఎతో విచారణ జరిపించండి
- పాలన నా చేతుల్లో లేదు.. ఆ ఉదంతం తెలియదు: సిఎం మమత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించారని ఆగ్రహించిన ప్రజలు పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు న్యాయాధికా రులను గంటల తరబడి బందీలుగా పట్టుకున్న ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం న్యాయాధికారులను భయపెట్టే ప్రయత్నమే కాదు, సుప్రీంకోర్టు అధికారానికే సవాల్ విసిరేలా ఉందని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సిబిఐ లేదా ఎన్ఐఏతో విచారణ జరిపించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దర్యాప్తును తామే పర్యవేక్షి స్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తమ పేర్లను తొలగించారంటూ ఆగ్రహించిన కొందరు నిరసనకారులు.. మాల్దాలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను బుధవారం మధ్యాహ్నం ఘెరావ్ చేశారు. దాదాపు 9 గంటల పాటు వారిని నిర్బంధించారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో భారీ పోలీస్, పారామిలటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని సురక్షి తంగా విడిపించాయి. అధికారులను అక్కడి నుంచి తరలిస్తుండగా వారి వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి.





ఈ ఘటనలో ఓకారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'సాయంత్రం 5 గంటలకు అధికారులను నిర్బంధిస్తే, రాత్రి 11 గంటల వరకు వారికి సహాయం అందలేదు. ఇది సాధారణ ఘటన కాదు. న్యాయాధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసి, కొనసాగుతున్న ప్రక్రియను అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వ కంగా, ప్రణాళికాబద్ధంగా చేసిన దాడిలా కనిపి స్తోంది' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కోలకత్తా హైకోర్టు చీఫ్ జస్టిస్ స్వయంగా డిజిపి, హోం సెక్రటరీకి ఫోన్ చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తన విధిని నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైందని కోర్టు అభిప్రాయపడింది. అధికారులకు భద్రత కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇకపై అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఇద్దరు, ముగ్గురి కంటే ఎక్కువ మందిని అనుమతించరాదని, విచారణ కేంద్రాల వద్ద ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సమయంలో బెంగాల్ అడ్వొకేట్ జనరల్ జోక్యం చేసుకోగా, సిజెఐ తీవ్రంగా స్పందించారు. "దురదృష్టవశాత్తు మీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషలోనే మాట్లాడతారు. దేశంలోనే అత్యంత ధ్రువీకరించబడిన రాష్ట్రం మీది. అర్ధరాత్రి 2 గంటల వరకు నేనే స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాను. ఆ దుండగులు ఎవరో మాకు తెలియదనుకుంటున్నారా? ఇది చాలా దురదృష్టకరం' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**ఆ అధికారుల నిర్బంధం తెలియదు..**

**పాలన నా చేతుల్లో లేదు: మమతాబెనర్జీ**

మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. సాగర్‌దిఘిలో నిర్వహించిన ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఇసి చేతిలోకి వెళ్లాయని మమతా బెనర్జీ అన్నారు.

## తోటి విద్యార్థుల వేధింపులతో వైద్య విద్యార్థిని ఆత్మహత్య

**బెంగళూరు, ఏప్రిల్ 2:** కర్ణాటకలోని మల్లాడి హళ్లిలో దారుణం జరిగింది. తనకు పాఠాలు చెప్పే ప్రొఫెసర్‌తో సంబంధం ఉందని తోటి విద్యార్థులు అవమానించడంతో వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక, మల్లాడిహళ్లిలోని రాఘవేంద్ర ఆయుర్వేద కళాశాలలో నిఖిత (22) అనే విద్యార్థిని బిఏఎంఎస్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో పనిచేస్తున్న డా. రాజు అనే ప్రొఫెసర్‌తో నిఖితకు మంచి సన్నిహిత సంబంధం ఉండేది. అయితే దీన్ని తప్పుగా అర్థం చేసుకున్న ఆమె క్లాస్‌మేట్స్ ఇద్దరి మధ్య ఎఫైర్ ఉందని భావించారు. కళాశాలలో ప్రచారం జరిగింది. వీరిద్దరి వారి వేధింపులు భరించలేక నిఖిత తన స్వగ్రామం లోని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. సూసైడ్ నోట్ రాసింది. ఈ ఘటనపై యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటి విద్యార్థులు నిఖితను మానసికంగా వేధిస్తూ, అవమానాలకు గురి చేశారని కంప్లైంట్‌లో పేర్కొన్నారు.



### రాజ్యసభ ఉపనేత పదవి నుంచి
## రాఘవ్ చద్దా తొలగింపు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 2:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడైన రాఘవ్ చద్దాపై ఆ పార్టీ చర్యలు చేపట్టింది. 2023 నుంచి రాజ్యసభలో ఉప నేతగా ఉన్న ఆయనను ఆ పదవి నుంచి తొలగించింది. పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఆ పార్టీ నియమించింది. ఈ మార్పునకు సంబంధించి అధికారిక లేఖను రాజ్యసభ సచివాలయానికి ఆప్ పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే సభలో మాట్లాడటానికి రాఘవ్ చద్దాకు సమయం కేటాయించకూడదని కూడా ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. ఆప్ తీసుకున్న ఈ కీలక నిర్ణయంపై రాఘవ్ చద్దా మౌనం వహించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో చీలిక ఏర్పడిందనే వదంతులు మరింత తీవ్రమయ్యాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఇతర నేతలను నిర్దోషులుగా ఢిల్లీ కోర్టు ఫిబ్రవరిలో ప్రకటించింది. అయితే రాఘవ్ చద్దా దీనిపై స్పందించలేదు. అలాగే పార్టీ కార్యాలయంలో కేజ్రీవాల్ ప్రసంగించిన సమావేశంతో పాటు జంతర్ మంతర్ వద్ద జరిగిన జనసభ వంటి కీలక పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దా పార్టీకి దూరంగా ఉంటున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

# 16 నుంచి ప్రత్యేక పార్లమెంటు

### మూడు రోజులు సమావేశాలు జరిగే అవకాశం
**మహిళా రిజర్వేషన్, సీట్ల పెంపు బిల్లులు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు కోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే బడ్జెట్ సమావేశాలు వాస్తవ షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్ 2వ తేదీ గురువారంతో ముగియాల్సి ఉండగా, నిరవధికంగా వాయిదా పడలేదు. కొద్ది రోజులు విరామం తర్వాత తిరిగి 16 నుంచి పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుతోపాటు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు పెంపు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులు తీసుకురావడానికి ఏప్రిల్ మూడో వారంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోక్‌సభ సీట్లను 816కు పెంచనున్నట్లు ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్థానాలు 816కు పెంచే బిల్లులో 273 స్థానాలకు మహిళలకు రిజర్వ్ చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిబంధనను 2023లో రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా తీసుకువచ్చారు, కానీ ఇది నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాత అమల్లోకి వస్తుంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుత 543 నుండి 816కు పెంచుతారు, ఇందులో 273 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడతాయి. ప్రతిపాదిత 2027 జనాభా లెక్కల ఆధారంగా కాకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. రాష్ట్ర శాసన సభలకు కూడా ఇదే విధమైన ప్రక్రియ చేపట్టబడుతుంది, అక్కడ సీట్లు దామాషా పద్ధతిలో రిజర్వ్ చేయబడతాయి. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగల విషయంలో జనాభా ఆధారంగా మహిళలకు, అలాగే మహిళలకు రిజర్వ్ చేయగల నియోజకవర్గాలను నిర్ణయించగల పునర్విభజన ప్రక్రియతో పాటు, రొటేషన్ పద్ధతి ద్వారా కూడా నియోజకవర్గాలు నిర్ణయించవచ్చు. 2023 సెప్టెంబర్‌లో, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీ శక్తి వందన్ బిల్లుకు తన ఆమోదం తెలిపారు. ఈ చట్టాన్ని అధికారికంగా రాజ్యాంగ (106వ సవరణ) చట్టం అని పిలుస్తారు. ఒక రాజ్యాంగ సవరణ బిల్లు, సాధారణంగా మహిళా రిజర్వేషన్ చట్టంగా పిలువబడే నారీ శక్తి వందన అధినియమును సవరించనుండగా, మరో సాధారణ బిల్లు నియోజక వర్గాల పునర్విభజన చట్టాన్ని సవరిస్తుంది. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత, ప్రతిపాదిత చట్టాలు 2029 మార్చి 31న అమల్లోకి వస్తాయి. ఇవి రాబోయే లోక్‌సభ ఎన్నికలు, అలాగే ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఆంధ్రప్రదేశ్‌లలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో మహిళలకు సీట్లు రిజర్వ్ చేయడానికి సహాయపడతాయి.

## అఖిలపక్షానికి మోడీ ఎందుకు రాలేదు!

**పార్లమెంట్‌లో ఖర్గే, రిజిజుల మధ్య వాగ్వాదం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు. తాము ప్రతినిధులను పంపినా ప్రధాని రాలేదని, కేవలం ఉపన్యాసాలు వినడానికి తాము రావాలా అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు ఘాటుగా స్పందించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరమని అన్నారు. అదే అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నేతలు ఎందుకు హాజరు కాలేదని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగొచ్చని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యూహరచన కోసం ప్రభుత్వం సర్వపక్ష భేటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడం రాజకీయ దుమారానికి కారణమైంది.

## పర్వతారోహకులకు రహస్య ఫుడ్‌పాయిజన్

### రూ.186 కోట్ల కుంభకోణంపై నేపాల్ పోలీస్ దర్యాప్తు

**ఖాట్మండు, ఏప్రిల్ 2:** ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంగా ప్రఖ్యాతిగాంచిన మోంట్ ఎవరెస్ట్ పర్వతారోహకులకు సంబంధించి సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. పర్వాతారోహకులు ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తీసుకొనే ఆహారాన్ని రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేస్తున్నారని తేలింది. కొంతమంది ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి ఈ కుట్రకు పాల్పడుతున్నారని, అత్యవసర పరిస్థితిని సృష్టించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారని నేపాల్ పోలీసులు అభియోగాలు మోపారు. ఎవరెస్ట్ పర్వతారోహకులు తీసుకునే ఆహారం లో బేకింగ్ సోడా మోతాదును పెంచుతున్నారు. దాంతో వారు జీర్ణకోశ సమస్యలకు గురవుతున్నారు. ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని ట్రెక్కర్లను వారు నమ్మిస్తుంటారు. అప్పుడే వారి భయాన్ని సొమ్ము చేసుకోవడం మొదలవుతుంది. వారిని అత్యవసరంగా ఆస్పత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను రప్పిస్తారు. ఎంత డబ్బయినా చెల్లించేలా అప్పటికే బాధితులను ఒప్పిస్తారు. పక్కాగా జరుగుతున్న ఈ కుట్రలో కొందరు షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు కలిసి పనిచేస్తున్నాయి. తర్వాత నకిలీ వైద్యం, ఫ్లైట్ పత్రాలు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బులు పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. తర్వాత బీమా సొమ్మును షెర్పాలు, హెలికాప్టర్ కంపెనీలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, నకిలీ పత్రాలు ఇచ్చిన ఆసుపత్రులు పంచుకుంటున్నాయని వెల్లడించారు. ఈ మోసం విలువ 20 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.186 కోట్లు అని అంచనా వేశారు. పర్వతాల్లో సహాయక చర్యలు చేపట్టే సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ పర్యాటకంలో ఎంతో కీలకమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్‌లో జరుగుతున్న మోసాన్ని అక్కడి న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. పర్యాటకుల విషయంలో ఇలాంటి స్కామ్‌లు వెలుగుచూడటం ఇది తొలిసారి కాదు. అందుకే ఈ మోసాల కారణంగా పలు అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. దీనిపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా కఠిన శిక్షలు లేకపోవడమే కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

### ఎన్నికల్లో గెలిస్తే ఉద్యోగాల్లో
## మహిళలకు 50శాతం రిజర్వేషన్

### కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మేనిఫెస్టో విడుదల



**తిరువనంతపురం, ఏప్రిల్ 2:** అసెంబ్లీ ఎన్నికలలో తాము విజయం సాధిస్తే ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా కేటాయిస్తామని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యంగా 60 పాయింట్లతో రెండు వాల్యూమ్‌లుగా దీన్ని రూపొందించారు. కాగా 140 స్థానాలున్న కేరళలో 9న ఎన్నికలు జరగనున్నాయి. నెలవారీ పింఛన్ రూ.3 వేలకు పెంచనున్నట్లు ప్రకటించారు. అత్యంత పేదరికంలో ఉన్న ఐదు లక్షల కుటుంబాలను ఆదుకుంటామని, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వృద్ధులకు, రోగులకు మెరుగైన సంరక్షణ అందిస్తామని, చదువుకున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కల్పిస్తామన్నారు. నైపుణ్య శిక్షణ ప్రోగ్రామ్‌లు విస్తరిస్తామని, బ్యాక్ టూ క్యాంపస్ పేరుతో నిరుద్యోగులకు నైపుణ్యాలు అందిస్తామని, 50 శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయిస్తామని తెలిపారు. మహిళలు ఉద్యోగాలు చేసుకునేందుకు వీలుగా సురక్షిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. శిశు సంరక్షణ, నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించడం, విద్యావంతులైనవారు చేపట్టే వ్యాపారాలకు వడ్డీ లేని రుణాలు అందించడం లాంటివి కూడా మ్యానిఫెస్టోలో ఉన్నాయి.

### బొగ్గు స్మగ్లింగ్ స్కాం...
## ఐప్యాక్ కార్యాలయాల్లో అధికారుల సోదాలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయా ల్లో గురువారం దర్యాప్తు సంస్థ ఇడి సోదాలు చేపట్టింది. పశ్చిమబెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో అధికారులు సోదాలు చేపడుతున్నారు. ఈ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టిసారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం బెంగాల్‌లో జరిగిన ఈ రైడ్స్ చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. సోదాలు జరుగుతున్న సమయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంటిపై కూడా తనిఖీలు జరగడం గమనార్హం. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఇడి ఆరోపించింది. ఆ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉంటే 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టిఎంసితో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.




గురువారం తిరుచ్చిలో నామినేషన్ దాఖలు చేస్తున్న టివికె అధినేత విజయ్

## 'జననాయగన్' విడుదలపై కుట్ర: విజయ్

**చెన్నై, ఏప్రిల్ 2:** కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా విడుదల విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సినిమా విడుదలను ఉద్దేశించి ఆయన కీలక ఆరోపణలు చేశారు. విడుదల విషయంలో కుట్ర జరుగుతోందన్నారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. 'కరూర ఘటన ఒక ఉమ్మడి కుట్ర అని చాలామంది చెబుతున్నారు. మీకు న్యాయం జరగలని నేను ఎలా అయితే కోరుతున్నానో.. నాకు కూడా న్యాయం కావాలని కోరుతున్నా' అని విజయ్ అన్నారు. తన సినిమా 'జననాయగన్' విడుదల విషయంలో ఏదో జరుగుతోందని ఆరోపించారు. ఎల్పీజి సిలిండర్ల కొరతపై స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. 'తన కుటుంబానికి ఏదైనా సమస్య వస్తే ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఢిల్లీ విమానం ఎక్కేస్తారు. ఎల్పీజి సిలిండర్ల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన దేశ రాజధానికి వెళ్లరా?' అని ప్రశ్నించారు. నటుడిగా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్ తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీని స్థాపించి.. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు.

# సిఎం పదవికి నితీశ్ రాజీనామా

### 10న ఎంపిగా ప్రమాణం



**పాట్నా, ఏప్రిల్ 2:** బీహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన బీహార్ సీఎం తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఈ నెల 10న ప్రమాణ స్వీకారం చేస్తారు. నితీష్ కుమార్‌తోపాటు కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ అదే రోజు ప్రమాణ స్వీకారం చేస్తారు. రాజ్యసభలో ప్రమాణానికి ఈ నెల 9న నితీష్ ఢిల్లీ వెళ్తారు. ఈనెల 10న ప్రమాణం అనంతరం, ఏప్రిల్ 12న బీహార్ రాజధాని పాట్నాకు తిరిగొస్తారు. ఆ తర్వాత ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. ఆలోపు కొత్త సీఎంను ఎన్నుకుంటారు. కొత్త సీఎం ఆధ్వర్యంలో బీహార్ నూతన ప్రభుత్వం ఈ నెల 14న కొలువుదీరే అవకాశం ఉంది. నితీష్ సీఎం పదవి నుంచి తప్పుకోనున్నప్పటికీ, ఆయన భద్రత విషయంలో మాత్రం రాజీపడటం లేదు. రాష్ట్ర హోం శాఖ ఈ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. నితీష్ రాజ్యసభ ఎంపీ అయినప్పటికీ, ఆయనకు సీఎంలకు ఇచ్చే జడ్+ సెక్యూరిటీని కొనసాగించాలని నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై స్పెషల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదేశాలు జారీ అయ్యాయి. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీష్ పదవికి రాజీనామా చేయడం పార్టీ వర్గాల్లో కొంత గందరగోళానికి దారితీసింది. నితీష్ తర్వాత ఎవరు సీఎం పదవి చేపడతారు అనే చర్చ కొనసాగుతోంది. ఈ విషయంలో ఎన్‌డీయే కూటమిగా ఉన్న ప్రభుత్వంలో బీజేపీ అభ్యర్థి సీఎం అవుతారని సమాచారం. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న సామ్రాట్ చౌదరి (బీజేపీ) సీఎం రేసులో ఉన్నారు. కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పేరు కూడా వినిపిస్తోంది. త్వరలో బీజేపీ కార్యనిర్వాహక సమావేశం అనంతరం సీఎంను ఎన్నుకునే అవకాశం ఉంది. కేంద్ర బీజేపీ నాయకుల సూచన మేరకే రాష్ట్రంలో నిర్ణయాలుంటాయి. బీజేపీ గతంలో ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉంది. 20 ఏళ్లుగా కూటమిలో ఉన్నా ఎప్పుడూ నేరుగా అధికారం చేపట్టలేదు. ఈసారి మాత్రం బీజేపీ అభ్యర్థి సీఎం పదవి చేపట్టబోతున్నారు.

### ఆగ్నేయాసియా దేశాల్లో ఇరాన్ యుద్ధ ప్రభావం
# చమురు, గ్యాస్ ధరలు రెట్టింపు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ప్రపంచమంతా విస్తరిస్తున్నది. ఆగ్నేయాసియాలో ఇంధన అత్యవసర పరిస్థితి ప్రారంభమైంది. ఈ క్రమంలో మార్చి 24న ఫిలిప్పీన్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ జాతీయ ఇంధన ఎమర్జెన్సీని ప్రకటించారు. నెల రోజుల వ్యవధిలో పెట్రోల్ ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఇదే కాలానికి డీజిల్ ధరలు ఇంచుమించు రెట్టింపయ్యాయి. దీంతో అధ్యక్షుడు మార్కోస్ ఒక కమిటీని ఏర్పాటు చేసి పెరిగిన ధరల ప్రభావం ఏయే రంగాలపై పడింది, ప్రైవేట్ రంగం శిలాజ ఇంధన వాడకం తగ్గింపుపై అన్వేషించాల్సి మార్గాలపై నివేదిక ఇవ్వాలని కోరారు. 30 రోజుల పాటు బియ్యం ధరపై గరిష్ఠ పరిమితిని విధించాలని యోచిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. చమురుపై ప్రభుత్వ పన్నులు రద్దు చేయాలన్న విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ప్రభుత్వం విధించిన ఆంక్షలు, పరిమితుల పట్ల రవాణా, మరికొన్ని రంగాల కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా కంబోడియాలో చమురు ధరలు 68 శాతం పెరిగాయి. దీంతో ప్రభుత్వం చమురుపై పన్నులు తొలగించడమే కాక, ఇంధన పరిరక్షణ చర్యలు చేపట్టాలంటూ రాష్ట్రాలను ఆదేశించింది. అసలే అప్పుల్లో కూరుకుపోయి ఉన్న లావోస్ దేశం అత్యధికంగా చమురు దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ పాఠశాలలు మూడు రోజులు మాత్రమే తెరిచేలా ఆదేశాలు అమలు చేస్తున్నది. ఎలక్ట్రిక్ కార్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు సర్వీస్ ఫీజును తగ్గించింది. గ్యాస్ ఆధారంగా నడిచే వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని ప్రభుత్వ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. వియత్నాంలో అక్కడి ప్రభుత్వం ఏప్రిల్ 15 వరకు కొన్ని చమురు పన్నులను సున్నా శాతానికి తగ్గించేసింది. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ చేయాలని ఆదేశించింది. ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిల్వ చేయవద్దని థాయ్‌లాండ్ ప్రధాని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఇంధన సరఫరాలను బలోపేతం చేసుకోవడానికి ఆస్ట్రేలియా, సింగపూర్ సంయుక్తంగా చర్యలు ప్రారంభించాయి. ఆస్ట్రేలియా ఇదే తరహా ప్రయత్నాలను మలేషియాతో కూడా కొనసాగిస్తున్నది. చమురు కోసం ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన పోటీ నెలకొంది. సముద్రంలో రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయడంతో ఈ ప్రాంతంలోని అనేక దేశాలు దానిని కొనుగోలుకు ఆసక్తి చూపాయి. కాగా, తమ నౌకలు హర్మూజ్ జలసంధి మీదుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా వచ్చేందుకు ఇరాన్‌తో తాము ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు థాయ్ ప్రధాని అనుథిన్ చర్న్‌విరకుల్ ప్రకటించారు.

# మంటల్లో పశ్చిమాసియా

### హర్మూజ్ భద్రత మీరే చూసుకోండి...
## పశ్చిమాసియాపై ఆధారపడిన దేశాలకు ట్రంప్ అల్టిమేటమ్



**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** హర్మూజ్ జలసంధిలో భద్రతను పశ్చిమాసియాపై ఆధారపడిన దేశాలే చూసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ వల్లే చమురు ధరలు పెరుగుతున్నాయని, అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులకు ఆ దేశమే కారణమని తీవ్రంగా ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పిచ్చి ఉగ్రదాడులకు పాల్పడటం వల్లే గ్యాసోలిన్ ధరలు పెరిగాయి. ఇలాంటి ఇరాన్‌ను అణ్వాయుధాల విషయంలో ఎప్పటికీ నమ్మలేమని ట్రంప్ అన్నారు. హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణా చేసే దేశాలు ఇకపై భద్రతా భారాన్ని మోయాలని ఆయన తేల్చిచెప్పారు. ఆ మార్గాన్ని వాళ్లే చూసుకోవాలి. దాన్ని వాళ్లే కాపాడుకోవాలి. చాలా దేశాలు ఈ వివాదంలో జోక్యం చేసుకోకుండా కేవలం లబ్ధి పొందుతున్నాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇతర దేశాలకు ఆయన రెండు మార్గాలను సూచించారు. మొదటిది, అమెరికా నుంచి చమురు కొనండి. రెండోది, కాస్త ధైర్యం తెచ్చుకుని ఆ జలసంధికి వెళ్లి దాన్ని మీకోసం మీరే రక్షించుకోండని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం అమెరికా ప్రపంచంలోనే నంబర్ వన్ ఇంధన ఉత్పత్తిదారు అని, సౌదీ అరేబియా, రష్యా కంటే కూడా ఎక్కువ ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. పశ్చిమాసియా నుంచి తమకు చమురు అవసరం లేదని, హర్మూజ్ ద్వారా తాము దాదాపుగా దిగుమతులు చేసుకోవడం లేదని స్పష్టం చేశారు.

## అమెరికా ప్రజలతో మాకు ఎలాంటి శతృత్వంలేదు

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ బహిరంగ లేఖ

**టెహ్రాన్, ఏప్రిల్ 2:** అమెరికా ప్రజలతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదని, ఇజ్రాయెల్ కోసం అమెరికా ప్రభుత్వం తమతో ప్రాక్సీ యుద్ధం చేస్తోందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలను ఉద్దేశించి ఆయన రాసిన బహిరంగ లేఖలో ఈ కీలక ఆరోపణలు చేశారు. ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో తమ దేశ వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. అమెరికా ప్రజలతో సహా మరే ఇతర దేశ ప్రజలపైనా ఇరాన్ ప్రజలకు శత్రుభావం లేదు. తమ చరిత్రలో అనేక విదేశీ జోక్యాలను, ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ, ఇరాన్ ప్రజలు ఎల్లప్పుడూ ప్రభుత్వాలను, ప్రజలను వేరుగానే చూశారని పెజెష్కియాన్ తన లేఖలో పేర్కొన్నారు. ఇరాన్ తన ఆధునిక చరిత్రలో ఎన్నడూ ఆక్రమణలకు లేదా విస్తరణవాదానికి పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌ను ఒక ముప్పుగా చిత్రీకరించడం అనేది పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తున్న నేరాల నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడానికి పన్నిన వ్యూహమని ఆరోపించారు. ఇజ్రాయెల్ తన చట్టవిరుద్ధ ప్రయోజనాల కోసం ఆఖరి అమెరికన్ సైనికుడు, ఆఖరి అమెరికన్ పన్ను చెల్లింపుదారుడి డాలర్ వరకు పోరాడాలని చూస్తోంది. ప్రస్తుత అమెరికా ప్రభుత్వ ప్రాధాన్యం నిజంగా అమెరికా ఫస్టేనా అని ఆయన ప్రశ్నించారు.

### దెబ్బతిన్న దేశాన్ని సమష్టిగా
## పునరుద్ధరించుకుందాం: ఖమేనీ



**టెహ్రాన్, ఏప్రిల్ 2:** జియోనిస్ట్ అమెరికా, ఇజ్రాయిల్ శక్తులు ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకుండానే దాడులు చేసి విధ్వంసం సృష్టించాయని, ఈ దాడిలో ధ్వంసమైన మౌలిక సదుపాయాలను పునరుద్ధరించి దేశాన్ని పునర్నిర్మించేందుకు దేశవ్యాప్తంగా కృషి చేయాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే, జాతీయ ప్రకృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ సందేశం ఇచ్చినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ ప్రెస్ టీవీ వెల్లడించింది. ఇటీవలి ఘర్షణల తర్వాత దేశ భవిష్యత్ శ్రేయస్సు కోసం జాతీయ ప్రయత్నాలు సాగాలని ఆయన స్పష్టం చేశారు. దివంగత అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడైన మొజ్తబా ఖమేనీ, శత్రువుల దాడులు కేవలం ప్రజలనే కాకుండా దేశ భూభాగాన్ని, సహజ పర్యావరణాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రూరమైన అమెరికా, జియోనిస్ట్ శత్రువులు తమ అనాగరిక చర్యలలో ఎలాంటి మానవ, నైతిక పరిమితులు పాటించడం లేదు. ఇలాంటి సమయంలో దేశం అంతర్గత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన వ్యాఖ్యానించినట్లు పిలుపునిచ్చారు. భవిష్యత్తు కోసం చేపట్టే ప్రతి ప్రయత్నం ఎంతో విలువైందని, అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన తన సందేశంలో నివాళులర్పించారు. ముఖ్యంగా దేశంలోని దక్షిణ నగరమైన మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో 186 మంది విద్యార్థినులు మరణించినట్లు ప్రెస్ టీవీ నివేదించింది. పిల్లలను చంపే రాక్షస అమెరికా, జియోనిస్ట్ దుర్మార్గులు పాఠశాలలోని పసిమొగ్గలను కిరాతకంగా బలిగొన్నారని ఖమేనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అబద్ధాలతో అనవసరంగా
## ఇరాన్‌పై అమెరికాయుద్ధం

### బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా ఆరోపణలు

**సియారా (బ్రెజిల్), ఏప్రిల్ 2:** ఇరాన్‌తో అనవసర యుద్ధానికి దిగేందుకు అమెరికా ఒక అబద్ధాన్ని సృష్టించిందని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉందని లేదా వాటిని తయారు చేయడానికి ప్రయత్నిస్తోందని అమెరికా చెబుతున్నది పచ్చి అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. బ్రెజిల్‌లోని సియారా రాష్ట్రంలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో లూలా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇరాక్‌లో కూడా సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయంటూ అబద్ధాలు చెప్పి అమెరికా యుద్ధానికి దిగిందని, కానీ ఆ ఆయుధాలు ఎన్నడూ కనుగొనలేదని ఆయన గుర్తుచేశారు. ఇదంతా కేవలం ఒక సాకు మాత్రమే యుద్ధం ఎప్పుడూ దేనినీ పరిష్కరించలేదని లూలా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివాదంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి హేతుబద్ధంగా ఆలోచించి, జోక్యం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ యుద్ధం వల్ల తమ దేశంపై ప్రత్యక్ష ప్రభావం పడుతోందని లూలా ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధి మూసివేతతో బ్రెజిల్‌లో డీజిల్ ధరలపై తీవ్ర ఒత్తిడి పెరిగిందన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం.. ఒత్తిడిలో అమెరికా సైనికులు?

**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** నెల రోజులకుపైగా కొనసాగుతోన్న ఇరాన్ యుద్ధంతో అమెరికా సైనికులు ఒత్తిడికి గురవుతున్నారు. పశ్చిమాసియాలో మోహరింపులపై ఆందోళనగా ఉన్నారు. ఆ భయాల నుంచి బయటపడేందుకు, సేద దీరేందుకు భారీగా డబ్బులు వెచ్చిస్తున్నారంటూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విడుదల చేసిన ఓ వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. 'సైనిక స్థావరాలను సమీపంలో ఉన్న మా క్లబ్ వద్దకు భారీగా సైనికులు వస్తున్నారు. వారంతా ఒత్తిడిలో కనిపిస్తున్నారు. వచ్చేవారం మేం వెళ్తున్నామంటూ యుద్ధం గురించి చెబుతున్నారు. వారిలో చాలా చిన్నవయసు వారున్నారు. వారిని చూస్తుంటే ఎంతో ఉద్వేగంగా అనిపించింది' అని ఆ ఇన్‌ఫ్లుయెన్సర్ వెల్లడించారు. పశ్చిమాసియాలో అమెరికా మోహరింపులు పెంచుతున్న వేళ ఈ వీడియో వెలుగులోకి వచ్చింది.

3-4Pg6exHMNWJQE.qxd:3-4Pg6exHMNWJQE.qxd 1/1/02 6:00 AM Page 1



# ఎపి పర్యాటకానికి కేంద్రం ఊతం

● మంత్రి కందుల దుర్గేష్ వాస్తిన పర్యటన సక్సెస్ ● నూతన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సానుకూల స్పందన ● రూ.915 కోట్ల విలువైన 9 కొత్త ప్రాజెక్టులకు మంత్రి దుర్గేష్ ప్రతిపాదనలు సమర్పణ ● పెండింగ్‌లో ఉన్న 6 సాంస్కృతిక ప్రాజెక్టులపై కీలక చర్చలు ● ఆమోదానికి కేంద్ర మంత్రి హామీ



విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో నిధుల సాధనే లక్ష్యంగా, అభివృద్ధి పనుల ఆమోదమే మార్గంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేపట్టిన ఢిల్లీ పర్యటన విజయవంతమైంది. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఆయన నివాసంలో మంత్రి దుర్గేష్ కలిశారు. ఈ కీలక భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై కూలంకషంగా చర్చించారు. రాష్ట్రంలో ఐకానిక్ పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక సర్క్యూట్ల బలోపేతం కోసం మంత్రి దుర్గేష్ చేసిన విన్నపాన్ని కేంద్రం ఆమోదించింది. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక మౌలిక సదుపాయాల బలోపేతానికి రూ.915 కోట్ల విలువైన 9 కొత్త ప్రాజెక్టులతో పాటు, తెలుగు భాష మరియు కళల పరిరక్షణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 6 కీలక సాంస్కృతిక ప్రాజెక్టులపై చర్చించగా కేంద్రం సానుకూలంగా స్పందించింది. గతంలో మంత్రి కందుల దుర్గేష్ చేసిన కృషి ఫలితంగా శాస్కి, ప్రసాద్, స్వదేశీ దర్శన్, సిబిడిడి వంటి పథకాల కింద రాష్ట్రానికి ఇప్పటికే మంజూరైన 8 పర్యాటక ప్రాజెక్టులకు రూ.430 కోట్లు కేంద్రం మంజూరు చేయగా వాటి పురోగతిని వివరించి త్వరిత గతిన నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థించగా సానుకూలంగా స్పందించారు.

**ఆధ్యాత్మిక పర్యాటకం:** ప్రసాద్ పథకం కింద మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం (రూ.95.18 కోట్లు), అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం (రూ.213.72కోట్లు), వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం (రూ.120కోట్లు), కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం (రూ. 36 కోట్లు), నెల్లూరు గృహమల్లేశ్వర స్వామి ఆలయం (రూ. 48.95కోట్లు) అభివృద్ధికి నిధులు కోరారు.

**బీచ్, ప్రకృతి పర్యాటకం, చారిత్రక ప్రాధాన్యత:** మచిలీపట్నంలో వైబ్రెంట్ బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం స్వదేశ్ దర్శన్ 2.0 కింద రూ.120.04 కోట్లు, లంబసింగిలో పర్యాటక అనుభూతిని మెరుగుపరిచే పనులకు రూ.99.87 కోట్లు, బౌద్ధ క్షేత్రాల వద్ద టెంట్ సిటీల ఏర్పాటుకు రూ.77.32 కోట్లు, లేపాక్షిలో పర్యాటక సౌకర్యాలు, సాంస్కృతిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.103.05 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విద్యా సంస్థల ఏర్పాటు:** ఆంధ్రప్రదేశ్ పద్య నాటకం, సురభి థియేటర్, వీధి నాటకం వంటి గొప్ప రంగస్థల కళలకు నిలయమని, జాతీయ స్థాయిలో గుర్తింపు, సరైన శిక్షణ సంస్థలు లేక ఈ కళలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని వివరించి రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటును త్వరితగతిన ఆమోదించాలని కోరారు. ఇప్పటికే కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి, ఎన్ఎస్‌డి అధికారులు రాజమండ్రిలో స్థల పరిశీలన పూర్తి చేసిన విషయాన్ని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. దీనిని త్వరితగతిన పట్టాలెక్కిస్తామని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ ఇచ్చారని తెలిపారు. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియన్స్, ఇంటర్ ప్రిటేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (పర్యాటక భవన్) ఏర్పాటుకు రూ.100 కోట్ల ఆర్థిక సహాయాన్ని కోరారు. అమరావతిలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ (ఎన్ఐహెచ్) ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

**అకాడమీల ఏర్పాటు:** విశాఖపట్నంలో లలితకళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం, యోగి వేమన, పుట్టపర్తి నారాయణాచార్యులు వంటి మహామహులైన కవుల వారసత్వాన్ని, తెలుగు సాహిత్యాన్ని పరిరక్షించడానికి ఏపీలో సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం, కూచిపూడి నృత్యం, గొప్ప చారిత్రక సాహిత్యం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి కోసం ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) బ్రాంచ్ ఏర్పాటు చేయాలని దుర్గేష్ కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

**అంతర్జాతీయ డెస్టినేషన్లుగా తిరుపతి, విశాఖ:** రాష్ట్రంలోని తిరుపతి, విశాఖపట్నంలను గ్లోబల్ టూరిజం డెస్టినేషన్లుగా తీర్చిదిద్దాలని అందుకు అవసరమైన నిధుల సాయం చేయాలని మంత్రి దుర్గేష్ కోరారు. ఈ సిటీలను దేశంలోని 50 అత్యుత్తమ పర్యాటక కేంద్రాల జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాసిన లేఖను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కేంద్ర మంత్రికి గుర్తుచేశారు. “కొత్త పర్యాటక ప్రాజెక్టులు పట్టాలెక్కితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది..తద్వారా పర్యాటకుల రాక పెరగడమే కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది. ఈ పర్యటన ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.“ అని మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పర్యాటక ప్రాజెక్టుల అమలుపై మంత్రి దుర్గేష్ స్పెషల్ ఫోకస్:** ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన అనంతరం కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ సెక్రటరీ సుమన్ బిల్లాను, కేంద్ర సాంస్కృతిక శాఖ సెక్రటరీ వివేక్ అగర్వాల్‌ను మంత్రి దుర్గేష్ కలిసి కీలక ప్రాజెక్టులపై చర్చించి వాటి పురోగతిని వివరిస్తూ త్వరితగతిన వీటికి కార్యరూపం తీసుకు రావాలని కోరారు. కేంద్రమంత్రికి ఇచ్చిన ప్రతిపాదనలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ప్రభుత్వం సమర్పించిన డిపిఆర్‌లు అత్యంత పకడ్బందీగా ఉన్నాయని పేర్కొన్న సెక్రటరీలు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక రంగాలకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి దుర్గేష్ అన్నారు. “కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాలసీల విషయంలో సానుకూలంగా స్పందించారు. వాటిని కార్యరూపంలోకి తీసుకురావాల్సిన సెక్రటరీలను కలిసి ప్రాజెక్టుల పురోగతిని వివరించాను. ఎపికి పూర్తి సహకారం అందిస్తామని వారు సుముఖత వ్యక్తం చేయడం సంతోషంగా ఉంది అని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

# గూడూరు ఆర్‌ఓబి పనులు తక్షణమే పూర్తి చేయాలి

● కేంద్ర మంత్రి సోమన్నకి ఎంపి గురుమూర్తి వినతి
● సానుకూలంగా స్పందించిన రైల్వే సహాయమంత్రి

విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: గూడూరు పట్టణంలో దీర్ఘకాలంగా నిలిచిపోయిన రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గురువారం డిల్లీలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నకి విజ్ఞప్తి చేశారు. 2008లో 99ఏ, 99బీ లెవల్ క్రాసింగుల స్థానంలో ఈ ఆర్‌ఓబికి అనుమతి ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. అలాగే ఎపిఐఐసి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు ఇది ఓ మార్గంగా చూపినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గూడూరు ముఖ్య రైల్వే జంక్షన్‌గా ఉండటంతో రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, ఆర్‌ఓబి పూర్తికాకపోవడంతో తరచుగా లెవెల్ క్రాసింగు గేట్లు మూసివేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీని వలన భారీ ట్రాఫిక్ సమస్యలు, ఆలస్యాలు ఏర్పడటమే కాకుండా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాల వంటి అత్యవసర సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయనకి వివరించారు. అలాగే పారిశ్రామిక రవాణా, ఆర్థిక కార్యకలాపాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని చెప్పారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ పరిధిలో సమగ్ర రవాణా సదుపాయాలు, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఉండగా, గూడూరు ఆర్‌ఓబీ పూర్తి కావడం ఎంతో కీలకమని గురుమూర్తి తెలిపారు. ప్రస్తుతం నిలిచిపోయిన ఈ ప్రాజెక్ట్ చివరలో కనెక్టివిటీ లోపంగా మారిందని, దీన్ని త్వరగా పూర్తి చేస్తే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు భద్రత, ఆర్థిక అభివృద్ధికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా గూడూరు రైల్వే స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ తెలిపారు. అలాగే వెంకటగిరి, నాయుడుపేట రైల్వే స్టేషన్లలో పలు ముఖ్య రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించాలని గతంలో చేసిన వినతిని మరోసారి గుర్తు చేసినట్లు చెప్పారు. అందువల్ల గూడూరు ఆర్‌ఓబి పనులను ప్రాధాన్యతగా తీసుకుని కేంద్ర రైల్వే శాఖ, సంబంధిత సంస్థల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సోమన్నను ఎంపి గురుమూర్తి కోరగా ఆయన సానుకూలంగా స్పందించి డి.ఆర్.ఎంతో చరవాణి ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు ఎంపి తెలిపారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపి గురుమూర్తి తెలిపారు.

# ‘అమరావతికి చట్టబద్ధత హర్షణీయం’

సచివాలయం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ రాజ్యసభల్లో ఆమోదింపచేసిన సందర్భం హర్షణీయమని రామకృష్ణ తెలిపారు. గురువారం ఎపి సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమావేశమై మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10సంవత్సరాలుగా ఎపికి రాజధాని ఏదో తెలియక ఉద్యోగుల్లో ఏర్పడిన గందరగోళానికి నేటితో తెరపడిందని వివరించారు. గతంలో ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యోగుల నుండి ఎదుర్కొన్న వివక్షత రేపు ఉద్యోగులను చాలా గాయపరిచిందని తెలిపారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ఉద్యోగుల బాధలను అర్థం చేసుకొని అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సొంత భవనాలు నిర్మించుకొని అత్యాధునికంగా పరిపాలన సాగిస్తున్న సందర్భంలో 2019లో అప్పటి ప్రతిపక్ష పార్టీ అధికారంలోనికి రావడం ఆ సమయంలో గందరగోళంలోనికి నెట్టారని తెలిపారు. ఆ సందర్భంలో ఏపిలో బాధ్యతలు నిర్వహించాలంటేనే చాలా బాధ కలిగించిందని తెలిపారు. దీంతో 2024లో తిరిగి అధికారం చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వ సహకారంతో నేడు కేంద్ర ప్రభుత్వంలోని అన్ని పార్టీలను ఒప్పించి అమరావతిని రాజధానిగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి అది కేంద్ర ప్రభుత్వంలోని లోక్‌సభ రాజ్యసభలో ఆమోదం పొందేలా చేయడం స్వాగతిస్తున్నామని తెలిపారు. అందువలన రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి రాజధానిగా అమరావతికి పూర్వ వైభవం రావడానికి స్వాగతించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ ఉద్యోగులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొని మిఠాయిలు పంచుకున్నారు.

# కెజి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే గ్యాస్ సగం రాష్ట్రానికివ్వాలి

## - రౌండ్ టెబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్




విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు పక్షాలకు చెందిన నాయకులు డిమాండ్ చేసారుజ కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌లో సగం ఎపికి ఇవ్వాలనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవనంలో గురువారం సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కృష్ణా గోదావరి బేసిన్‌పై తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంలో “కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును (రోజుకు 21వేల టన్నులు గ్యాస్ ఉత్పత్తి అవుతోందని అంచనా) రిలయన్స్ కంపెనీ పైపులైన్ల ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంటగ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోయింది. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లోఅవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌వి అన్న చందంగా ఉంది. నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం కూడా సిఫార్సు (పేరా 13.35) చేసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. చట్టబద్ధంగా రావలసిన చమురు, సహజ వాయువు వాటా సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఈ సదస్సు కోరుతోంది. న్యాయమైన డిమాండ్ సాధనకు సాగించే ఉద్యమాలకు ప్రజలు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేసింది. కెజి బేసిన్‌లో రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఈ రౌండ్‌టేబుల్ కోరుతోంది. ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు గ్యాస్‌పై మన హక్కుకోసం ఉద్యమించాలని ఈ రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిస్తోందని” పేర్కొన్నారు. ‘మన గ్యాస్ - మన హక్కు‘ అని నినదించారు.

# అమరావతి చరిత్రలో నిలిచిపోతుంది

## - టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ



తిరుపతి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని అజరామరంగా చరిత్రలో నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తెలియజేశారు. గురువారం సాయంత్రం తిరుపతి బైరాగిపట్టెడలోని అన్న క్యాంటీన్ వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పార్లమెంట్‌లో ఆమోదించడం శుభ పరిణామాన్ని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు చరిత్రలో సువర్ణ అక్షరాలతో నిలిచిపోతాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ కలలు కన్నా రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టపద్ధత కల్పిస్తూ బిల్లు పాస్ అవడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం ఏర్పడిందన్నారు. ఇది అన్ని మతాలు కులాలు వర్గాలకు చెందిన సార్వజనిక రాజధానన్నారు. రాజధాని అమరావతి లభించిన ఈ చట్టబద్ధత నవ్యాంధ్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. అదేవిధంగా ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న రాజధాని ప్రాంతం ముఖ్యమన్నారు అమరావతి అభివృద్ధి చెందితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉపాధి వ్యాపార అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర రాజధానికి కేంద్రం చట్టబద్రత కల్పించడం దేశంలో ఇదే తొలిసారి అన్నారు. 1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా చరిత్ర సూచించిన ఆంధ్ర రాష్ట్రం ఇప్పుడు రాజధానికి చట్టబద్రత పొందిన తొలి రాష్ట్రంగా చరిత్ర నిలిచిపోతుందన్నారు తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాము, రవి, భారతి యశోద, హరి, మోనిష్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంజిన్ వేడితో మంటల్లో వాహనం

తిరుమల, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నుండి తిరుమలకు వస్తున్న ఖాళీ సుమో వాహనం ఇంజిన్‌లో వేడితో మంటలు లేచాయి. సుమో తిరుమల రెండో ఘాట్‌లో కొండపైకి చేరుకునే చివర మలుపు వద్ద ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. డ్రైవర్ తిరుపతి ఎల్‌బి నగర్‌కు చెందిన లవకుమార్ వెంటనే అప్రమత్తమై క్రిందకు దిగేయడంతో మంటల్లో వాహనం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంతో తిరుమలకు వచ్చే వాహనాలను కిలోమీటరు ముందే ఆపివేశారు. జిఎన్‌సి టోల్‌గేట్‌కు ముందే సుమోలో ఇంజిన్‌లో వైర్లు షార్కుసర్క్యూట్ కారణంగా ప్రమాదం జరగడంతో కొండపై ఇతర వాహనదారులు ఆందోళన చెందారు. ప్రయాణీకులను తిరుపతిలో ఎక్కించుకుని అలిపిరిలో దించాడు. దీంతో ప్రాణనష్టం తప్పింది.

# పంచాయతీ సైనికునికి సలాం!

**వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి**

విజయవాడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఐదు సంవత్సరములు ఎన్నో కష్టాలు, ఎన్నో సవాళ్లు, మరెన్నో ఆటుపోట్లు, అయినా మొక్కవోని దీక్షతో తమ బాధ్యతలను నెరవేర్చి, విజయవంతంగా ఈరోజు పదవి విరమణ పొందుతున్న ప్రతి సర్పంచ్‌కు పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వైయస్సార్‌సీపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. “గత రెండు సంవత్సరములుగా కూటమి ప్రభుత్వంలో నిర్బంధకాండను ఎదుర్కొని తమకు రావాల్సిన గౌరవ వేతనాలు కూడా పొందలేక, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ, తాము చట్టబద్ధంగా చేయవలసిన పనులను కూడా చేయకుండా అడ్డుపడి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుంటే మరొక ప్రక్క ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు తమకు ఇచ్చిన బాధ్యతలను, రాజ్యాంగం కల్పించిన హక్కులను బాధ్యతాయుతంగా నెరవేర్చుకుని విజయవంతంగా తమ ఐదు సంవత్సరముల కాలాన్ని దిగ్విజయంగా ముగించిన మీరు అనన్య సామాన్యులు, చరిత్రలో మీకు, మీరు చేసిన త్యాగాలకు ప్రత్యేక చోటు ఉంటుందని భావిస్తున్నాను. మీరు మీ కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని, భవిష్యత్తులో రాబోయే ఎన్నికలకు సిద్ధమై ప్రజాస్వామ్యాన్ని బతికించడం కోసం మీ వంతు కర్తవ్యంగా వైయస్సార్‌సీపిని బలపరచాలని, కూటమి ప్రభుత్వం ధ్వంసం చేసిన గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం జగనన్న తెచ్చిన సచివాలయ వ్యవస్థను పునర్ నిర్మించుకోవడం కోసం, అలాంటి ప్రజాపాలనలోనే స్థానిక సంస్థలకు న్యాయం జరుగుతుందని చాటిచెప్పే విధంగా ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిగా నిలబడాలని కోరుకుంటున్నా“ అని రవీంద్రారెడ్డి పేర్కొన్నారు.

# మానవ అక్రమ రవాణా... సమాజానికి తీవ్ర ముప్పు

## - తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: మానవ అక్రమ రవాణా, బంధిత కార్మిక వ్యవస్థలు సమాజానికి తీవ్రమైన ముప్పుగా పరిణమించాయని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితుల రక్షణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మానవ అక్రమ రవాణా సంబంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాధితుల గుర్తింపు, రక్షణ, పునరావాస చర్యలు, కేసుల దర్యాప్తు విధానాలపై సమగ్ర మార్గదర్శకాలు తెలిపారు. బాధితుల గోప్యత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు. ప్రతి కేసును మానవీయ దృక్పథంతో సున్నితంగా విచారించాలని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక శాఖ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం కీలకమని, అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, డిఎస్పీలు విజయశేఖర్, శ్రీలత, గీతాకుమారి, ప్రసాద్, జిల్లాలోని డిఎస్పీలు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాతకాటేజీలకు మోక్షం ఇవ్వరా!

## నూతన నిర్మాణాలకు ముహూర్తం ఎప్పుడో!?

తిరుమల, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమల కొండపై ఆరుదశాబ్దాల క్రిందట అప్పటి భక్తుల అవసరాలకు తగ్గట్లు నిర్మించిన పలు కాటేజీలు, విశ్రాంతి గృహాలు పురాతనమవడం, పెచ్చులూడి సీలింగ్‌లు ఊడిపోవడం, వర్షమొస్తే ధారాళంగా నీరు గదుల్లోకి చేరడం వంటి చేదు అనుభవాలు భక్తులు చవిచూస్తున్నారు. ఈ గదుల్లో దాదాపు నల్లులు, దోమలు, మంచాలు కూడా సరిగా లేకపోవడం అనే ఫిర్యాదులు భక్తుల నుండి వెల్లువెత్తుతున్నాయి. మూడు సంవత్సరాల క్రిందట దాదాపు వందకోట్ల రూపాయలుపైగానే వెచ్చించి అనేక అతిధిగృహాలు, విశ్రాంతి గృహాలు, కొన్ని కాటేజీలు ఆధునీకరించారు. ఈ పనులు కూడా గత కరోనా వ్యాప్తి సమయంలో బాగా ఆలస్యమయ్యాయి. ఇప్పటికీ మూడునాలుగు విశ్రాంతి గృహాలు, కాటేజీలు ఆధునీకరించే పనులు సాగుతూనే ఉన్నాయి. సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు వీలుగా ఎప్పుడోకొన్ని దశాబ్దాల క్రిందట నిర్మితమైన కేంద్రీయ విచారణ కార్యాలయం (సిఆర్ఓ)కు సమీపంలోనే ఉన్న సుదర్శన్, గోవర్ధన్, కల్యాణి సత్రాలు, సి టైప్‌క్వార్టర్స్, పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో మ్యూజియం మార్గంలో కొన్ని విశ్రాంతి గృహాలు పూర్తిగా పాతవి కావడం, గోడలు, గదులు పెచ్చులూడే దుస్థితికి చేరాయి. ఈ విశ్రాంతి గృహాలు, కాటేజీలు పూర్తిగా సామాన్యభక్తులకు అందుబాటులో ఉండేవే. అంతేగాక ఈ ప్రాంతాల్లో యాత్రికులు వాహనాల్లో చేరుకున్నా పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం పార్కింగ్ అనేది లేకపోవడంతో యాత్రికులు రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. గదులు కూడా విశాలస్థలాలు లేవు. ఎప్పుడో పాతకాలంనాటి అవసరాలకు తగ్గట్లు, అప్పటి ప్రణాళికల మేరకు నిర్మించడంతో భవనాల ఉనికి ఆందోళనకరంగా మారింది. ఇందులో 50రూపాయలు, 100 రూపాయలు అద్దెగదులు




భక్తులకు కేటాయిస్తారు. ఇవన్నీ కూడా ఉపయోగకరంగా లేకపోవడంతో, భక్తుల నుండి వరుసగా ఫిర్యాదులు అందడంతో టిటిడి అధికారులు వీటిని ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం త్వరలోనే దాతల నుండి సహకారం కూడా తీసుకునే యోచనలో ఉన్నారు. అంతేగాక టెండర్లు పిలిచినా వాటిని పూర్తిగా పడగొట్టి ఆ స్థానాల్లో అధునాతనంగా భవనాలు, గదులను అన్ని వసతులతో నిర్మించాల్సి కూడా ఉంది. ప్రస్తుతం తిరుమలలో ఉన్న 7,700 పైచిలుకు గదులు అందుబాటులో ఉన్నాయి. పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో ప్రముఖులు, ముఖ్యులు బసచేసే విధంగా 700గదులు, ముఖ్యులతోపాటు సామాన్యభక్తులు బసచేసే కాటేజీ, విశ్రాంతి గదులు ఎంబిసి పరిధిలో 683గదులు, సిఆర్ఓ, టిబి కౌంటర్‌ల పరిధిలో 6వేల వరకు గదులు ఉన్నాయి. పాత కాటేజీలను పూర్తిగా పడగొట్టి అద్భుతంగా నిర్మించేందుకు టిటిడి పాలకమండలి ఆలోచన చేస్తోంది.



# హిందూ మతంలోకి పునఃమార్పిడి

తిరుపతి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతికి చెందిన అబ్దుల్లా, అమ్మిన్నా దంపతులు వేద మంత్రోచ్ఛరణల మధ్య హిందూ మతంలోకి మారారు. ఒక జంట తిరిగి హిందూ మతం స్వీకరించేలా టిటిడి మాజీ ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి చొరవ చూపారు. తిరుపతికి చెందిన యాలమూరి శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులు కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లారు. అక్కడే 27 ఏళ్ల పాటు బ్రతుకుతెరువు సాగించారు. ఈ క్రమంలో అక్కడ పరిస్థితులతో ముస్లిం మతాన్ని స్వీకరించారు. శ్రీనివాస్‌రెడ్డి తన పేరును అబ్దుల్లాగా, ఆయన భార్య పుష్ప అమ్మిన్నాగా మార్చుకున్నారు. ముస్లిం పేర్లతోనే అన్ని రకాల కార్డులను ఆ దేశంలో సృష్టించుకున్నారు. 2015లో ఆ దంపతులు తిరిగి ఇండియా వచ్చేశారు. తిరుపతి పెద్దకాపు వీధిలో అబ్దుల్లా కుటుంబం నివాసం ఉంటోంది. ఈ విషయం తెలుసుకున్న భూమన కరుణాకరెడ్డి అబ్దుల్లా ఇంటికి వెళ్ళి పలుమార్లు వారితో చర్చించారు. హిందూ మత విశిష్టతను వివరించారు. దీంతో భూమన నేతృత్వంలో గురువారం ఉదయం హిందూ మతం స్వీకరించేందుకు అబ్దుల్లా, ఆయన భార్య అమ్మిన్నా ముందుకు వచ్చారు. భూమన నివాస ఆవరణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అబ్దుల్లా, అమ్మిన్నా హిందూ మతాన్ని స్వీకరించారు. తిరిగి వారి పేర్లను శ్రీనివాస్‌రెడ్డి, పుష్పగా మార్చుకోవడం విశేషం.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త 26
శుక్రవారం 3, ఏప్రిల్ 2026 



# సింహాద్రినాథుని చక్రస్నానం

## ఉత్సాహంగా చూర్ణోత్సవ, వసంతోత్సవాలు

సింహాచలం,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి పరమ పవిత్రమైన ప్రకృతి జలధారలో నరహరి చక్రస్నాన వేడుక గురువారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. సింహగిరి ఈశాన్యం మూలలో నిరంతరాయంగా ప్రవహిస్తున్న గంగధార వద్దకు కళ్యాణమూర్తులను, చక్ర నారాయణలను, అళ్వారాచా ర్యులను తోడ్కొని వెళ్లి పంచ కలశ ఆవాహనం, ఆరాధన, పందా మృతాభిషేకం నిర్వహించారు. స్థానచార్యులు డా.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గోడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు సారథ్యంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని 8వ పేజీలో

### ప్రజలకు ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై

# అవగాహన అవసరం

**సంక్షేమానికి, అభివృద్ధికి వచ్చిన నిధుల వివరాలపై అవగాహన కలగాలి -రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకుని పరిమిత వనరులతో సమర్థవంతంగా పని చేయాలి -శాసనసభ్యులకు సూచించిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర -బడ్జెట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి: జిల్లా మంత్రి వంగలపూడి అనిత**



అనకాపల్లి ఏప్రిల్ 2, ప్రభాతవార్త

రాష్ట్ర బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలను రూపొందించుకోవాలని, కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శాసన సభ్యులు, ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ ఇతర ఉన్నతాధికారులతో 2026-27 బడ్జెట్- ఔట్ రీచ్ అవగాహనా సదస్సును రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితతో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర సమీక్షనిర్వహించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేసిన బడ్జెట్ కేటాయింపులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు సూచించారు. ముందుగా బడ్జెట్ అవుట్ రీచ్ లక్ష్యాలు- జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు జిల్లా కలెక్టర్ వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి మధ్య సమతుల్యత పాటిస్తూ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొంటూ, అభివృద్ధి అంశాలకు, సంక్షేమ పథకాలకు సమన్యాయం చేస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ విశేషాలను, రంగాల వారీ కేటాయింపులను ప్రజలకు వివరించాలని, నియోజకవర్గాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గాల వారీగా చేసిన కేటాయింపులపై స్థానిక శాసనసభ్యుల సమన్వయంతో ప్రత్యేక ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులకు తగ్గట్టు పనులు చేపట్టాలని, నిధులను సమృద్ధిగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఆర్సెల్లార్ మిత్తల్ సంస్థకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ జిల్లాలో ప్రతి స్పెషల్ ఆఫీసర్ జిల్లా అభివృద్ధిపై జవాబు దారీగా ఉండాలని, ముఖ్యంగా వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం వల్ల నిధులు వృథా కాకూడదని జిల్లా మంత్రి పేర్కొన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం 8వ పేజీలో

# రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయం



## స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి దక్కిన చారిత్రక ఘనత

అనకాపల్లి ఏప్రిల్ 2, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత లభించడం రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం. ఈ చారిత్రాత్మక విజయంతో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేరు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆయన స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనే రాష్ట్ర శాసనసభలో అమరావతి ఏకైక రాజధానిగా చారిత్రక తీర్మానం ఆమోదం పొందడమే కాకుండా, ఇప్పుడు దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో కూడా దానికి శాశ్వత చట్టబద్ధత సాధించడం విశేషం. రాజ్య సభ చైర్మన్‌కి, లోక్ సభ స్పీకర్‌కి వెంటనే సంబంధిత సభల్లో పెట్టి ఆమోదించినందుకు వారికి స్పీకర్ ధన్యవాదములు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026ను లోక్‌సభలో ప్రవేశపెట్టడంతో అమరావతిపై గత కొన్నేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి శాశ్వత ముగింపు లభించింది. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం మొదలుకొని నేడు లోక్‌సభలో ఆమోదముద్ర పడేవరకు సాగిన ఈ చారిత్రక పరిణామం, స్పీకర్ అయ్యన్నపాత్రుడు పదవీకాలానికి దక్కిన ఒక అరుదైన, గొప్ప ఘనత.

# కలెక్టరేట్ విభాగాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్





8లో

### విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది

# సమస్యలపై ఎంపీ శ్రీభరత్ ఆందోళన

**పెరుగుతున్న ఆర్థిక భారం, ఇతర సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి**



(ప్రభాతవార్త - విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సంక్షేమ సమస్యలు రోజు రోజుకు తీవ్రమవుతున్న నేపథ్యంలో, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి లేఖ అందజేసి పరిస్థితి తీవ్రతను వివరించారు. రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ స్టీల్ ప్లాంట్)కు చెందిన రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య బీమా చందాను ఒక్కసారిగా 8వ పేజీలో

# అమరావతి శాశ్వత రాజధానిగా గుర్తింపు..

**పార్లమెంటులో బిల్లు ఆమోదం తెలపడంతో పట్టణంలో మిన్నంటిన సంబరాలు..**
**పాల్గొన్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు**



ఎలమంచిలి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదముద్ర పడడంతో కూటమి ఆధ్వర్యంలో సంబరాల నిర్వహించారు. ఈ 8వ పేజీలో

# అమరావతి బిల్లు ఆమోదంపై సంబరాలు



8లో

### అమరావతి బిల్లుకు చట్టబద్ధత పట్ల

# మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం

**కలెక్టర్ కార్యాలయంలో సంబరాలు**



# 91.17ఎంఎంటీ సరుకు రవాణాతో చరిత్రను తిరగరాసిన విశాఖ పోర్టు




విశాఖపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో 91.17 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరుకు రవాణా నమోదు చేసి చారిత్రక మైలురాయిని అందుకుంది అని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డా.ఎం.అంగముత్తు తెలిపారు. గురువారం బీచ్ రోడ్‌లో హోటల్‌లో స్టేక్‌హోల్డర్స్ మీట్ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే సుమారు 10.35 శాతం వృద్ధిని సాధించి, దేశంలోని ప్రధాన పోర్టుల్లో సముచిత స్థానాన్ని సాధించిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 82.62 ఎంఎంటీని అధిగమిస్తూ, పోర్ట్ తన కార్యకలాపాల్లో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిందని అన్నారు. ఈ విజయానికి తోడ్పడిన పోర్ట్ సిబ్బంది, స్టేక్‌హోల్డర్లు, రైల్వేలు, కస్టమ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా 100 ఎంఎంటీ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. మూల పేట పోర్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అలాగే దుగ్గరాజపట్నం పోర్టు, షిప్‌బిల్డింగ్ యూనిట్ కోసం సంయుక్తంగా ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పివి) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ధూళి రహిత సరుకు నిర్వహణపై దృష్టి సారిస్తున్నామని, బొగ్గు రవాణాను ములపేట పోర్టుకు మళ్లించే ప్రణాళికలు ఉన్నాయని తెలియజేశారు. అలాగే పోర్టు విస్తరణను యాంత్రీకరణ ద్వారా చేపడతామని చెప్పారు. పిఓఎల్‌తో పాటు క్రూడ్: 28.11 ఎంఎంటీ (13%), ఇనుప ఖనిజం: 15%, ఎరువులు: 42% ప్రధాన సరుకుల్లో రవాణాలో గణనీయ వృద్ధి ఉందని, అలాగే ఆపరేషనల్ సామర్థ్య మెరుగుదల ఉందని టర్న్‌రౌండ్ టైమ్, బెర్త్ ఆలస్యం తగ్గించడం ద్వారా వేగవంతమైన నౌకల నిర్వహణ జరుగుతుందన్నారు. రికార్డు స్థాయి పనిచేయడంతో ఒక్కరోజులో అత్యధిక సరుకు నిర్వహణ: 5,50,198 మెట్రిక్ టన్నులు అని 24 గంటల్లో 24 నౌకల కదలికలు, 32 బెర్త్‌లలో 28 వినియోగం 8వ పేజీలో

# నేడు గుడ్ ఫ్రైడే



విశాఖపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

గుడ్ ఫ్రైడే-క్రీస్తు త్యాగాన్ని స్మరించుకునే పవిత్ర దినం. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, వే స్టేషన్స్ ఆఫ్ ద క్రాస్, శిలువ యాత్రలు జరుగుతాయి. విశాఖలో సెయింట్ పాల్స్, జ్ఞానాపురం, కాతెడ్రల్ చర్చిల్లో ఉదయం నుంచి అనేక సేవలు ఉంటాయి, చాలామంది ఉపవాసం పాటిస్తారు. రేపు ఈస్టర్ వేడుకల కోసం ప్రజలు సిద్ధమవుతారు.

# మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు దెబ్బ

**కేంద్రంతో కలిసి టీడీపీ దుర్మార్గం -దీక్షా శిబిరంలో అఖిలపక్ష సంఘాల నేతలు**
**-డీఆర్ఎం కార్యాలయం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ**



విశాఖపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

విశాఖ స్టీల్ ప్లాంట్ను దెబ్బతీయడానికే నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంటుకు శంకుస్థాపన చేశారని, కేంద్రంతో కలిసి టీడీపీ ఈ దుర్మార్గానికి పాల్పడుతుందని అఖిలపక్ష సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరి రక్షణ కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం. మన్మధ రావు, భోగవిల్లి నాగభూషణం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం 8వ పేజీలో

# ఉత్పత్తి, అమ్మకాల్లో సత్తా చాటిన విశాఖ ఉక్కు




8లో

# విశాఖ జిల్లాలో అంబరాన్నంటిన అమరావతి రాజధాని సంబరాలు

**అమరావతికి ఏపీ రాజధానికి చట్టబద్ధత వచ్చిన వేళ నెలకొన్న సందడి - ప్రజలు, విద్యార్థులు, యువత.. అధికారులు, నేతల్లో వెల్లివిరిసిన ఆనందం**



8లో

# 'డిజిటల్ అరెస్ట్' ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

## రూ.82.95 లక్షల మోసం కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్

## -విదేశీ కేంద్రాల నుంచి నడుస్తున్న సైబర్ గ్యాంగ్‌లపై విశాఖ సిటీ పోలీసుల కఠిన చర్య



(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖపట్నంలో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భారీ సైబర్ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లపై నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా రూ.82 లక్షల 95 వేల మోసం కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి మరో కీలక ముఠా లింక్‌ను బయటపెట్టారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.సి.ఐ)లో రిటైర్డ్ మేనేజర్‌గా పనిచేసిన విశాఖకు చెందిన ఓ వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్లు, తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని చెప్పుకుంటూ వాట్సాప్ కాల్ చేశారు. బాధితుడి ఆధార్ కార్డు దుర్వినియోగం జరిగిందని, మనీలాండరింగ్ కేసులో పేరు చేరిందని భయపెట్టారు. అనంతరం పోలీస్, సీబీఐ, సుప్రీంకోర్టు పేర్లతో నకిలీ పత్రాలు చూపించి, వీడియో కాల్‌లో న్యాయమూర్తుల్లా నటిస్తూ నమ్మకం కలిగించారు. 'వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే డబ్బులు తిరిగి వస్తాయి' అని చెప్పి దశలవారీగా మొత్తం రూ.82.95 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాల్లో జమ చేయించుకున్నారు. తర్వాత మోసగాళ్లు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో కుటుంబ సభ్యులకు విషయం తెలిపిన బాధితుడు, మోసాన్ని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఈ మోసాల వెనుక అంతర్జాతీయ సైబర్ నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు బయటపడింది. కాంబోడియా, మయన్మార్, వియత్నాం కేంద్రాలుగా చైనా మూలాలున్న సైబర్ ముఠాలు డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, పార్ట్‌టైం జాబ్స్, హనీట్రాప్ వంటి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. భారతదేశం నుంచి నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో విదేశాలకు తీసుకెళ్లి, వారిచేత సైబర్ మోసాలు చేయిస్తున్నట్లు తేలింది. ఈ మోసాల్లో కీలకంగా ఉపయోగించే 'మ్యూల్ బ్యాంకు ఖాతాలు' సమకూర్చే ఏజెంట్లను పోలీసులు లక్ష్యంగా తీసుకున్నారు. ఇప్పటికే రెండు ముఠాలకు చెందిన 9 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, తాజాగా కడపకు చెందిన నాగేశ్వరయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతను మణికంఠ, చందు అనే వ్యక్తులకు బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. విదేశాల్లో సైబర్ స్కామ్ కంపెనీల్లో పనిచేసి తిరిగి వచ్చిన కొందరు భారతీయులు, చైనా నెట్‌వర్క్‌కు తెలియకుండా స్వంతంగా ముఠాలు ఏర్పాటు చేసి మోసాలు సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల డబ్బును మ్యూల్ ఖాతాల్లో జమ చేయించి, వాటిని కమీషన్లతో పంచుకుంటున్నట్లు గుర్తించారు. తెలియని నంబర్ల నుంచి ఫోన్ చేసి, మీ పేరుతో పార్సిల్‌లో మాదకద్రవ్యాలు ఉన్నాయని, మనీలాండరింగ్ కేసు నమోదైందని, ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయని చెబితే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. అలాంటి కాల్స్ వచ్చిన వెంటనే విశాఖ సీపీ ప్రత్యేక నంబర్ 7995095799 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ట్రాన్స్‌జెండర్లకు 'జ్యోతిర్గమయ'తో కొత్త జీవనదారి

## భిక్షాటనకు బదులు ఉపాధి - పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వినూత్న ఆలోచన

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



విశాఖపట్నంలో ట్రాన్స్ పర్సన్స్‌కు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆలోచనలో రూపుదిద్దుకున్న 'జ్యోతిర్గమయ' కార్యక్రమం ఫలితాలు ఇవ్వడం ప్రారంభించింది. సమాజంలో ఉపాధి అవకాశాల లేమితో భిక్షాటనకు దిగుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడానికి విశాఖ సిటీ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద, దుకాణాల దగ్గర భిక్షాటన చేయడం, కొన్ని సందర్భాల్లో సామాన్యులతో ఘర్షణలకు దిగడం వంటి అంశాలపై పోలీస్ కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, సమస్యను కేవలం చట్టపరంగా కాక సామాజిక కోణంలో పరిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ బి. భాస్కర్ రావు ఆధ్వర్యంలో ట్రాన్స్ పర్సన్స్ మరియు వారి గురువులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. వారి విద్యార్హతలు, ఆసక్తులు, జీవన పరిస్థితులను పరిశీలించి, ఉద్యోగాలు కల్పించడం తో పాటు స్వయం ఉపాధికి దారులు చూపించారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి చిన్న వ్యాపారాల స్థాపనకు సహకరించారు. ఇప్పటివరకు 20 మంది ట్రాన్స్ పర్సన్స్‌కు విశాఖ జీవిఎంసీలో ఉపాధి కల్పించగా, మరో 6 మందికి బ్యాంకు రుణాల సహాయంతో పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు ఏర్పాటు చేశారు. అదనంగా మరో 20 మందికి జీవిఎంసీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మహిళా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 10 మంది ట్రాన్స్ పర్సన్స్‌కు ఉపాధి కల్పించేలా టీ అండ్ టిఫిన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ కార్యక్రమం ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో వెలుగులు నింపుతుండగా, 'జ్యోతిర్గమయ' విశాఖలో ఆదర్శ కార్యక్రమంగా నిలుస్తోంది.

# కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను కలిసిన కేఎన్ఆర్



గాజువాక,ఏప్రిల్ 2,ప్రభాతవార్త

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన ఈ భేటీలో విశాఖలోని విమల విద్యాలయం ఉపాధ్యాయుల సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని కేఎన్ఆర్ కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణమే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నల్లమిల్లి కుమార్తె వివాహంలో పాల్గొన్న కెఎన్ఆర్

గాజువాక,ఏప్రిల్ 2,ప్రభాతవార్త :



అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమార్తె సనతని రెడ్డి, పాన్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కుమారుడు నిరంజన్ రెడ్డిల వివాహం హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఏపీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, బీజేపీ నేత పి.వి.ఎన్. మాధవ్ సహ పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డా.కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్), బొత్స దిలీప్ కుమార్ తదితరులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అలలపై విశాఖ యువత విజయం

## కాయకింగ్-కనోయింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా -రాష్ట్ర పోటీలకు ఎంపిక

(విశాఖపట్నం – ప్రభాతవార్త)



విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు జలక్రీడల్లో మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. గురువారం ఋషికొండ బీచ్ వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి కాయకింగ్-కనోయింగ్ పోటీల్లో యువ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచారు. సముద్ర అలల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో ప్రతి క్రీడాకారుడు ధైర్యం, నైపుణ్యం, సమన్వయంతో ఆకట్టుకున్నారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్సాహంగా సాగిన పోటీలను తిలకించిన ప్రేక్షకులు క్రీడాకారుల ప్రతిభకు అభినందనలు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఏప్రిల్ 10న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా స్థాయిలో మంచి ఫలితాలు సాధించిన ఈ యువత రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ప్రతిభ కనబరుస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. విజేతల జాబితాలో డి.ఘనేశ్వరరావు, జి.గౌతమ్, కె.హరీష్, పి.వరుణ్, బికాగ్ర ప్రసికే, వెంకట్ నూకరాజు, పి.ధనుష్, ఎం.గౌతమ్, పి.రాఘవ, కుశాల్, బి.నరేష్, వై.సాయి రోహిత్, లలిత్ కౌశిక్, శ్యామ్ ముఖకుమార్, నాగ జనార్ధన్ ఉన్నారు. ఈ సందర్భంగా కోచ్ వాసుపల్లి కమాండో దాస్ విజేతలను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ఇదే పట్టుదలతో ఆడి విశాఖకు మరిన్ని పతకాలు తీసుకురావాలని సూచించారు.

# గందవరంలో ఆరు నుండి పైడితల్లిమ్మ అమ్మవారి ఉత్సవాలు

పద్మనాభం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



మండలంలో గందవరం గ్రామంలో కొలువు దీరిన పైడితల్లిమ్మ గ్రామ దేవత అమ్మవారి ఉత్సవాలను ఈ నెల ఆరు నుండి ఎనిమిది వరకు నిర్వహించనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ మురళీరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు జుత్తాడ గణేష్ చెప్పారు. ఆరువ తేదీన సాయంత్రం తొలేలు ఉత్సవం, ఏడున రాత్రి అనుపోత్సవం, ఎనిమిదిన కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. మేరకు అమ్మవారి ఆలయానికి సున్నాలు, రంగులు వేస్తున్నారు. అలాగే మంగళవారం జరగనున్న రథోత్సవానికి రథాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారని అన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## - విద్యార్థులకు సీపీ శంఖబ్రత బాగ్చి సందేశం



(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖపట్నంలో విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించేందుకు నగర పోలీసులు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రిషికొండ బీచ్ సమీపంలో గల సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన మాదకద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సు ఉత్సాహంగా జరిగింది. విశాఖ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, (జెసిఐ) వైజాగ్ పోర్ట్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 9వ, 10వ తరగతులకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన సీపీ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల మెదడు, శరీర వ్యవస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. వ్యసనం ఒక విద్యార్థి భవిష్యత్తును దెబ్బతీయడమే కాక కుటుంబ బంధాలను కూడా విచ్ఛిన్నం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 'ఈగిల్ హెల్ప్‌లైన్' టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా తన వ్యక్తిగత నంబర్ 7995095799కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ పావులూరి, ప్రిన్సిపాల్ సునీత ఎర్నాగులలను అధికారులు అభినందించారు. యువతలో చైతన్యం పెంచి, మాదకద్రవ్యాల రహిత విశాఖ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

# ఐకమత్యంతో గ్రామాభివృద్ధి, ఆనందం సాధించవచ్చు

పద్మనాభం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



గ్రామాలలో ప్రజలు ఐకమత్యం ఉంటే గ్రామాభివృద్ధి సాధించిడమే కాకుండా గ్రామాలు ఆనందంగా ఉంటాయని ఎంపీపీ కె.రాంబాబు అన్నారు. సర్పంచుల పదవీ కాలం నేటితో ముగిసిన సందర్భంగా గురువారం కోరాడ గ్రామ సర్పంచ్ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామం అభివృద్ధి చేసుకోవడానికి, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండడానికి రాజకీయాలకు అతీతంగా మంచిగా ఆలోచన చేసి గతంలో ఏకగ్రీవంగా సర్పంచ్ గా లక్ష్మణరావును ఎన్నికోవడం అభినందనీయమని అన్నారు. దానికి తగ్గట్టుగా సర్పంచ్ గ్రామాభివృద్ధిని సాధించి ఎటువంటి సమస్యలు రాకుండా చూసారనిఅన్నారు. అనంతరం ఆయన, జెడ్పీటీసీ గిరిబాబు, సచివాలయ సిబ్బంది సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను,ప్రాధమిక పాఠశాల పిల్లలు, టీచరు కె.సన్యాసినాయుడు ఘనంగా సన్మానించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొంగదారి..?

## కేసు బదులు క్యాష్..! - విశాఖ ట్రాఫిక్ తనిఖీల్లో అక్రమ వసూళ్ల ఆరోపణలు

***రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, విశాఖలో కొంతమంది సిబ్బందికి ఆదాయ మార్గంగా మారుతున్నాయన్న ఆరోపణలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని చట్టపరమైన చర్యల పేరుతో భయపెట్టి, కేసులు నమోదు చేయకుండా అక్కడికక్కడే నగదు తీసుకుని వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నియమాల ప్రకారం కోర్టుకు హాజరు పరచాల్సిన చోట, 'సర్దుబాటు' పేరుతో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు ట్రాఫిక్ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.***

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



విశాఖ నగరంలో ప్రధాన కూడళ్లు, బీచ్ రోడ్లు, బార్‌లు అధికంగా ఉన్న ప్రాంతాలు, రాత్రివేళ వాహన రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రతి రోజు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐ లేదా ఎస్ఐ పర్యవేక్షణలో సిబ్బంది బ్రీత్ అనలైజర్లతో వాహనదారులను తనిఖీ చేస్తున్నారు. సాధారణంగా ఒకరు వాహనాలు ఆపడం, మరొకరు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించడం, ఇంకొకరు వీడియో చిత్రీకరణ చేయడం వంటి ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ తనిఖీల్లో పట్టుబడిన ప్రతి ఒక్కరిపై చట్ట ప్రకారం కేసులు నమోదవుతున్నాయా అన్న సందేహాలు పెరుగుతున్నాయి. మద్యం సేవించినట్లు తేలిన వెంటనే వాహనదారుడిని పక్కకు తీసుకెళ్లి, కేసు నమోదైతే కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందని, డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రభావం ఉంటుందని, ఉద్యోగ సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పి భయపెట్టడం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యువకులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో ఉన్నవారు ఇలాంటి సమయంలో ఆందోళనకు గురవుతుండటంతో, కొంతమంది సిబ్బంది అదే బలహీనతను అవకాశంగా మార్చుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్కడికక్కడే వేల రూపాయల నగదు డిమాండ్ చేసి, కొన్నిసార్లు చర్చించి మొత్తాన్ని నిర్ణయించి పంపిస్తున్నారన్న సమాచారం నగరంలో విస్తృతంగా వినిపిస్తోంది. నియమాల ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుడిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని తాత్కాలికంగా నిలిపివేసి, మరుసటి రోజు కోర్టుకు హాజరుపరచాలి. న్యాయమూర్తి జరిమానా లేదా అవసరమైతే శిక్ష విధించే అధికారం కలిగి ఉంటారు. కానీ కొన్ని సందర్భాల్లో ఈ ప్రక్రియ పూర్తిగా అమలుకావడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కేసు నమోదు చేయకుండానే వాహనదారుడిని పంపించడం, లేదా తక్కువ మొత్తంలో అధికారిక జరిమానా చూపించి అసలు ప్రక్రియను తప్పించడం జరుగుతోందని విమర్శిస్తున్నారు. నగరంలో రాత్రి వేళ బార్‌లకు అర్ధరాత్రి వరకు అనుమతులు ఉండడంతో మద్యం సేవించి వాహనాలు నడిపే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ట్రాఫిక్ విభాగం చెబుతోంది. ముఖ్యంగా బార్‌ల నుంచి బయటకు వచ్చే యువకులు, ఆకతాయిలు అధిక వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న సంఘటనలు నమోదవు తున్నాయి. పాదచారులు, ఇతర వాహనదారులు ఈ ప్రమాదాలకు బలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ, కొంతమంది సిబ్బంది వ్యవహారశైలి కారణంగా అసలు లక్ష్యం దెబ్బతింటోందని ప్రజలు అంటున్నారు. గతంలో కూడా ఇలాంటి ఆరోపణలపై కొందరు ట్రాఫిక్ సిబ్బందిపై చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కొంతకాలం క్రితం తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తి నుంచి నగదు తీసుకుని కేసు నమోదు చేయలేదన్న ఫిర్యాదు నేపథ్యంలో ఒక ఎస్ఐ, స్టేషన్ రైటర్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. మరో సందర్భంలో బీచ్ రోడ్ పరిధిలో ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకున్న వ్యవహారం బయటపడడంతో ఒక హోంగార్డు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అదే ధోరణి కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక నిఘా లేకపోవడం కూడా దీనికి కారణమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తేనే విచారణ జరుగుతోందే తప్ప, తనిఖీల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ లేదన్న అభిప్రాయం ట్రాఫిక్ వర్గాల్లోనే వినిపిస్తోంది. ప్రతి తనిఖీని డిజిటల్ రికార్డింగ్ చేయడం, బాడీ కెమెరాలు తప్పనిసరి చేయడం, పట్టుబడిన ప్రతి కేసు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు అయ్యే విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. రోడ్డు భద్రత కోసం చేపట్టిన చర్యలపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే, తనిఖీలు పారదర్శకంగా సాగాలని, చట్టం అందరికీ సమానంగా అమలవ్వాలని నగరవాసులు కోరుతున్నారు. లేకపోతే 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీ భద్రతకా, లేక వసూళ్లకా అన్న ప్రశ్నలు మరింత బలపడే పరిస్థితి కనిపిస్తోంది.

# రాజధాని అమరావతిని చట్టబద్ధం చేసిన పార్లమెంటు సభ్యులకి అభినందనలు



పద్మనాభం,ఏప్రిల్ 2, ప్రభాతవార్త

రాష్ట్ర శాశ్వత రాజదానిగా అమరావతిని పార్లమెంటు సభ్యులు చట్టబద్ధం చేసిన సందర్భంగా రాష్ట్ర సి.ఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు మండల టీడీపీ అధ్యక్షులు కె.రమణ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండలంలో పలు గ్రామాలలో నాయకులు, అధికారులు ఆనందోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మండల పరిషత్ కార్యాలయం వద్ద ముగ్గులు వేసి జ్యోతి ప్రజ్వలన చేసారు. కార్యాలయానికి విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. అనంతరం అమరావతి రాజదానికి జై అని నినాదాలు చేసారు. రాష్ట్ర ప్రజల కల నెరవేరందని రమణ అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకలను ఘనంగా చేపట్టారు. ఎంపిడిఒ నగేష్, హెచ్‌డి టి.చంద్రశేఖర్, ఎంపీటీసీ కె.లక్ష్మి, నాయకులు దాము, నందీష్, ఎర్రినాయుడు, సన్యాసిరావు, పైడినాయడు, నాగు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి

## -ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక,ఏప్రిల్ 2,ప్రభాతవార్త



గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాలలో వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసిన ఆయన, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ఎలాంటి లోపాలు ఉన్నా విద్యార్థులు వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతిరోజూ భోజనాన్ని ఉపాధ్యాయులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని పల్లా స్పష్టం చేసారు. లీప్ యాప్, ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలను నిరంతరం సేకరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, వసతులు మెరుగుపర్చడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# అస్వస్థుడికి పెందుర్తి పోలీసుల తక్షణ సాయం

## శివ గాయత్రీనగర్‌లో అపస్మారక స్థితిలో కనిపించిన వృద్ధుడిని కేజీహెచ్‌కు తరలింపు

విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త



పెందుర్తి పోలీసుల మానవతా దృక్పథం మరోసారి వెలుగులోకి వచ్చింది. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివ గాయత్రీనగర్ ప్రాంతంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన పడిఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు వెంటనే స్పందించారు. స్థానికంగా విధుల్లో ఉన్న బ్లూ కోట్ కానిస్టేబుల్ లెక్కల చంద్రశేఖర్‌కు సమాచారం అందిన వెంటనే ఆయన ఈ విషయాన్ని పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్‌కు తెలియజేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని, ఆ వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని కేజీహెచ్‌కు తరలించారు. తదుపరి విచారణలో ఆ వ్యక్తి గోపాలపట్నం పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి,వారికప్పగించేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం అందించిన పెందుర్తి పోలీసుల చర్యలను స్థానికులు అభినందించారు.

# రూల్స్ బ్రేకర్స్ పై కొరడా..!

## బుధవారం ఒక్కరోజే 2,535 ఈ-చలానాలు - హెల్మెట్, ఓవర్‌స్పీడ్, డ్రంక్‌అండ్‌డ్రైవ్‌పై ట్రాఫిక్ విభాగం కఠిన చర్యలు



(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖ నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు అధికమవు తున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు కఠిన తనిఖీలు కొనసాగిస్తున్నారు. నగరంలోని వివిధ కూడళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ విభాగం బుధవారం ఒక్కరోజులోనే మొత్తం 2,535 ఈ-చలానాలు విధించింది. మోటారు వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ ధరించని 1,287 మంది ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేశారు. పిలియన్ రైడర్లు హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 246 మందిపై, ట్రిబుల్ రైడింగ్ చేసిన 82 మందిపై చలానాలు విధించారు. స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి పిల్లలను ఎక్కించిన ముగ్గురు డ్రైవర్లపై కూడా చర్యలు తీసుకున్నారు. ఇంటర్‌సెప్టర్ వాహనాల సహాయంతో ఓవర్‌స్పీడ్‌లో వెళ్తున్న 225 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 33 మందిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 9 మందిపై, మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన ఒక కేసు నమోదు చేశారు. రాంగ్ పార్కింగ్‌పై కూడా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. తప్పుగా పార్క్ చేసిన 37 వాహనాలను టోయింగ్ చేసి, మరో 129 మందిపై చలానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 44 మందిపై కేసులు నమోదు చేయగా, మొత్తం 65 వాహనాలను సీజ్ చేశారు. ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 520 కేసులు నమోదు చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ మరియు రవాణాశాఖ అధికారులతో కలిసి 19 ప్రైవేట్ సీసీ బస్సులు, ఆర్టీసీ బస్సులను సంయుక్తంగా తనిఖీ చేశారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒక వ్యక్తికి గౌరవ న్యాయమూర్తి 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. నగరంలో బైక్ రేసింగ్, రాష్‌డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్ల వినియోగంపై కూడా ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ విభాగం విజ్ఞప్తి చేసింది. హెల్మెట్ రక్షణ, సీట్‌బెల్ట్ భద్రత, నియమాలే ప్రాణ భద్రతకు బాట అని అధికారులు గుర్తుచేశారు.

# అమరావతి బిల్లు ఆమోదంతో టీడీపీ ర్యాలీ

ఆనందపురం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



పార్లమెంట్ ఉభయ సభలలో అమరావతి రాజధాని బిల్లు ఆమోదం పొందడంతో గురువారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో ఆనందపురంలో టీడీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆనందపురం మండలం వేములవలస జంక్షన్ నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీ పెద్దిపాలెం, వెల్లంకి జాతీయ రహదారి గుండా సాగింది. అనంతరం గాంధీ, అంబేద్కర్, జ్యోతి రావ్ పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ తాట్రాజు అప్పారావు, ఆధ్వరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ లొడగల వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ సురాల సత్యవరప్రసాద్, సాడి ముత్యాలరెడ్డి, ఇల్లిపిల్లి సన్యాసిరావు, నిమ్మల అప్పలరాజు, బిఆర్ బి.నాయుడు, మహంతి శివాజీ, శంకాణ లక్ష్మణరావు, కోరాడ నవీన్, కోరాడ వైకుంఠం, పోతిన గోవింద్ కుమార్, కంచరాపు శ్రీను, మీసాల సత్యనారాయణ, మరుపిల్లి ప్రసాద్, మా దవరావు, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మూడు రాజధానుల డ్రామాకు తెర

## తొలిపావంచ వద్ద ప్రత్యేక పూజలు -అమరావతితోనే నవ్యాంధ్ర పునర్నిర్మాణం



సింహాచలం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆడిన మూడు రాజధానుల డ్రామాకు తెరపడిందని 98 వార్డ్ మాజీ కార్పొరేటర్ పీవీ నరసింహం అన్నారు. లోకసభలో రాజధాని ఆమోదం పొందడం తోఎమ్మెల్యే ఆదేశాలు మేరకు తొలిపావాంఛ వద్ద వార్డ్ నాయకులతో కలసి సింహాద్రినాధునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పి.వి.నరసింహం మాట్లాడుతూ రాష్ట్రానికి శాపంగా మారిన 'మూడు ముక్కలాట'కు చెక్ అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ లోకసభలో బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రాంతీయ విద్వేషాలు, కులాల మధ్య విభేదాలు సృష్టించి రాష్ట్ర అభివృద్ధిని 30 ఏళు వెనక్కి నెట్టిందని ధ్వజమెత్తారు. విశాఖను రాజధాని చేస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా వేయని జగన్ మోహన్ రెడ్డి, అమరావతిలో నిర్మించిన రూ. 10వేల కోట్లను నాశనం చేశారన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లించి రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ను దెబ్బతీశారని మండిపడ్డారు. కేవలం 90 రోజుల్లో 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల మంది రాజధాని రైతులది ప్రపంచ చరిత్రలోనే అరుదైన త్యాగమని కొనియాడారు. అదే సమయంలో వైసీపీ నిర్వాకంతో రాజధాని పరిరక్షణకు అక్కడి మహిళలు, వృద్ధులు చేసిన పోరాటం దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య నిరసన అని కొనియాడారు. వైసీపీ ప్రభుత్వ వేధింపుల వల్ల ప్రాణాలు కోల్పోయిన 230 మంది రైతుల త్యాగ ఫలమే నేటి రాజధాని అన్నారు. ఈ కార్యక్రమంలో 98 వ వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, ఉపాఅధ్యక్షులు గుసిడి అవినాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుసిడి శంకర్రావు, సిర కృష్ణ, పంచదార్ల సోమినాయుడు, గంఢ్రెడ్డి వెంకట రమణ, పట్నాల ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి బూరెల కనక రావు, బిజెపి సోషల్ మీడియా ఇంచార్జ్ మహేష్, బిజెపి అధ్యక్షులు వర్మ, కిషన్ మార్చ్ ఉపాధ్యక్షు లు అప్పల నాయుడు, ప్రధాన కార్యదర్శి శరత్, తిరుపతి శ్రీనివాస్, తోట మధు, బంతి శ్రీనివాస్, మజ్జి కోటేశ్వరరావు, బాడితబోయిన వెంకట్రావు, బంధం సూరిబాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# 20 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు

## అదృశ్యుడి పునరాగమనం - టూటౌన్ పోలీసుల చొరవతో కుమారుడికి అప్పగింత

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)




విశాఖ నగరంలో 20 ఏళ్ల క్రితం కుటుంబానికి దూరమైన వ్యక్తి మళ్లీ తన ఇంటి చెంతకు చేరుకోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. టూటౌన్ పోలీసుల చొరవతో ఈ భావోద్వేగ ఘటన సాకారమైంది. అల్లిపురం నీలమ్మ వేపచెట్టు ప్రాంతానికి చెందిన చాపర్ల సత్యనారాయణ 2005లో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దైవదర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో మానసిక స్థితి సరిగా లేక కుటుంబ సభ్యుల నుంచి వేరుపడి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆయన కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇటీవల పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒంటరిగా తిరుగుతున్న సత్యనారాయణను గుర్తించిన పోలీసులు, ఆయనను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల గృహానికి తరలించారు. అనంతరం వివరాలు సేకరించి కుటుంబ సభ్యులను గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులను సంప్రదించగా, పూర్తి నిర్ధారణ అనంతరం టూటౌన్ సీఐ ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో సత్యనారాయణను ఆయన కుమారుడు మణికంఠకు అప్పగించారు. ఈ ప్రక్రియలో నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు డీసీపీ-1 విజయ్ మణికంఠ, ఈస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు. సత్యనారాయణను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడంలో కృషి చేసిన సీఐ ఎర్రం నాయుడు, కానిస్టేబుల్ ఈతలకోట నారాయణరావును ఉన్నతాధికారులు అభినందించారు. కుటుంబ సభ్యులు కూడా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు




## ఘనంగా చినలబుడు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం

**అరకులోయ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



అరకులోయ మండలంలోని చినలబుడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బి మహేశ్వరరావు అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సభ్యులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బురిడి ఉపేంద్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీ ప్రజలకు సేవ చేసే సౌభాగ్యం కల్పించిన పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తూ, తన సర్పంచ్ పదవి కాలంలో సహకరించిన పంచాయతీ ప్రజలు, ప్రజాప్రతినిధులు. సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. పదవులతో సంబంధం లేకుండా భవిష్యత్తులో కూడా పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని పంచాయతీ సర్పంచ్ బురిడి ఉపేంద్ర స్పష్టం చేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శి కి సర్పంచి ఉపసర్పంచ్ పాలకవర్గ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి పార్టీ నాయకుడు, స్థానిక గ్రామ పంచాయతీ పెసా కమిటీ సభ్యుడు మొస్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మరియు గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై ప్రశంసిస్తూ, సన్మాన కార్యక్రమాలు ప్రజా ప్రతినిధుల కృషిని గుర్తించేలా, గ్రామాభివృద్ధిని ప్రోత్సహించేలా ఉందని సచివాలయ సిబ్బంది స్థానికులు మరియు నేతలు చినలబుడు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానించి వీడ్కోలు పలకడం సంతోషదాయకమని అన్నారు. ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మహేశ్వర రావు, నాయకులు పూర్ణ, మరియు వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు జగన్, మధు, కూటమి నేత భగత్, రామ్, డోంబు నాయుడు అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు అనేకమంది పాల్గొన్నారు.

## ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ముగింపు ర్యాలీని విజయవంతం చేయండి

**- ఆంధ్రప్రదేశ్ ఆదివాసి. జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి**

**అరకులోయ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివాసి సత్యాగ్రహ యాత్ర ముగింపు ర్యాలీ నేడు శుక్రవారం నాడు పాడేరులో ఘనంగా జరగనుందని, ఈ మహా ర్యాలీకి ప్రతి ఆదివాసి సోదరులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర గురువారం పిలుపునిచ్చారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని వెంటనే అమలు చేయాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టాలని, 2025 డీఎస్సీలో నాన్‌ట్రైబల్ నియామకాలను రద్దు చేసి స్థానిక ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించాలని ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్ అరకు వేలి సమర్థి గోపాల్, కోకన్వీనర్లు కిల్లో ఆనంద్ , కిల్లో బుద్ధు, కిల్లో రామచందర్ వంతల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అప్పన్న అదృశ్యం

**అరకులోయ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



అరకులోయ మండలంలోని కొత్తబల్లుగూడ గ్రామానికి చెందిన స్వాభి అప్పన్న (49) అనే వృద్ధుడు గత రెండు రోజులుగా కనిపించకపోవడంతో అతని కుటుంబ సభ్యులు ముమ్మరముగా గాలిస్తున్నారు. చివరికి స్వాభి అప్పన్న ఆచూకీ తెలియక పోయడంతో ఆయన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ సందర్భంగా స్వాభి అప్పన్న కుమార్తె ప్రియాంక మాట్లాడుతూ తన తండ్రి గత నెల 31వ తేదీ నుండి కనిపించడం లేదని, అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. అయితే అదే రోజు రాత్రి మైదాన ప్రాంతం శృంగవరపు కోటలో విశాఖపట్నం వెళుతున్న బస్సులో కనిపించినట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతమంతా తన తండ్రి ఆచూకీ కోసం గాలించామన్నారు. తన తండ్రి స్వాభి అప్పన్న ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 7569161018 అనే నెంబర్ ను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**- టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య)**

**ముంచంగి పుట్టు ఏప్రిల్ 2 (ప్రభాతవార్త):**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగి పుట్టు మండలం మాకవరం పంచాయతీ. అలబీరు గ్రామం లో మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు డిప్యూటీ తాసిల్దార్ భాస్కరరావు వీఆర్వో రమేష్ ఆధ్వర్యంలో మీ భూమి మీ హక్కు కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కూటమి నాయకులు పాల్గొని, 35 మంది రైతులకు, నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు ఫోటోతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందించి వారి గౌరవాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచారాని, భూములు రీ సర్వే పూర్తయిన రైతులకు కూటమి ప్రభుత్వం శాశ్వత పట్టాలను ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాస్ పుస్తకాలను పారదర్శకంగా ప్రభుత్వం రూపొందించి రైతులకు భరోసా ఇచ్చిందని అన్నారు., కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం రైతు ల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ముంచంగిపుట్టు మండలం టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, తహసిల్దార్ భాస్కర అప్పారావు, మాజీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి శాస్త్రి బాబు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠం పాత్రో, రఘుపతి పడల్, మాకవరం పంచాయతీ అధ్యక్షుడు కోచో కామరాజు, పార్టీ నాయకులు సిహెచ్ బాబుజి, కోచో గణపతి, సీసా రామదాసు, సీసా రమేష్, డి పులందర్, పాంగి జాగత్రాయ్, అరయ్య కూడా భాస్కర్, లక్ష్మి, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలు

**డుంబ్రిగుడ: ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



మండలంలోని లైగండ పంచాయతీ సిందిపుట్టు గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనులు గ్రామ సమీపంలోని పశువుల మేతకు వెళ్లిన క్రమంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన పిడుగు పడింది. ఈ సంఘటనలో సిందిపుట్టు గ్రామానికి చెందిన కిల్లో ధనుర్దాయ్, గొల్లోరి నబోనతోపాటు దుక్కి పశువులపై పిడుగు పడింది. ఆయా గిరిజనులు పిడుగుపాటుకు గురై తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా సంఘటన స్థలంలో దుక్కి పశువు అక్కడిక్కడే మృతి చెందింది. క్షతగాత్రులను డుంబ్రిగుడ పీహెచ్సీకు బాధిత కుటుంబీకులు తరలించగా, ప్రథమ చికిత్స అనతంరం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక వీఆర్వో లక్ష్మీ నివేదికను తహసీల్దార్ త్రివేణికి పంపించారు.

## కూటమి నేతల కొవ్వొత్తుల ప్రదర్శన

**కొయ్యూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

అమరావతికి పట్టిన గ్రహణం వీడింది, రాష్ట్ర భవిష్యత్తు తెలిసింది అంటూ కూటమినేతలు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ చేసే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించిన ఈ శుభ సందర్భంగా అమరావతికి మద్దతు పలికిన దేశ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతగా గురువారం సాయంత్రం 7 గంటలకు మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీలో మన రాజధాని అమరావతి"కి దీపహారతులు ఇద్దాం.. నినాదంతో కూటమి నేతలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

# గిరిజన చట్టాలకు లోబడే ప్రాజెక్టు నిర్మాణం జరగాలి..








**- ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర..**

**- కాలుష్య నియంత్రణ బోర్డు అభిప్రాయ సేకరణలో జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర**

**ముంచంగిపుట్టు ఏప్రిల్ 2 (ప్రభాతవార్త):**

పర్యాటక ప్రాంతమైన జోలాపుట్టు లో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు ఏర్పాటుకు తామంతా అనుకూలమే కానీ గిరిజన చట్టాలకు లోబడి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి చేస్తామంటే తామంతా స్వాగతిస్తామని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. జోలాపుట్టు రిజర్వాయర్ వద్ద వాటర్ ఏరో డ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కాలుష్య నియంత్రణ మండలి విజయనగరం ప్రాంతీయ కార్యాలయం వారితో పాటు ఐటీడీఏ పీవో శ్రీ పూజ హాజరైన ఈ కార్యక్రమానికి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా పబ్లిక్ హీరింగ్‌లో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. వాటర్ ఏరో డ్రోన్ ప్రాజెక్టు ఏర్పాటుకు అంగీకారం తెలుపుతూనే కొన్ని నిబంధనలను విధించారు. 1/70 చట్టం, ఐదో షెడ్యూల్, పీసా చట్టానికి లోబడి ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగాలని సూచించారు. పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఏర్పోర్ట్ అథారిటీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ముందుకు రావడం సంతోషమే అయినా తమ పెత్తనం చలాయించాలని ప్రయత్నం చేస్తే మాత్రం తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. 85 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని పర్యావరణం కాలుష్యం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డుడుమ, మాచ్ ఖండ్, జోలాపట్టు ప్రాంతాల పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన మంచిదేనని కానీ ఇటీవల పెరిగిన టూరిస్ట్ ల సంఖ్య నేపథ్యంలో లంబసింగి వంజంగి వంటి ప్రాంతాల్లో విచ్చలవిడిగా టెంట్ల వేయడం ప్లాస్టిక్ వినియోగం అత్యధికంగా ఉండడం వంటి విషయాలు ఇక్కడ పూర్తిగా నిషేధమని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎటువంటి ఉపాధి అయినా అది స్థానికులకే ఇవ్వాలని ప్రధానంగా ఆమె డిమాండ్ చేశారు. జోలాపుట్ రిజర్వాయర్ వచ్చినప్పుడు ఇక్కడ గ్రామాల వారిని లంబసింగి తరలించి అక్కడ పునరావాసం కల్పించారని అటువంటి పరిస్థితులు ఏ ప్రాజెక్టు వచ్చినా మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని తమ ధ్యేయమన్నారు. పర్యాటకం పేరుతో గిరిజన సంస్కృతి దెబ్బతినేలా చేసినా, అసాంఘిక కార్యక్రమాలకు వేదికలుగా మార్చిన తాము సహించబోమన్నారు. గతంలో జరిగినటువంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకొని స్థానికులకు ఇచ్చే ఉపాధిని చట్టబద్ధంగా ఇస్తున్నట్లు హామీ ఇవ్వాలని పేర్కొన్నారు. జోలాపుట్ రిజర్వాయర్ కు నీరు వచ్చే గెడ్డపై అనేకమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారని వారి ఉపాధికి నష్టం కలగకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు.

## బదిలీపై వెళుతున్న అల్లూరి జిల్లాకలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్‌కు భారీ ఊరేగింపు ర్యాలీ

**- తొడ్డుపాడవునా పూలతో స్వాగతాలు.. మేళతాళాలు.. థింసా నృత్యాలు**

**పాడేరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**





అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి ఏపీఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ గా బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ కు గురువారం ఆత్మీయ వీడ్కోలులో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది జిల్లా కేంద్రం పాడేరు అంబేద్కర్ జంక్షన్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు కలెక్టర్ దినేష్ కుమార్‌కు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఊరేగింపు ర్యాలీ పలువురు అధికారులు, ఉద్యోగులు పూల దండలు వేస్తూ..పులరేకులు చల్లుతూ..బిందులతో నృత్యాలు.. థింసా నృత్యాలతో..మే ళతాళాలతో భారీ ఊరేగింపు ర్యాలీ నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు స్వాగతం పలుకుతూ తీసుకువెళ్లారు. ఈ ర్యాలీలో థింసా నృత్య కళాకారులతో జిల్లా కలెక్టర్, పీఓ, అసిస్టెంట్ కలెక్టర్ థింసా నృత్యాలు చేస్తూ అందరినీ ఆకర్షింప జేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పీఓ శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కే.సాహిత్, డి ఎల్ పి ఓ పీ.ఎస్.కుమార్, ఐటిడిఎ ఎపిఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అధిక సంఖ్యలో ఈ ఊరేగింపు ర్యాలీలో పాల్గొన్నారు.

## 11 కెవి విద్యుత్‌తో పొంచివున్న పెను ప్రమాదం

**- 11 కెవి మార్పు చేయాలని పిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు**

**- ఇంటి యజమాని ఆందోళన**

**పాడేరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



పాత పాడేరు గ్రామంలో నివాసం ఉంటున్న రేకులు ఇంటి పై భాగం మీదుగా 11 కెవి విద్యుత్ సప్లయ్ ఉందని, ఈదురు గాలులు, వర్షం కురుస్తున్న సమయంలో పెను ప్రమాదం పొంచి ఉందని, 11 కె వి సప్లయ్ లైన్ మార్పు చేయాలని అధికారులకు పిర్యాదు చేసిన స్పందించటం లేదని నివాసం ఉంటున్న ఇంటి యజమాని రామచంద్ర రావు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసారు. పాడేరు మండలం పాత పాడేరు గ్రామనికి చెందిన డూరు రామచంద్రరావు నివాసం ఉంటున్న రేకులు ఇల్లు పై భాగం మీదుగా పాడేరు నుండి బొక్కెళ్ళు సరఫరా అవుతున్న 11 కె వి లైన్ సప్లయ్ అవుతుంది. ఇంటి గుమ్మనికి ఎదురుగా 11 కె వి విద్యుత్ స్థంభం ఉండటంతో అలాగే 11 కె వి విద్యుత్ సరఫరా ఉండటం వలన ఈదురు గాలులు, వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు నుండి మంటలు, పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయని, అంతే కాకుండా ఇంటికి విద్యుత్ సర్క్యూట్ అవుతుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇంటి పైనున్న 11 కె వి విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సర్క్యూట్ అయిందని మధ్యాహ్నం సమయంలో ప్రమాదం జరగటం వలన మా కుటుంబ సభ్యులు పెను ప్రమాదం నుండి తప్పించుకున్నామని రామచంద్రరావు తెలిపారు. గత ఇదేళ్లుగా 11 కె వి విద్యుత్ లైన్ తీగలను మార్పు చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పిర్యాదు లు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇంటి పైన వేలాడుతున్న 11 కె వి విద్యుత్ తీగలు వల్ల ఎప్పుడు ఏలాంటి ప్రమాదం ఎటు నుంచి వస్తుందోనని గత్యంతరం లేకనే కుటుంబ సభ్యులతో కలసి బ్రతుకుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి మీదున వేలాడుతున్న 11 కెవి విద్యుత్ లైన్ మార్పు చేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మా గోడును విన్నవించుకుంటామని రామచంద్రరావు పేర్కొన్నారు.

## సమయపాలన పాటించని గ్రామ సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు..

**- గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం**

**ముంచంగిపుట్టు ఏప్రిల్ 2 (ప్రభాతవార్త)**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం,..ముంచంగి పుట్టు మండలంలో గల కర్రిముకి పుట్టు గ్రామపంచాయతీ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు గ్రామ సచివాలయాన్ని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనిఖీలో భాగంగా కర్రిముకి పుట్టు గ్రామ సచివాలయంలో మొత్తం 5 మంది సచివాలయ ఉద్యోగస్తులు ఉండగా సమయం ఉదయం 11:00 గంటలు అవుతున్న సరే, కేవలం ఇద్దరూ మాత్రమే సచివాలయంలో అందుబాటులో ఉండడంతో అసహనం వ్యక్తంచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, సమయపాలన పాటించని గ్రామ సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశించారు. గత వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం హయాంలో వేలాది పాఠశాలలు నాడు నేడు పేరుతో రూపురేఖలు మార్చామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి విద్యాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా కర్రిముకి పుట్టు జిల్లా పరిషత్ పాఠశాల భవనం కన్స్ట్రక్షన్ చేయకుండా కేవలం పిల్లర్స్ వేసి అసంపూర్తిగా మధ్యలో ఆపేసి ఉండడంతో అసహనం వ్యక్తపరిచారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పాఠశాల భవనాన్ని పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం విద్యార్థులకు ఉప్పల ప్రశ్నలు వేసి వారి విద్యా నాయకున్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కర్రిముకి పుట్టు గ్రామ పంచాయతీ వైసిపి నాయకులు గల్లెల అర్జున్ వైసీపీ అరకు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు సందడి. కొండబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 6న చింతలపూడిలో సిపిఐ కార్యవర్గ సమావేశం

**కొయ్యూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

ఈనెల 6న కొయ్యూరు మండలంలోని చింతలపూడిలో భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల సిపిఐ కార్యదర్శి ఉల్లి సూరిబాబు తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి అల్లూరి జిల్లా భారత్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని కావున కార్యవర్గ సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఉల్లి సూరిబాబు ఒక ప్రకటనలో కోరారు.

## పర్యాటకులకు స్వర్గధామంగా మారనున్న జోలాపుట్టు జలాశయం..

**- 16 కోట్ల 45 లక్షలతో జోలాపుట్టు జలాశయం వద్ద వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయనున్న ఏపీ ఎయిర్పోర్ట్ అథారిటీ**

**- ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ..**

**ముంచంగిపుట్టు ఏప్రిల్ 2 (ప్రభాతవార్త)**






అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో గల జోలాపుట్టు రిజర్వాయర్ వద్ద ఏపీ ఎయిర్పోర్ట్ అథారిటీ 16 కోట్ల 45 లక్షల రూపాయల వ్యయంతో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకుగాను జోలాపుట్టు గ్రామంలో ప్రజాభిప్రాయం సేకరణ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గత ఏడు దశాబ్దాలుగా ఆంధ్రా ఒడిస్సా రాష్ట్రాలకు విద్యుత్ వెలుగులు ప్రసరింప చేయడంలో కీలకపాత్ర వహిస్తున్న జోలపుట్టు జలాశయం ఇప్పుడు పర్యాటకులకు స్వర్గధామంగా మారనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక కేంద్రాలకు కొదవలేదు. అయితే వాటిని పర్యాటకులు ఆస్వాదించాలంటే కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న కొన్ని పర్యాటక కేంద్రాలు పర్యాటకులకు ఆనందాన్ని పంచ లేక పోతున్నాయి. అందులో ముంచంగిపుట్టు మండలంలో సుజన కోట, జోలాపుట్టు జలాశయ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన కనువిందు చేసే దీవులు, మనసుదోచే మత్స్యగడ్డ అదేవిధంగా మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రం, డుమ జలపాతాలు ఇటువంటి ఆహ్లాదకరమైన అందమైన పర్యాటక కేంద్రాలు ఉన్నప్పటికీ అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసి జోలపుట్టు జలాశయం వద్ద వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏపీ ఎయిర్పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ప్రాజెక్టు ఏర్పాటు కోసం బుధవారం జోలపుట్టు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నువ్వు నిర్వహించారు. జోలాపుట్టు పంచాయితీలోని 11 గ్రామాల నుంచి గిరిజనులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాల్గొన్న వారంతా వారి వారి అభిప్రాయాలను సభలో తెలియజేశారు. మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రం నిర్మాణం చేసి 70 ఏళ్లు అవుతున్న ప్రాజెక్టుల వలన భూములు కోల్పోయిన వారికి నేటికీ వారికి ఎటువంటి ఉపాధి ఉద్యోగ అవకాశాలు గాని లేకుండా పోయాయని అంతేకాకుండా ఎటువంటి నష్టపరిహారం కూడా ప్రభుత్వం నుంచి వారికి అందలేదని మైదాన ప్రాంతాలకు చెందిన వారికే జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని దీనివలన నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నూతనంగా ఏర్పాటు చేస్తున్న వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ లో 85 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తీర్మానం చేస్తేనే ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తే జోలా పుట్టు పంచాయతీ గిరిజనులకు న్యాయం జరిగేలా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎంతమంది స్థానిక గిరిజనులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారో స్పష్టమైన తీర్మానం చేయాలని ముఖ్యంగా భూ బదలాయింపు చట్టం , ఫిఫ్త్ షెడ్యూల్ ప్రకారం గిరిజన హక్కులు చట్టాలకు ఎటువంటి భంగం కలగకుండా చూడాలని బినామీ వ్యవస్థ అనేది ఉండకూడదని జోలా పుట్టు జలాశయం పరిసర ప్రాంతాల్లో చేపల వేట చేసే గిరిజనులకు, మత్స్య సంపదకు ఎటువంటి కాటంకాలు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆమె సూచించారు. పర్యావరణం కలుషితం కాకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ అందరి అనుమతితోనే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకే ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించడం జరుగుతుందని స్థానిక గిరిజన యువతి యువకులకు ప్రాజెక్టులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జోలపుట్టు పరిసర ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అన్ని అనుమతులతోనే ప్రాజెక్టు ఏర్పాటు చేయడం జరుగుతుందని గిరిజన మత్స్యకారుల కోసం ఫిషింగ్ టూరిజం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ లు సరిత, ఉపేంద్ర, టూరిజం డీవీఎం జి.వి.బి. జగదీష్, విశాఖపట్నం కి చెందిన పర్యావరణవేత్త జెపి రామారావు, జిమాడుగుల సిఐ శ్రీనివాసరావు, తాసిల్దార్ భాస్కర అప్పారావు, డిప్యూటీ తాసిల్దార్ భాస్కరరావు, వీఆర్వో రమేష్, సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీలు కమల, సుబ్బలక్ష్మి, వైసిపి జె సి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, వైసిపి సీనియర్ నేత వైసీపీ యువజన విభాగం జిల్లా నేత జెవివిఎన్ మూర్తి, ఎండి సులేమాన్, మాజీ సర్పంచ్ వంతల రామస్వామి అధిక సంఖ్యలో పంచాయతీ గిరిజనులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యువకుడుపై ఎలుగు బంటి దాడి ఆస్పత్రికి తరలింపు

**అరకులోయ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**



అరకులోయ మండలంలోని బస్కి పంచాయితీ లోతట్టు గ్రామమైన దేవరాపల్లి గ్రామానికి చెందిన కిల్లో గోపాల పై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. దేవరపల్లి గ్రామానికి చెందిన గోపాల్ గ్రామస్తులతో కలిసి పశువులను కాయడానికి కొండకి వెళ్ళగా అక్కడే మోటివేసి ఉన్న ఎలుగుబంటి అతను దాడి చేసి గాయపరిచింది. అదృష్టవశాత్తు ప్రక్కనే తవ్వబడి ఉన్న ఒక ట్రంచర్ లో అతను బోర్లా పడిపోవడంతో వెనుక భాగం మాత్రమే గాయం చేసింది. దూరంగా ఉన్న మిగిలిన గ్రామస్తులు పెద్దగా అరవడంతో ఎలుగుబంటి ఆ వ్యక్తిని విడిచి అడవి లోకి పారిపోయింది. ఈ ఘటనల్లో కిల్లో గోపాల్ కు కాలు నుజ్జు నుజ్జు అయింది. చేతిపై మోకాళ్ళపై కొట్టి ఎలుగు బంటి గాయపరిచింది. బాధితుడు గోపాల్ అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## ఏజెన్సీలో గిరిజన హక్కుల రక్షణే మా ధ్యేయం

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త**

అల్లూరి జిల్లా పాడేరు జిల్లా కేంద్రం గిరిజన భవన్‌లో గురువారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజన నిరుద్యోగులు, ఉద్యోగులు మరియు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోచల రామకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు జంపరంగి ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మినుముల ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి వి. కొండలరావు ఉమెన్స్ జిల్లా సెక్రటరీ చెట్టి శాంతి కుమారి చీఫ్ అడ్వైజర్స్ లకే వెంకటరమణ దొర, కె. రామ్మూర్తి నాయుడు, చింతపల్లి జోన్ ఉపాధ్యక్షులు డి. దేములు, జిల్లా సెక్రటరీ ద్రి. సతీష్, చింతపల్లి జోన్ సెక్రటరీ సాగేని కోటి బాబు గారుఅరకు జోన్ సంయుక్త కార్యదర్శి జయ సింహాచలం పెద్దబయలు జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పలాస తిరుపతి రావు తో పాటు జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

ong-12_ong-12.qxd 4/3/2026 12:17 AM Page 1



## ఉచిత ఎగ్ కార్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**బుచ్చయ్యపేట ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



బుచ్చయ్య పేట మండలం కోమల్లపూడి గ్రామంలో చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ రాజు ఉచిత ఎగ్ కార్ట్ ను ప్రారంభించారు. కోమల్ల పూడి గ్రామం లో దుర్గ ఉమెన్స్ స్వయం సహాయక సంఘంలో గేదెల భూలక్ష్మి అనే సభ్యురాలికి ఉచిత ఎగ్ కార్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు, ఉచిత ఎగ్ కార్ట్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనివల్ల డ్వాక్రా మహిళలు తమ కాలు పై తాము నిలబడి చిన్న వ్యాపారం చేసుకోవచ్చుని, ఎగ్ ఆమ్లెట్, ఎగ్ ఫ్రైడ్ రైస్ వంటి వంటకాలతో రోజుకు 3000 సంపాదించుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారా యణ, గోకివాడ కోటేశ్వరరావు, వెలుగు ఏపీఎం రాజుబాబు,సిసిలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లుకు లోక్ సభ గ్రీన్ సిగ్నల్ - కొవ్వొత్తుల వెలుగుల్లో సంబరాలు

**(రాంబిల్లి ఏప్రిల్ 2 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం మూలజంప గ్రామంలో యూనిట్ ఇంచార్జ్ అందుకూరి ప్రసాద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు చేసుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్సభలో అమరావతి చట్టబద్ధత చేస్తూ బిల్లు ఆమోదం పొందడంతో ఐదు కోట్ల ఆంధ్రులు ఆకాంక్షలకు న్యాయం చేసిన రోజు అని ఇది కేవలం రాజధాని మాత్రమే కాకుండా తెలుగుజాతి ఆత్మగౌరవానికి దక్కిన గౌరవ మర్యాదలు అని అన్నారు, ఇప్పటినుంచి మన ఆంధ్ర రాష్ట్రానికి స్పష్టమైన గుర్తింపుగా నిలుస్తుందని అమరావతి బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, కూటమి ప్రభుత్వం ప్రజల ఆశయాలను నెరవేర్చిందని మళ్లీ రాబోయే కాలంలో కూడా కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కొవ్వొత్తులు వెలిగించి అమరావతికి జేజేలు పలికారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

## దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్న రూరల్ ఎస్సై ఉపేంద్ర

**ఎలమంచిలి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**

మండలంలోని పెద్దపల్లి అగ్రహారం గ్రామాలలో దొంగతనాలు ఆస్తి సంబంధిత నేరాలు, ఆన్లైన్ బెట్టింగులకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన రూరల్ ఎస్సై ఉపేంద్ర. ఈ సందర్భంగా గ్రామాలలో ఉన్న యువకులు ప్రజలకు ఎస్ఐ ఉపేంద్ర సమావేశం ఏర్పాటు చేసి ఆస్తి సంబంధిత నేరాలు ఆన్లైన్ బెట్టింగులు వల్ల కలిగే అనర్థాలను విశ్లేషించారు. వేసవి సందర్భంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బయట వారు ఎవరైనా వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## కేంద్రానికి కూటమి కృతజ్ఞతలు

**గొలుగొండ ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

ఆంధ్రుల కలల రాజధాని అమరావతి బిల్లుపై కేంద్రం పార్లమెంట్లో ఆమోదం తెలపడం ప్రజల ఆకాంక్షను నెరవేర్చినట్లేనని అనకాపల్లి జిల్లా పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షుడు అడిగేళ్ల అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ దీపారాధన కార్యక్రమంలో కోటమ నాయకులు పాల్గొని కేంద్రాన్ని కృతజ్ఞతలు తెలియజేస్తూ నినాదాలు చేశారు. అనంతరం మండల పరిషత్ లో సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వం శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించి పార్లమెంట్లో ఆమోదం చేసే విధంగా కృషిచేసిన ప్రధానమంత్రి మోడీ మిగతా పార్టీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఈ ఆనందచనాలను కూటమి నాయకులు స్థానిక ప్రజలు కార్యకర్తలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ లు పారేపల్లి నాగేశ్వరావు సుర్ల బాబ్జి,బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు లావరాజు, అధికారులు ప్రజలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల పోరాటం గెలిచింది.. అమరావతి శాశ్వతంగా నిలిచింది

**అనకాపల్లి ఏప్రిల్ 2 (ప్రభాతవార్త)**



పార్లమెంటు ఉభయ సభలు అమరావతి బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం రాష్ట్ర ప్రజలు, రైతుల విజయం అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయం నుండి మహిళలు, యువత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ. ఆంధ్రుల కల అమరావతికి చట్టబద్ధత రావడం పట్ల రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారు. ప్రధానంగా అమరావతి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహిళలకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని కూడా లేని పరిస్థితుల్లో శివరామకృష్ణన్ కమిషన్ నివేదిక మేరకు విజయవాడ గుంటూరు మధ్య అమరావతిని రాజధానిగా ప్రకటించాం. చంద్రబాబు పై నమ్మకంతో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమిలిచ్చారు. దేశ వ్యాప్తంగా పుణ్య నదుల నుంచి నీరు, పుణ్యక్షేత్రాల నుంచి మట్టి తీసుకొచ్చి ప్రధానమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసాం. ఢిల్లీని మించిన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దామని ఆరోజు హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా సచివాలయం అసెంబ్లీ హైకోర్టు సహా అనేక భవనాలను నిర్మించాం. రాబోయే 25 సంవత్సరాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, కొట్ని బాలాజీ, పి.వి.జి.కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి పరమేష్, బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ తదితర నాయకులు కార్యకర్తల భారీగా పాల్గొన్నారు.

## చోడవరంలో అమరావతి విజయోత్సవ ర్యాలీ

**చోడవరం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**



ప్రజా రాజధాని అమరావతి కి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు లో బిల్లు పాస్ అయిన సందర్భంగా గురువారం సాయంత్రం చోడవరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, మన రాష్ట్ర ముఖ్యమంత్ర నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి అభినందనలు తెలియజేస్తూ చోడవరం లోని కొత్తూరు జంక్షన్ నుంచి గవర్నమెంట్ కాలేజ్ వరకు 200 బైక్స్ తో ర్యాలీ నిర్వహించి క్రాకర్స్ కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతిపై గత ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం ధర్మం ఎప్పుడు నిలిచి ఉంటదని చెప్పారు. ఈ ప్రజా రాజధాని దేశానికే ఆదర్శంగా నిలవగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల మనిషిగా ఉషారాణి ఐదేళ్ల ప్రస్థానం..

**- సర్పంచ్ ముగింపు పదవీకాలం ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రశంశాలు**

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త**



రాజకీయాలు అంటే కేవలం పదవులు అనుభవించడం కాదు, ప్రజా సేవకు అంకితం కావడమని పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి నిరూపించారని పలువురు కొనియాడారు. సర్పంచుల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు అధ్యక్షతన పాడేరు పంచాయితీ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో ప్రత్యేమాయ పార్టీ నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురైనా, నిధుల కొరత వేధిస్తున్నా వెనకడుగు వేయకుండా పాడేరు మేజర్ పంచాయతీ రూపురేఖలను ఉషారాణి మార్చేశారని ఈ సమావేశంలో వక్తలు ఉద్ఘాటించారు. మౌలిక సదుపాయాలాంటె డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత రహదారుల నిర్మాణం వంటివి చేసి ప్రజా సంక్షేమంలో సామాన్యుడికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చేస్తూ తన అన్న కొట్టగుళ్లి సుబ్బారావు మార్గదర్శకత్వంలో పారదర్శక పాలన కొనసాగించి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని సమావేశానికి హాజరైన పలువురు ప్రశంశాలు కురిపించారు. ఈ సమావేశంలో కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ.. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ, ప్రజల గుండెల్లో సంపాదించుకునే స్థానం శాశ్వతమని పేర్కొన్నారు. ఉషారాణి సర్పంచ్‌గా ఉన్న కాలంలో చేసిన అభివృద్ధి పనులు రాబోయే రోజుల్లో కూడా సాక్ష్యాలుగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అధికారం ఉన్నా లేకపోయినా మా కుటుంబం ఎప్పుడూ పాడేరు ప్రజల పక్షమే. గత ఐదేళ్లలో మేము చేసిన ప్రతి పైసా అభివృద్ధి పని ప్రజల కళ్ల ముందే ఉందని సుబ్బారావు అన్నారు. ఉషారాణికి అభినందనల జల్లు కురిపించి పార్టీ శ్రేణులు, అభిమానులు ఉషారాణిని ఘనంగా సన్మానించారు. ఒక మహిళా సర్పంచ్‌గా ఆమె చూపిన ధైర్యం, అభివృద్ధిపై ఆమెకున్న చిత్తశుద్ధిని కొనియాడుతూ జయజయధ్వానాలు చేశారు. రాబోయే రోజుల్లో కూడా పాడేరు అభివృద్ధిలో ఆమె పాత్ర కీలకమని కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు,పాడేరు వర్తకులు,వార్డు మెంబర్లు,పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా కలెక్టర్ దినేష్ కుమార్ ఐఏఎస్ ఆత్మీయ వీడ్కోలు

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం మరియు సిబ్బంది ఆయనకు అత్యంత ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన పాడేరులో పండుగ వాతావరణం నెలకొంది. ఊరేగింపుగా కలెక్టరేట్‌కు... గురువారం పాడేరులోని అంబేద్కర్ సర్కిల్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని, కలెక్టర్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పూల వర్షం, హింస డాన్సులు, మరియు నినాదాల మధ్య ఈ ర్యాలీ అత్యంత ఉత్సాహంగా కలెక్టరేట్ వరకు సాగింది. కలెక్టరేట్లో స్కూల్ విద్యార్థినిలు డాన్సులతో స్వాగతం పలికారు. అభినందన వేదిక వద్ద ఫ్లూట్ గిటార్, వాయిద్యాలతో అలరించారు. ఆత్మీయ సత్కార స భ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసి ఆత్మీయ వీడ్కోలు సత్కార సభలో జిల్లా అధికారులు కలెక్టర్‌ను పూలమాలలు, బొకెలుకు దుస్సాల్వలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా స్థాయి అధికారులు మాట్లాడుతూ కలెక్టర్ దినేష్ కుమార్ వారు జిల్లా అభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందించారని వివిధ శాఖల నుండి వచ్చిన అధికారులు మాట్లాడుతూ వారి ప్రతిభను అధికారులు కొనియాడారు. పాలనలో ఆయన చూపిన చొరవ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత ప్రజల సమస్యల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత మరువలేనిదని పేర్కొన్నారు. సౌమ్యుడిగా, సమర్థుడైన అధికారిగా జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ ఆయన చేసిన పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రశంసించారు. సహాయ కలెక్టర్ కె.సాహిత్ మాట్లాడుతూ నేను శిక్షణ కొన్ని నేర్చుకుంటే ఈ జిల్లాకు వచ్చిన తర్వాత ఎన్నో విషయాలపై ద్రోణాచార్య, బుద్ధుని వంటి సామరస్య గురువుల దగ్గర శిక్షణ పొందినంత ఆనందంగా ఉందని, అంత మంచి అనుభవాలను కలెక్టర్కలెక్టర్ సార్ నుండి నేర్చుకున్నానని పేర్కొన్నారు. పాడేరు ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ కలెక్టర్, ఐటిడి ప్రాజెక్టర్అధికారి తిరుమాని శ్రీపూజ మాట్లాడుతూ కలెక్టర్ సార్ తో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందని ఈ జిల్లాలో ఇంత మంచి కలెక్టర్ తో కలిసి పని చేయడం, ఇక్కడ గిరిజనులు పడుతున్న ఇబ్బందులు ముందుగా అవగాహన తెచ్చుకుని వారి సమస్యలను తీర్చినప్పుడు, అలాగే ఇక్కడ పండుతున్న కాపీ ఉత్పత్తులపై ముందుగా అదృష్ట సాధించి వాటి అభివృద్ధికి కృషి చేయమని సలహాలు ఇవ్వడం,అభివృద్ధి పనులలో మంచి సలహాలు సూచనలు అందించి మాకు వారితో పాటు ముందుకు తీసుకెళ్లిన కలెక్టర్ వారికీ ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పనిచేయడం ప్రతిరోజు ఒక సవాలు అని తెలిపారు. ప్రతిరోజు కొత్త కొత్త సమస్యలు వాటి ఎదురుకోవడం విభిన్నమైన అనుభవం ని తెలియజేశారు. గిరిజన బిడ్డలందరూ గొప్ప గొప్ప స్థాయిలో ఎదగాలని కోరుకుంటున్నాను అని స్పష్టం చేశారు. బ్రతికి ఉన్నంత వరకు ప్రతిరోజు కొత్త విషయాలు నేర్చుకోవాలని సూచించారు. ఐటీడీఏ పిఓ గా చేయడం గొప్ప అవకాశం మరియు ఇష్టమైన పదవి అని తెలిపారు. ఈట్ హెల్ది హెల్ది, థింక్ హెల్ది, వర్క్ హెల్దీ అని నినాదంతో అందరూ పనిచేయాలని సూచించారు. ప్రజలు సమస్యలతో మీ దగ్గరికి వస్తే ఓర్పుగా విని సమస్య నిజమైతే పరిష్కారం మార్గం చూపించాలని అధికారులు సూచించారు. కార్తీక్ మిశ్రా, సుమిత్ కుమార్ ఐఏఎస్ కు స్పెషల్ ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో అరకు కాఫీ బ్రాండింగ్, అరకు కౌని, నూట ఎనిమిది నమస్కారాల గోల్డ్ రికార్డ్ ఎన్నెన్నో అవార్డులు గుర్తింపు వచ్చినందుకు చాలా ఆనందకరమని పేర్కొన్నారు. జిల్లా అధికారులకు రెవెన్యూ సిబ్బందికి కలెక్టరేట్ పేషేకి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అల్లూరి జిల్లాను ఆర్గానిక్ జిల్లాగా 2029 చూడాలని తెలిపారు. జిల్లాలోగల రెడ్ క్రాస్ సొసైటీ అధికారులు, జిల్లా పాత్రికేయులు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్ జిల్లాకు చేసిన సేవలను వివరించారు. చివరిగా అసిస్టెంట్ కలెక్టర్ ఈరోజుతో శిక్షణ కాలంపూర్తి చేసుకున్నందున వారికి దుస్సాలువ మెమొంటో బొకేలతో అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడేరులో మిన్నంటిన "జయహో అమరావతి" సంబరాలు

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ రాజధాని బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించిన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ వేదికగా "జయహో అమరావతి" కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్అధ్యక్షతన, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా అధికారులతో కలిసి జరిగిన ఈ కార్యక్రమంలో అమరావతికి లభించిన చారిత్రాత్మక గుర్తింపును పురస్కరించుకుని అధికారులందరి మధ్య భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణ అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. రాష్ట్ర భవిష్యత్తుకు అమరావతి కేంద్ర బిందువు కాబోతుందన్న ఆకాంక్షచించి ఈ వేడుక ప్రతిబింబించింది. ఈ సంబరాల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజధాని బిల్లు ఆమోదం పొందడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తుందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆమోదాన్ని స్వాగతిస్తూ జిల్లా యంత్రాంగం ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని . ఐక్యతతో వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరిలోనూ కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఈ ఏజెన్సీ ప్రాంతమైన పాడేరులో కూడా రాజధాని పట్ల ఇంతటి సానుకూల స్పందన రావడం విశేషం. పిల్లల సే సంస్క ృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఈ వేడుకలతో పాడేరు కలెక్టరేట్ ప్రాంగణమంతా జయహో అమరావతి నినాదాలతో మార్మోగింది.

## టిడిపి సంబరాలు.. అమరావతి బిల్లు పార్లమెంట్ ఆమోదం,.

**ఎలమంచిలి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**



పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద మాజీ పార్లమెంట్ సభ్యులు సీనియర్ తెలుగుదేశం నాయకులు పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు మంత్రి నారా లోకేష్ అమరావతి రాజధాని శాశ్వత రాజధానిగా గుర్తింపు తేవడానికి ఎంతో కృషి చేశారని దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మద్దతు తెలపడం దేశంలో ఉన్న ఎంపీలందరూ దీనిని సమర్థిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదముద్ర పడిందని అన్నారు. వైసిపి నాయకులు పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎప్పటికీ అమరావతిపై కక్షపూరితంగానే వివరిస్తున్నారని పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు పార్లమెంటుకు వెళ్లకుండా బహిష్కరించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఏది ఏమైనా అమరావతి శాశ్వత రాజధానిగా గుర్తింపు రావడంతో ఆంధ్ర ప్రదేశ్ లోని అమరావతి రైతులతో పాటు రాష్ట్ర ప్రజలు ఆనందోత్సవాలు మధ్య సంబరాలు జరుపుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె శివన్నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఇతంశెట్టి సన్యాసినాయుడు, కాస్త ఇంచార్జ్ కరణం రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, దంట్ల వెంకటస్వామి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్లకు శంకుస్థాపనలు - ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**అచ్చుతాపురం ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. దొప్పెర్ల, తమ్మయ్య పేట, దోసూరు గ్రామాల్లో సీసీ రోడ్లు, కొల్లువానిపాలెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.172.80 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అలాగే రోడ్డునుంచి కర్రి శేఖర్ ఇంటివరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రావిపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (లీబివిళినిబిళీ) కింద రూ.15 లక్షలతో పనులు చేపట్టారు. ఇంకా పారిపల్లెమ్మ గుడి నుండి శీజూశిది షెడ్, తీతిళిది రోడ్డువరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ్నఅధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి 10 శాతం కూడా వారు చేయలేదని విమర్శించారు. జీవీఎంసీ పరిధిలో రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చిన్నారావు అధికారులు, గ్రామ ప్రజలు, యువకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లుకు చట్టబద్ధతపై అరకులోయలో హర్షం

**- ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

**అరకులోయ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త**



అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం పొందడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ గురువారం అరకులోయ లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు, బిజెపి, జనసేన పార్టీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనికి ముందు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అమరావతికి జై.... అండగా నిలబడ్డ ఐదు కోట్ల తెలుగు ప్రజలకు థాంక్స్... అంటూ ర్యాలీలో నినదించారు. ఈ సందర్భంగా చైర్మన్ సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ కలల రాజధాని అమరావతికి మద్దతుగా ఐదు కోట్ల ఆంధ్రులు ఒక్కతాటిపై నిలబడడం శుభసూచకం అని అన్నారు. అమరావతి కోసం అంతా ఒక్కటే నిలబడి ఉభయ సభల్లో చట్టబద్ధత దక్కేలా మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఐదు కోట్ల ఆంధ్రులు మద్దతు తెలిపిన సరే ఆ ఒక్కడు మావిగన్ జగన్ మాత్రం సిగ్గు లేకుండా వ్యతిరేకించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మిస్తున్న రాజధాని విషయంలో స్మశాన వాటిక అంటూ రకరకాల పేర్లతో పిచ్చిప్రేలాపనలు పేలిన వారందరికి నోరు మూయించేలా ప్రజలు ముక్తకంఠంతో మద్దతుగా నిలవడం సంతోషదాయకమన్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు నిలబడిందని వైసిపి ఒక్కటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాజధానికి వ్యతిరేకంగా మారిపోయిందన్నారు. చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మించి తీరుతారని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే మన కలల రాజధాని ఉండిబోతుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, నారా లోకేష్ కి అరకు ఆదివాసీల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఎం సి చైర్మన్ బి బి లక్ష్మి, టి డి పి నాయకులు లోకోయి మహదేవ్, పెట్టెలి దాసుబాబు, శెట్టి బాబురావు, చందు పాడి, విజయ నిర్మల, మాజీ ఎంపీటీసీ కుమార్ , నాగరాజు, భారతీయ జనతా పార్టీ నాయకులు వంతల దేవదాసు, ఆనంద్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో "ఉద్యోగ విజయోత్సవం"

**- ఘనంగా నిర్వహణ 100శాతం ఉద్యోగాలు**

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త**




పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ), సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల తుది సంవత్సరం విద్యార్థుల ప్రతిభను గౌరవిస్తూ "జాబ్ అచీవర్స్ డే (ఉద్యోగ విజయోత్సవం) ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల 202526 విద్యా సంవత్సరానికి 100శాతం ప్లేస్మెంట్స్ సాధించడం విశేషం. విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారు. ముఖ్యంగా సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాసరావు హాజరై విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులు సంపాదించిన సాంకేతిక నైపుణ్యాలు మరియు ప్రాక్టికల్ జ్ఞానం అత్యున్నత స్థాయిలో ఉన్నాయని, వారు అత్యంత ప్రతిభావంతులు మరియు పరిశ్రమలకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రశంసించారు. జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం. హరిబాబు సభకు అధ్యక్షత వహించి విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్లేస్మెంట్ ముఖ్యాంశాలు: సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోని మొత్తం 25 మంది విద్యార్థులు విజయగరం లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ ఈ ఈ విభాగానికి చెందిన రాజేష్, సురేష్ ఐదు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందగా, మరో రెండు అపాయింట్మెంట్ లెటర్లు రావాల్సి ఉన్నాయన్నారు. మెకానికల్ విభాగానికి చెందిన పి. హేమసాయి, భరత్ కుమార్ రెడ్డి తలా మూడు కంపెనీలలో ఉద్యోగాలు సాధించారన్నారు మెకానికల్ విభాగం హెచ్డీ శ్రీమతి రూప, ఈ ఈ ఈ హెచ్డీ శ్రీమతి జ్యోత్స్న, సివిల్ హెచ్డీ శర్మ , జనరల్ సెక్షన్ శ్యామల ని వారి సేవలకు గాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తుది సంవత్సరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు

**అరకు రూరల్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**

సర్పంచుల పాలన ముగియడంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి నేటి నుండి ప్రత్యేక అధికారులు పంచాయతీ పాలనను కొనసాగించనున్నారు. అరకు లోయ మండలంలో 14 పంచాయతీలకు గాను 7 గురు ప్రత్యేక అధికారులను నియమించారు. బొండం, మాడగడ పంచాయతీకి స్థానిక తాసిల్దార్ కుమారు స్వామిని , చొంపి, పెదలబుడు, గ్రామ పంచాయతీలకు ఎంపీడీవో లవ రాజును ప్రత్యేక అధికారులుగా నియమించారు. అదేవిధంగా పద్మాపురం, శిరగం గ్రామ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో (పిఆర్) సత్యనారాయణను ఇరగాయి, లోతేరు కు, మండల విద్యాశాఖ అధికారి (1) త్రినాధరావును కొత్తబల్లు గుడ, సుంకర మెట్ట పంచాయతీలకు మండల విద్యాశాఖ అధికారి(2) భారతీరత్నం ను గన్నెల, మాదల పంచాయతీలకు అరకు లోయ ఐసిడి ఎస్ సిడిపిఓ లక్ష్మి లావణ్యను, బస్కి, చినలబుడు పంచాయతీలకు అరకు వ్యవసాయ శాఖ ఏవో ఫణి రాజ్ వర్మ లో ప్రత్యేక అధికారులుగా నియమించారు

## అమరావతి" రాజధానిగా చట్టబద్దత పై బీజేపీ హర్షం

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త:**

పార్లమెంట్ సాక్షిగా అమరావతికి చట్టబద్ధత లభించడం ప్రతి ఆంధ్రప్రదేశ్ వాసికి గర్వకారణం.అమరావతి" రాజధాని గా చట్టభద్రత పై బీజేపీ హర్షం వ్యక్తం చేస్తున్నామని పాడేరు బీజేపీ మైనారిటి మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక గురువారం ఒక ప్రకటన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమరావతి చీకటి చేసింది నేడు వెలుగు వచింది అని అన్నారు, రాష్ట్ర వ్యాప్తంగా వెలుగులు నేడు రాత్రి ప్రతి ఇంటికి వెళులుగులు వెలిగించి వైసీపీ చీకటి తో లగింది అమరావతి ఏకైక రాజధాని అన్నారు. ఉభయ సభలు లోక్‌సభ, రాజ్యసభలలో అమరావతి బిల్లుకు ఆమోదం లభించడంలో కీలక పాత్ర పోషించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ కి ఏపీ సీఎం నారా చంద్రబాబు కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు, ఇది కేవలం ఒక నిర్ణయం కాదు.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాది రవికుమార్ అన్నారు.

### అమరావతి రాజధానిగా చట్టబద్దత కల్పించిన సందర్బంగా దీపాలు వెలిగించి సంబరాలు

**పాడేరు,ఏప్రిల్2, ప్రభాతవార్త**

అమరావతి రాజధానిగా చట్ట బద్దత కల్పించిన సందర్భంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో సర్పంచుల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ ప్రజా రాజధానిగా అమరావతిని ప్రజలు ఆమోదించినప్పటికి వైసీపీ పార్టీ నాయకులు వ్యతిరేకించిన పార్లమెంట్ లో అమరావతి రాజధానిగా చట్ట బద్దత కల్పించడం వల్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు శుభపరిణామమని ప్రజా రాజధానిగా చట్టబద్దత కల్పించిన సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, టీడీపీ యువ నాయకులు త్రినాధ్ మురళి,సాగర్,బెసు తదితరులు పాల్గొన్నారు

## అమరావతి చట్టబద్ధతపై హుకుంపేటలో సంబరాలు

**హుకుంపేట, ఏప్రిల్ 2,ప్రభాతవార్త**

అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు బై సభలో ఆమోదం పొందడానికి అర్హత వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో టిడిపి నాయకులు టిడిపి మండల అధ్యక్షులు శతక బొంజు బాబు ఆధ్వర్యంలో కొవ్వతులు వెలిగించి నిన్నదలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఈ కార్యక్రమం ఉద్దేశించి మాజీ పార్లమెంటు కోశాధికారి నాగేశ్వరావు మాట్లాడుతూ అమరావతి కలలు రాజధానికి మద్దతుగా నిలిచి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ 3 రాజధానులు అంటూ ముక్కలాడిన జగన్ కు బుద్ధ చలో ఐదు కోట్ల ఆంధ్రులు అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో లోక్సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం తెలిపినందుకు మద్దతుగా రాలిసే పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ఎస్ సూర్యకాంతం. టి ఎన్ ఎస్ ఎఫ్ అరకు పార్లమెంటు అధ్యక్షులు కట్టబోయిని శంకర్. స్థానిక ఎంపిటిసి కుమ్మరమ్మ. మండల ఉపాధ్యక్షులు లాక్కో నాగేశ్వరరావు మజ్జి. జనసేన రూరల్ కార్యదర్శి ప్రధాని సురేష్ పర్దానివా. వి అధ్యక్షురాలు కోరుబిల్లి సంతోషం కుమారి, మాజీ ఎంపిటిసి లక్ష్మయ్య, సర్పంచ్ లక్ష్మయ్య,యూనిట్ ఇన్చార్జి కోర్రా నాగబాబు. గ్రామ కమిటీ అధ్యక్షులు దళాయి లక్ష్మణ్, నాయకులు సుమన్, నర్సింగ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వెంకయ్య పాలెం గ్రామంలో శ్రీ బంగారమ్మ తల్లి పండగ మహోత్సవం

**(రాంబిల్లి ఏప్రిల్ 2 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం వెంకయ్య పాలెం గ్రామంలో వెలసిన శ్రీ బంగారమ్మ తల్లి నవరాత్రులు ఘనంగా ముగిసాయి, ప్రతి ఏటా కొత్త అమావాస్య మరుసటి వారం నుంచి ప్రారంభమయ్యే ఈ నవరాత్రులు అమ్మవారి మేల తాళాలతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించి గురువారం కుంకుమ పూజలు చీర సారే లతో భక్తులు దర్శించుకుని ముగింపు పలికారు, పలు గ్రామాల నుంచి వచ్చే భక్తులు గుడి ప్రాంగణంలో మజ్జిగ, పులిహార అన్న సమారాధనలు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు, ఈ కార్యక్రమంలో గజిరెడ్డిపాలెం జనసేన పార్టీ సీనియర్ నాయకులు చెల్లూరి కొండబాబు, రాంబిల్లి మండల టిడిపి ఉపాధ్యక్షులు సురాడ అప్పలరాజు, మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

3skl13:3skl13.qxd 02-04-2026 22:33 Page 1



## పాతపట్నంలో ఎంవీఐ తనిఖీలు .. ప్రైవేట్ ట్రావెల్స్‌పై నిఘా



పాతపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : పాతపట్నం మండల కేంద్రంలో గురువారం పలాస మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వై.శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రతా నిబంధనల అమలును పర్యవేక్షించడంలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా దూరప్రాంతాలకు సర్వీసులు నడుపుతున్న ప్రైవేట్ ట్రావెల్స్, వోల్వో బస్సులపై ఎంవీఐ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీల్లో భాగంగా వాహనాలకు సంబం ధించిన కీలక పత్రాలను, పర్మిట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సురెన్స్ పత్రాలు, డ్రైవర్ల లైసెన్స్‌లను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రయాణికుల రక్షణ విష యంలో ఎటువంటి రాజీ పడకూడదని ట్రావెల్స్ యాజమాన్యాలను ఆయన హెచ్చరించారు. బస్సుల్లో అత్యవసర ద్వారాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్స్) సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అని తనిఖీ చేయ డంతో పాటు అగ్నిమాపక పరికరాల లభ్యతను కూడా ఆయన పరిశీలించారు. రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా దూరప్రాంతాలకు వెళ్లే వాహనాలు పక్కా ఫిట్‌నెస్, సరైన పత్రాలతో ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడానికి కూడా వెనుకాడబోమని శ్రీనివాస్ సూచించారు.

## గ్రామ వికాసంలో సర్పంచ్‌ల పాత్ర చిరస్మరణీయం : రెడ్డి శాంతి



పాతపట్నం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగుస్తున్న సందర్భంగా పాతపట్నం నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అభినందనలు తెలియజేశారు. గత ఐదేళ్లగా ప్రజా ప్రతినిధులుగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు అహర్నిశలు కృషి చేశారని ఆమె కొనియాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో సర్పంచ్‌లు కృషి చేశారని గుర్తుచేశారు.

## బూరగాంలో ఇంటింటా బడిబాటతో ప్రచారం



కంచిలి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి పార్టీ అధికారం చేపట్టిన తర్వాత మంత్రి నారా లోకేష్ విద్యా శాఖ మంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రక్షాళన చేపట్టి విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చి ప్రభుత్వ బడులపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా చర్యలు చేపట్టారని బూరగాం పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురువారం బూరగాంలో ప్రభుత్వ బడిలో చేరండి. ఉన్నత స్థానాలు పొందండి నినాదాలతో విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ చేస్తూ ఇంటింటా బడి బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్య పట్ల చైతన్యం కల్పిం చడమే లక్ష్యంగా ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కలిసి ముందుకు వచ్చారు. ప్రధానోపాధ్యాయుడు ముప్పన సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శిస్తూ తల్లిదండ్రులతో నేరుగా మమేకమై ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాంతారావు, ఉపాధ్యాయులు కుసరాజు కిరణ్, పుణ్యావతి, హేమలత, నిరంజన్, చలపతి, ఎంవీ రమణ, పాఠశాల కమిటీ చైర్మన్, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధత గుర్తింపు



కంచిలి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్ర రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజలు నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం ఎన్నో త్యాగాలు, దీర్ఘకాల పోరాటాలు చేసిన ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి పార్లమెంట్‌లో ఆమోదం పొందిన బిల్లుతో న్యాయం జరిగినట్లు రాష్ట్ర ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్ర చరిత్రలో చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో బోధన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏమిటి? అనే ప్రశ్నకు స్పష్టత ఇవ్వలేకపోయిన పరిస్థితులు ఉపాధ్యాయుల్లో ఆవేదన కలిగించేవని, ఆ అనిశ్చితి తొలగిపోవడం విద్యావ్యవస్థకు ఉపశమనం కలిగించిందని వివరించారు. అమరావతికి చట్టబద్ధ గుర్తింపు రావడంతో విద్యార్థులకు స్పష్టమైన అవగాహన అందించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు రాష్ట్ర ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం తరఫున ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి, సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## అమరావతి బిల్లు ఆమోదం రాష్ట్ర చరిత్రలో సువర్ణధ్యాయం



రాజాం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతికి రాష్ట్ర, కేంద్ర చట్ట సభల్లో బిల్లు ఆమోదం పొందడం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని రాజాం జనసేన పార్టీ సీనియర్ నాయకులు కె.వి.ప్రవీణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం రాజధాని నిర్ణయం మాత్రమే కాదని రాష్ట్ర భవిష్యత్తును మలిచే దిశానిర్దేశక అడుగని పేర్కొన్నారు. ఈ బిల్లు ఐదు కోట్ల ఆంధ్రుల గుండె చప్పుడు అని గుర్తు చేశారు. అమరావతి బిల్లు ఆమోదం ద్వారా రాజధాని రైతుల త్యాగాలకు నిజమైన గౌరవం దక్కిందని, ఇది ప్రజల ఆత్మగౌరవానికి సాధించిన గొప్ప విజయమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడులు ఆకర్షించేలా, యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి,అవకాశాలు లభించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తారని ఆకాంక్షించారు.

## వితంతువులకు అండగా కూటమి ప్రభుత్వం : అశోక్



కవిటి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: వితంతువులకు అండగా కూటమి ప్రభుత్వం ముఖ్యంగా చంద్ర బాబునాయుడు అండగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వితంతువులకు నూతన పింఛన్లు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా భర్త చనిపోయిన వెంటనే నెలరోజులలో భార్యకు పింఛను వచ్చే ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. మీరంతా ఈ పింఛనుతో కుటుంబాన్ని భరోసాగా నిలుపుకోవాలని తెలిపారు. ఎంపీడీవో ఎల్.త్రినాథ్, ఏఎంసీ చైర్మన్ మణిచంద్ర ప్రకాష్ పీఏసీఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ పట్నాయక్, రైల్వే మెంబర్ శ్రీనివాసరావు రౌళో, మాజీ సర్పంచ్ కృష్ణారావు, గిరిబాబుతోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## షన్ముఖసాయికి రూ.12 వేలు ఆర్థిక సాయం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండలం తిలారు గ్రామానికి చెందిన తలసేమియా వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షణ్ముఖ సాయికి కొత్తపల్లి ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థులు గురువారం రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని షణ్ముఖసాయి చిన్నా న్నలు శంకర్, అప్పన్నలకు అందజేశారు. చిన్ననాటి నుండే పిల్లలో తోటివారికి సాయం చేయాలనే యోచన రావడం, దయార్థ హృదయం కలిగి ఉండటం ప్రస్తుత సమాజంలో అవసరమని, ప్రభుత్వ బడి పిల్లలలో విలువలతో కూడిన విద్య అందించడమే తమ లక్ష్యమని పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు కొర్లాం శాంతకుమారి తెలిపారు. విద్యార్థులు కవిత, సృజన కుమార్, జనని, జగదీష్, హారిక, జ్ఞానశ్రీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి సాధన కూటమి ప్రభుత్వానిదే..



కోటబొమ్మాళి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గురువారం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవింద రాజులు అన్నారు. ఆయన గురు వారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దుష్ట శక్తుల నుంచి అమరావతి రాజధానికి రక్షణ లభించిన శుభదినమిదని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, లోక్‌సభ సభ్యులకు గోవిం దరాజులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి త్వరలోనే అద్భుత నగరంగా అవతరించబోతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## జలజీవన్ పైపులు దగ్ధం.. ఎగిసిపడిన భారీ మంటలు



సీతంపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : జలజీవన్ పథకం కింద ఇంటింటికి తాగునీరు అవసరాలు తీర్చడానికి తీసుకువచ్చిన పైపులు ప్రమాదవశాత్తు అగ్నికి దగ్ధమయ్యాయి. సీతంపేట తిరుమల తిరుపతి దేవస్థానం సమీ పంలో ఖాళీ ప్రదేశంలో రెండేళ్ల క్రితం జలజీవన్ పథకానికి వినియోగించడానికి పైపులను కాంట్రాక్టర్ తీసుకువచ్చి నిలువ ఉంచారు. ఈ పైపులు గురువారం మధ్యాహ్నం సమీపంలో అగ్నికీలలు ఏర్పడి ఒక్కసారిగా పైపులు అగ్గి మంట తగలడంతో పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగిసి పడడంతో పాలకొండ అగ్నిమాప సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు వచ్చి అగ్ని కీలలను నివారించారు. అప్పటికే పూర్తిస్థాయిలో పైపులు దగ్ధమైపోయాయని ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేశారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన 'కణితి'



ఆమదాలవలస, ఏప్రిల్ 2 (ప్రభాతవార్త): ఆముదాలవలస బార్ అసోసియేషన్ మార్చి 25న జరిగిన ఎన్నికల్లో అన్నెపు సత్యనారాయణపై ఏడు ఓట్లు మెజార్టీతో గెలుపొందిన కనితి విజయలక్ష్మి భాయి గురువారం అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూతన కార్యవర్గానికి బాధ్యతలను అప్పజెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన కనితి విజయలక్ష్మి భాయి మాట్లాడుతూ తనకు అధ్యక్షులుగా ఎన్నుకున్న న్యాయవాదులకు ధన్యవాదములు తెలిపారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి న్యాయవాదుల సహకారాలతో కృషి చేస్తానని అన్నారు. నూతన భవనాలకు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా ఉపాధ్యక్షులుగా జి.వెంకట్రావు, కార్యదర్శిగా ఏ.విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా కే.గణపతిరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలువురు న్యాయవాదులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదులు ఎస్.ధనుంజయరావు, చాపర రమేష్, కింతలి త్రినాధరావు, సీపాన గోవిందరావు, బూరెల్ల సీతారాం, తమ్మినేని అన్నంనాయుడు, జి.ప్రభాకర్ రావు, కెవి రమణమూర్తి, బాగాది గోవిందరావు, సనపల ప్రసాదరావు, పి మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ వృక్షం.. 'పాలవలస' కుటుంబం



వీరఘట్టం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఈ ప్రాంతంతో పాటు ముఖ్యంగా వీరఘట్టం మండలంలో రాజకీయవృక్షం... దివంగత పాలవలస రాజశేఖరమేనని పలువురికి రాజకీయ ఓ నామాలు నేర్పించి ఉన్నత పదవులు కట్టబెట్టే వరకు అరుదైన అవకాశాన్ని ఇచ్చి ఆదుకున్నది పాలవలస కుటుంబమేనని పలువురు వక్తలు నొక్కి వక్కాణించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచులకు ఘనంగా ఆత్మీయ సత్కారం నిర్వహించిన సమావేశంలో వారంతా మాట్లాడారు. ఎంపీపీ ధమలపాటి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజశేఖరం తనయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ ధమలపాటి వెంకటరమణ నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్, కంబర ఎంపీటీసీ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, చిదిని సర్పంచ్ ధమలపాటి ఉమామహేశ్వరరావు, తూడి సర్పంచ్ కుద్దిగాన వెంకటరమణతో పాటు దుశుమంతపురం, కుమ్మరిగుంట తదితర సర్పంచులు సభలో మాట్లాడుతూ పాలవలస కుటుంబంపై ఉన్న తమ మమకారాన్ని ఈ విధంగా చాటుకున్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎస్ఐ



వీరఘట్టం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మానసికోల్లోసానికి క్రీడలు ఎంతో అవసరమని, వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు అన్నారు. గురువారం మండలంలోని అచ్చెపువలస గిరిజన గ్రామంలో జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ మెగా క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమని ఆయన చెబుతూ విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. క్రికెట్ ఆటగాళ్లను ఈ సందర్భంగా పరిచయం చేసుకున్నారు. క్రీడల వలన శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటామని, అలాగే ఆటలతో పాటు చదువులో కూడా రాణించి మంచి భవిష్యత్తుకు నాంది పలకాలన్నారు.

## ఘనంగా షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట



సీతంపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : షిరిడి సాయి బాబా విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. తురాయిపువలస సమీపంలో షిరిడి సాయిబాబా ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్మాణం సంబంధించి ప్రతిష్టా కార్యక్రమం బాబా విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై విగ్ర ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాజీ ఎమ్మెల్యే వి.కళావతి ఏపీవో జి.చిన్నబాబు పీహెచ్ఓ వెంకటగణేష్, ఇమరక పవన్, సర్పంచ్ కళావతి కే.సరస్వతి పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయాలని సామాన్యుడు రాకూడదా ? : చింతాడ



ఆముదాలవలస, ఏప్రిల్ 2, (ప్రభాతవార్త): నియోజకవర్గ పరిధిలో ప్రజలకు సేవ చేయాలని సామాన్యుడు రాకూడదా అని వైయస్సార్సీపి నాయకులు చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. గురువారం ఆముదాలవలస వైయస్సార్సీపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తన పైన తన పార్టీ పైన వ్యక్తిగత విమర్శలు చేయడం ఆ మనిషికి తగదని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైయస్సార్సీపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, డి.శ్యామలరావు సురవరపు నాగేశ్వరరావు, బెవర మల్లేశ్వరరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, పొన్నాడ చిన్నారావు, పి.శ్రీనివాసరావు, కూటికుప్పల సన్యాసిరావు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ స్కూల్‌లో ఫేర్ వెల్ డే



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : స్థానిక శాంతినికేతన్ స్కూల్‌లో 2025-26 పదవ తరగతి బ్యాచ్‌కి సంబంధించి వీడ్కోలు సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పబ్లిక్ పరీక్షలో చక్కగా చదివి బాగా రాసిన విద్యార్థులకు చదువు చెప్పిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఉద్దేశించి పదవ తరగతి తర్వాత పై చదువులు కూడా బాగా చదివి ఉన్నత స్థానంలో ఎదగాలని మీ తల్లిదండ్రులకు స్కూళ్లకు మంచి పేరు తీసుకురావాలని మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే.సి.పూరి ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, శ్రీధర్, పద్మజ, రవి, రాజ్యలక్ష్మి, యశోద, మీనా, స్నేహ, సరోజిని, పార్వతి, ప్రమీల, ప్రియదర్శిని, ఇంటరక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియా సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, యస్.పి.యల్ జి.హారిక, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు



కొత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : మండల పరిధి లోని మదనాపురంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి 17వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చక స్వాములు అభయాంజనే యుడికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో స్వామి వారిని అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ వేడుకను వీక్షించేందుకు గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్న సమయంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రి వేళ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తింది. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. స్వామి వారి 17వ వార్షికోత్సవం సందర్భంగా మదనాపురం గ్రామంలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.

## ఆర్టీసీ సిబ్బందికి ఘన సన్మానం



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: గత నెల 16వ తేదీన ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ, శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్టీసి డిపో పరీక్షలు జరిగిన ప్రతిరోజూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం నుండి 10వ తరగతి పరీక్షా కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండపల్లి వరకు మరల పరీక్ష ముగిసిన తర్వాత కొలిగాం ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులకు విడిచి పెట్టడంతో బస్ డ్రైవర్ జానకిరావుని, కండక్టర్ బమ్మిడి మురళీధర్‌ని మండపల్లి గ్రామ మాజీ మండల ప్రాదేశిక సభ్యులు పాతిర్ల చంద్రశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు వాసంతి, అమూల్య, రీనా, అమూల్య, లలితా, గణపతి, ఉమాశంకర్, శ్రీనివాస్, కొలిగాం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్, ఉపాధ్యాయులు రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, పాపారావురెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రారంభం నుండి పరీక్ష కేంద్రం కొరకు బస్ సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలు దగ్గరుండి చూసుకున్న మాజీ మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు పాతిర్ల చంద్రశేఖర్ రెడ్డిని కూడా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాసనసభ్యులు అశోక్‌బాబుని మండల తెలుగు దేశం అధ్యక్షులు లోపింటి పద్మనాభంని, ప్రకాశ్ మండల్‌ని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీకాకుళం వార్త

## స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



సీతంపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : సీతంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు దుప్పట్లను, దిండులను గురువారం ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ పంపిణీ చేశారు. ఏపీవో జి.చిన్నబాబు. డి.అన్నదొర, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ రవికుమార్‌కు ఘన సన్మానం



మెళియాపుట్టి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: కోసమాల గ్రామ సర్పంచ్ ఉర్లానా రవికుమార్ సర్పంచ్ పదవి కాలం నేటితో ముగిసినందున గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు రవికుమార్‌ను ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అంగడాల వేణు, ఉప సర్పంచ్ జొన్న మురళి, వార్డు సభ్యులు, సురేష్ కుమార్, జొన్న హేమంత్, సింహాచలం రామయ్య, తిరుపతిరావు, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షుడిగా శాంతిస్వరూప్ రెడ్డి



సంతబొమ్మాళి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నికయ్యారు. కోటబొమ్మాళి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సంతబొమ్మాళి మండల పార్టీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ యువనాయకుడు అయిన శాంతి స్వరూప్‌ను కమిటీ సభ్యులు పార్టీ అధ్యక్షులుగా పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు దుపాన రమణారెడ్డి ప్రకటించారు. అలాగే కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని నౌపడ గ్రామానికి చెందిన ఆయన మాజీ ఎంపీపీ స్వర్గీయ సుగ్గు భీమేశ్వరరెడ్డికి మనవడు. గత ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలో అరంగ్రేటం చేసిన స్వరూప్‌రెడ్డి అతి తక్కువ కాలంలో అటు పార్టీ క్యాడర్‌లోను ప్రజల్లోనూ ఆధరాభిమానం చూరగోన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు స్వరూప్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. తన పై ఎంతో నమ్మకం తో మండల పార్టీ కి అధ్యక్షులు గా నియామకానికి కృషి చేసిన మంత్రి కింజరాపు ఆచేన్నాయుడుకి స్వరూప్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. టీడీపీ నాయకులు కింజరాపు హరిప్రసాద్, ఎల్ఎల్ నాయుడు, కూచెట్టి కాంతారావు, బాడాన రమణమ్మ, ధర్మార్జునారెడ్డి, జీరు భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ భానోజీనాయుడుకి ఘన సన్మానం



రణస్థలం, ఏప్రిల్ 2 (ప్రభాతవార్త): సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో, రణస్థలం సచివాలయం।, ॥ సిబ్బంది ఆధ్వర్యంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు, వార్డు సభ్యులను గురువారం ఘనంగా సత్కరించారు. భానోజీ నాయుడు ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ, సిబ్బంది అందరినీ తన కుటుంబ సభ్యుల్లా భావించారని సచివాలయ సిబ్బంది ఈ సందర్భంగా పేర్కొన్నారు. పంచాయతీలో ఉత్తమ సేవలు అందించేలా నిరంతరం ఆయన ప్రోత్సహించేశారని గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ భానోజీ నాయుడు మాట్లాడుతూ తమకు దక్కిన ఈ గౌరవాన్ని, ఈ ఐదేళ్ల ఉత్తమ సేవలను రణస్థలం ప్రజలకే అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## రెడ్డిక మరువాడలో పారిశుధ్య పనులు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ పరిధిలోని రెడ్డిక మరువాడలో గ్రామ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు, సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు.అలాగే గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత పనులు నిర్వహించారు. కాలువల్లో బ్లీచింగ్ పొడి చల్లి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో ప్రవేశాలకు 10 వరకు గడువు



జలుమూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : జలుమూరు కేజీబీవీలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతులలో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతిలో మిగిలిన సీట్లు భర్తీ కోసం బాలికల నుండి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరణ ఏప్రిల్ 1తో ముగిసిందని, విద్యార్థులు, తల్లిదండ్రులు అభ్యర్థన మేరకు ఈ నెల 10వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేయుటకు పొడిగిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు తెలిపినటు ప్రిన్సిపాల్ ఏ.యశోద పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు దరఖాస్తు చేయని వాళ్ళు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు. ఏమైనా సమస్యలు, సందేహాలకు 7993328115,7075039990 నంబర్లుకు పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అమోఘం : ఎమ్మెల్సీ



వీరఘట్టం, ఏప్రిల్ 1, ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అమోఘమని వారి హయాంలో గ్రామాలు వికసించాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు ఎంపీపీ ధమలపాటి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన ఘనంగా ఆత్మీయ సత్కారాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచుల ఐదేళ్ల పదవీకాలంలో రెండేళ్ల పాటు కరోనా కష్టాలు అనుభవించారని, ఆ సమయంలో ప్రజలకు సర్పంచులు చేసిన సేవలు మరువరానివని ఆయన గుర్తు చేస్తూ, మిగిలిన మూడేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధికి తమవంతు ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేలా ఎనలేని కృషి చేశారని ఆయన కొనియాడారు. పదవి ఉన్నా , లేకపోయినా ప్రజాసేవకే అంకితం కావాలని, ప్రజలకు చేరువుగా ఉండి, వారి బాగోగులను చూడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు, ఎంపీడీవో బి.వెంకటరమణ, ఏవో వెంకటరావు, సీనియర్ అసిస్టెంట్ ఉదయాన శ్రీనివాసరావు, ఉప ఎంపీపీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంక్ ఏర్పాటు



సంతబొమ్మాళి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : మర్రిపాడు పంచాయతీ శెలగపేటలో వేసవి ప్రారంభంలోనే నీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్ ట్యాంక్ ద్వారా తాగునీటిని పంపిణీని గురువారం ప్రారంభించారు. వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా శెలగపేట గ్రామ వాసులకు మంచినీటి సౌకర్యం కల్పించమన్నారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ మర్రిపాడు గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంక్‌ను పూర్తిగా శిథిలావస్థకు చేరడం వలన ఇటీవల కాలంలో కూల్చివేయడం జరిగిందని, దాని స్థానంలో నూతన ట్యాంక్‌ను నిర్మించేంత వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంక్ ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామన్నారు.

3-4 pg 9.qxd:3-4 pg 9.qxd 1/1/02 6:05 AM Page 1



## మీరూ ఈ తప్పు చేయకండి !



పిల్లాడు ఒక్క ముద్ద అన్నం కూడా తినడం లేదు! జంక్‌ఫుడ్ తప్ప వేరే ఏం పెట్టినా వద్దంటున్నాడు? కూరగాయల్ని ఏరి పడేస్తున్నాడు! అమ్మల్ని పిల్లల ఆహారపు అలవాట్ల గురించి అడగలే కానీ...

ఇలా ఎన్ని ఫిర్యాదులు చెబుతారో. ఇది ఏ ఒక్క తల్లికో పరిమితమైన సమస్య కాదు. భారత్‌లో దాదాపు 81 శాతం మంది తల్లులకు ఉన్నదే అంటున్నారు నిపుణులు. మరి దీన్నుంచి ఎలా బయటపడాలి అంటే.. పిల్లల ఆహారపు అలవాట్లు ఒక్కరోజులో వచ్చినవి కాదు. వాళ్లకి సెమీ సాలిడ్స్ పెడుతు న్నప్పటి నుంచే అన్నీ ఒక్కొక్కటిగా అలవాటు అవుతూ వస్తాయి. ఈ దశ నుంచే వాళ్లకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని మిశ్రమ రూపంలో అలవాటు చేస్తే... ఏ చింతా ఉండదు. రెండేళ్లు వచ్చేసరికి మనం తినే ఆహారం వాళ్లకే అలవాట య్యేలా చూసు కోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయ లన్నీ ఒక్కొక్కటిగా కొద్ది పరిమాణంలో పెట్టాలి. అప్పుడే వాళ్లకి అన్ని రుచుల మీద ఆసక్తి కలుగుతుంది. ఇక జంక్ ఫుడ్ విషయానికొస్తే... బయట దొరికే ఆహార పదార్థాలన్నీ ఇప్పుడు ఇంట్లోనూ ఆరోగ్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. అలాంటి వాటిని ఎంపిక చేసుకుని పిల్లలకు అందిస్తే సరి. వీటన్నింటి వల్ల వంకలు పెట్టకుండా అన్నీ తింటారు. పాటిస్తారుగా మరి!

## అందానికి ఆముదం

అందాన్ని ద్విగుణీకృతం అందుబాటులో ఉంచే వివిధ రకాల సౌందర్యోత్పత్తులను ప్రయత్నించే అమ్మాయిలు. అయితే ఇంట్లో ఉంటే ఆముదం కూడా సౌందర్య సంరక్షణకు తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి, దాన్నెలా వాడాలో తెలుసుకుందాం..

**సహజ లిప్ బామ్ ...** ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు ఒక చుక్క ఆముదాన్ని పెదవులకు రాసుకుంటే కొద్ది రోజుల్లోనే అధరాలు అందంగా మారతాయట. ఇలా ఆముదం సహజసిద్ధమైన లిప్ బామ్ గా పనిచేస్తుందంట ఎన్నారు నిపుణులు.



**.గోళ్లు విరిగిపోకుండా..** కొంతమంది గోళ్ళు కాస్త పెరగగానే విరిగిపోతుం టాయి. ఈ సమస్య ఉన్న వారు రోజూ పడుకునే ముందు ఆముదంతో గోళ్లను పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఇలా కొద్ది రోజుల పాటు చేయడం వల్ల గోళ్లు దృఢంగా మారి విరిగిపోకుండా జాగ్రత్తపడచ్చు. అంతేకాదు.. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల గరుకుగా ఉన్న చర్మం కూడా మృదువుగా మారుతుందట.

**చర్మం తాజాగా!** రోజూ ఆముదం రాసుకోవడం వల్ల చర్మానికి తగినంత తేమ అందుతుంది. ఫలితంగా చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మం ముడతలు పడకుండా చేసే గుణాలూ ఆముదంలో బోలెడున్నాయి. అందుకే దీన్ని యాంటీ ఏజింగ్ చికిత్సల్లో కూడా ఉపయోగిస్తారంటున్నారు నిపుణులు.

**ఒత్తైన కనుబొమ్మలకు!** కొంతమంది అమ్మాయిలకు కనుబొమ్మలు, రెప్పలు చాలా పలుచగా ఉంటాయి. ఇలాంటివారు రోజూ రాత్రి పడుకునే ముందు ఆముదాన్ని రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే ఆముదం అందాన్ని ద్విగుణీకృతం చేసేదే అయినా.. పూర్తిగా వాడడం, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం తప్పనిసరి! అలాగే గర్భిణులు, పాలిచ్చే తల్లులు దీనికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు.

### చెలి చిట్కా

- గంధాన్ని అరగదీసి కళ్ళ మీద రాసుకుంటే కళ్ళఎరుపులు మంట తగ్గుతాయి
- .రోజ్‌వాటర్‌లో గంధం కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం మీద రాష్‌లో వుంటే పోతుంది.
- పాలతో గంధాన్ని అరడగదీసి ముఖనికి రాసుకుంటే ముఖం కాంతవంతంగా తయారవుతుంది.

## వైఫైతో పని చేస్తుంది

ఉదయాన్నే లేచి పిల్లలకు బాక్సులు కట్టి మనం ఆఫీసుకి పరుగులు పెడతాం. అలసి పోయి సాయంత్రం ఎప్పటికో ఇంటికి వస్తాం. ఈరోజుల్లో ప్రతి ఒక్కరి దినచర్య ఇదే మరి! ఆ సమయంలో ఇంటికి వెళ్లగానే వేడివేడిగా ఎవరైనా వండి పెడితే ఎంత బాగుంటుందో అనిపిస్తుంది. కదా! అలాంటివాళ్ల ఈ స్మార్ట్ ఎలక్ట్రిక్ కుక్కర్ కోసమే తీసుకొచ్చారు. దీన్ని ఫోన్‌తో ఆపరేట్ చేయొచ్చు. సాధారణ ఎలక్ట్రిక్ కుక్కర్లకు నేరుగా వైఫై కనెక్ట్ అయి ఉంటుంది. ఈరోజు ఆఫీసులో లేట్ అవుతుందన్నా... ట్రాఫిక్‌లో ఇరుక్కున్నా... మన ఫోన్ ద్వారా కమాండ్ ఇస్తే ఇంటికెళ్లేసరికి అన్నం వండేస్తుంది. అంతేకాదు. పూర్తవ్వగానే ఫోన్‌కి అలర్ట్ పంపిస్తుంది. దాంతో ఎక్కడున్నా కుక్కర్ని ఆఫ్ చేసేసుకోవచ్చు. కీప్ వార్మ్ ఆప్షన్ వల్ల అన్నాన్ని 12 గం. వరకు వేడిగానూ ఉంచుతుంది. అయితే దీనికి మనం చేయవలసినదల్లా బయటికెళ్లే ముందు బియ్యం, తగినన్ని నీళ్ల కుక్కర్లో పోసి ఉంచడమే.



## ఆయన సిలువ త్యాగం.. మనందరి రక్షణ కోసమే..



నేడు 'గుడ్‌ఫ్రైడే' పండుగ. ప్రపంచమంతా యేసుక్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ ఆయనను ఆరాధించేందుకు సిద్ధపడుతున్నారు. గుడ్‌ఫ్రైడే 'శుభశుక్రవారం' అంటే యేసుక్రీస్తు సిలువలో మరణించిన దినాన్ని గుడ్‌ఫ్రైడేగా పిలుస్తారు. యేసుక్రీస్తు సిలువలో ఏడుమాటల్ని పలికారు. ఈ మాటలు క్రైస్తవులకు ఎంతో ప్రాధాన్యమైనవి. అందుకే చర్చిల్లో ప్రభువు పలికిన 7మాటల్ని ధ్యానిస్తూ, ఆయనను ఆరాధిస్తారు. ఆ యేడు మాటలు ఏమిటో గమనిద్దాం..

మొదటిమాట క్షమాపణ: 'తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము' (లూకా 23:24). దేవాది దేవుడిని సిలువ వేయడం ఎంతో భయంకరమైనది. అది ఎంత ఘోరమైన నేరమో ప్రజలు గ్రహించేస్థితిలో లేరు. అందుకే ప్రభువు వారిని క్షమించమని తండ్రిని వేడుకున్నారు.

రెండవమాట రక్షణ/ఆశీర్వాదం: 'నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువు' (లూకా 23:43). యేసుక్రీస్తుతోపాటు కుడివైపు ఒకరిని, ఎడమవైపున ఒకరిని సిలువలో వ్రేలాడదీశారు. వీరిలో ఒక దొంగలో పశ్చాత్తాపం కలిగి, యేసుక్రీస్తును క్షమాపణలు వేడుకున్నాడు. వెంటనే యేసు నేడే నాతోకూడా పరదైసులో ఉంటావని చెప్పాడు. మనం కూడా ప్రభువును క్షమించమని వేడుకుంటే దొంగను క్షమించిన దేవుడు మనల్ని కూడా తక్షణమే క్షమిస్తాడు.

మూడవమాట సంబంధ/ప్రేమ. 'అమ్మా, ఇదిగో నీ కుమారుడు..ఇదిగో నీ తల్లి' (యోహాను 19:26-27). దేవాదిదేవుడైన యేసుక్రీస్తు తనకు మరణం సమీపిస్తున్న సమయంలో కూడా తల్లి బాధ్యతను విస్మరించలేదు. అప్పటికే ప్రభువుకు తమ్ముళ్ల, చెల్లెళ్ల ఉన్నారు. కానీ ఆయన వారిని నమ్మలేదు. తన ప్రియశిష్యుడైన యోహానుకు తల్లి బాధ్యతను అప్పగించాడు. నేడు అనేకులు తమ తల్లిదండ్రుల బాధ్యతను విస్మరిస్తున్నవారు ప్రభువును గొప్ప ఆదర్శంగా తీసుకోవాలి.

నాల్గవమాట వేదన/త్యాగం: 'ఏలీ,ఏలీ,లామా సబక్తానీ?' నా దేవా, నాదేవా, నన్నెందుకు చేయు విడిచితివి?' (మత్తయి 27:46, మార్కు 15:34). ప్రభువు మన దోషం, పాపం బట్టి పాపిగా మార్చబడ్డాడు. మననిమిత్తం తండ్రి అయిన దేవుడు కుమారుడైన యేసుక్రీస్తును సిలువలో వదిలివేశారు. ఆ వేదన భరించలేక ప్రభువు తండ్రితో అన్న మాటలు ఇవి.



ఐదవ శారీరక వేదన: 'నేను దప్పిగొనుచున్నాను' (యోహాను 19:28). యేసుప్రభువు జీవధాత. మన రక్షణ కోసం ఆయన రక్తాన్ని చిందించాడు. మనకు జీవాన్ని ఇచ్చేందుకు ఆయన దప్పిగొనాల్సి వచ్చింది. సిలువలో నిస్సహాయంగా దాహంతో అలమటించాడు ప్రభువు.

ఆరవ మాట విజయం: 'సమాప్తమైనది' (యోహాను 19:30). యేసుక్రీస్తు ఆరవమాటగా సమాప్తమైనది అన్నాడు. అంటే తాను ఈలోకానికి ఏ ఉద్దేశంతో వచ్చాడో, తండ్రి తనకు ఏపని అయితే అప్పగించాడో ఆ పనిని పరిపూర్ణంగా నెరవేర్చి, మరణిస్తున్న సమయంలో సమాప్తమైంది అన్నాడు.

ఏడవమాట సమర్పణ 'తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను' (లూకా 23:46) చిట్టచివరిగా తన ప్రాణాన్ని విడిచిపెడుతు న్నప్పుడు తండ్రితో 'తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను' అన్నాడు. ప్రభువు సిలువలో పలికిన ఈ మాటల అర్థాన్ని గ్రహించి, ఆయన ఇచ్చే రక్షణను పొందాలి. ఆయన త్యాగాన్ని గ్రహించి, ప్రభువును సొంతరక్షకుడిగా అంగీకరిస్తే అదే గుడ్‌ఫ్రైడేకు నిజమైన ఆనందాన్ని పొందగలం.

- పి.వాణిపుష్ప

## కడుపునొప్పి పై నిర్లక్ష్యం వద్దు !



సాధారణంగా మహిళల్లో నెలసరి సమయంలో పొత్తికడుపులో నొప్పి వస్తుంది. అయితే ఇలా పిరియడ్స్ సమయంలోనే కాకుండా.. అప్పుడప్పుడూ కూడా కడుపు నొప్పి రావడం గమనిస్తున్నాం. ఇది చిన్న సమస్యే కదా అని అశ్రద్ధ చేసే వారు లేకపోలేదు. కానీ ఈ నొప్పి వివిధ రకాల అనారోగ్య సూచనలు కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి నొప్పి వచ్చే ప్రదేశాన్ని బట్టి అది ఎలాంటి ఆరోగ్య సమస్యను సూచిస్తుందో తెలుసుకోవడం ముఖ్యమంటున్నారు.

**ఇన్ఫెక్షన్ కావచ్చు..** మూత్రనాళంలో మొదలై పొత్తికడుపు వరకు నొప్పి చేరుకొంటే మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లకు సూచనగా భావించాలని నిపుణులు భావిస్తున్నారు. కడుపు నొప్పితో పాటు యూరిన్కి వెళ్లేటప్పుడు మంట, నొప్పి కూడా యూరిన్ ఇన్ఫెక్షన్ లక్షణాలే అంటున్నారు. కొంతమందిలో మూత్రంతో పాటు రక్తం కూడా పడుతుంటుంది. దీన్ని నిరక్ష్యం చేస్తే.. ఇన్ఫెక్షన్ ప్రభావం కిడ్నీల వరకు వ్యాపిస్తుంది. అప్పుడప్పుడూ మూత్ర వ్యవస్థలో కణితులు ఏర్పడటం వల్ల కూడా ఇలా నొప్పి వచ్చే అవకాశం ఉంటుందట.

**పొత్తికడుపు మధ్యభాగంలో..** కొంతమంది మహిళలకు పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటుంది. అంటే. గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్, అండాశయాల్లో.. ఏదో ఒక దానిలో నొప్పి వస్తున్నట్లు భావించాలి. ఇది ఎండోమెట్రియోసిస్, ఫైబ్రాయిడ్స్, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ డిసీజ్, అండాశయాల్లో సిస్టులు.. వంటి సమస్యలకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటే మాత్రం వైద్యులను సంప్రదించి అసలు సమస్యేంటో నిర్ధారించారు.

**బొడ్డు దగ్గర మొదలైతే..** కొన్ని సందర్భాల్లో కడుపు నొప్పి బొడ్డు దగ్గర మొదలై ఛాతీ వరకు పాకుతుంది. దానితో పాటు కడుపులో మంటగానూ అనిపిస్తే అది పెప్టిక్ ఆల్సర్కి సూచనగా భావించవచ్చంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ఇది రాత్రివేళల్లో ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

## మొఘలాయ్ పరోటా



కావాలసినవి.. గోధుమ పిండి, మైదా పిండి : ఒక కప్పు చొప్పున, క్యాబేజీ, క్యాప్సికం, బీన్స్, క్యారెట్ తురుము: పావు కప్పు చొప్పున, తురిమిన చీజ్: రెండు టేబుల్ స్పూన్లు, కారం: ఒక టీస్పూన్, ధనియాల పొడి: ఒక టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, వేయించిన జీలకర్ర పొడి: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, వెన్న: ఒక టేబుల్ స్పూన్, నూనె: రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ఒక గిన్నెలో గోధుమ పిండి, మైదా పిండి, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి బాగా కలపాలి. తగినన్ని నీళ్లుపోసి ముద్దగా చేసి అరగంటపాటు పక్కనపెట్టాలి. పాన్‌లో వెన్న వేడయ్యాక క్యాబేజీ, క్యారెట్, బీన్స్, క్యాప్సికం తురుము, కారం, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, పసుపు, ఉప్పు వేసి కలుపుతూ పది నిమిషాలపాటు సన్నని మంటపై వేయించాలి. చివరగా చీజ్ తురుము జోడించి బాగా కలిపి దింపేయాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని మందపాటి చపాతీలా ఒత్తుకుని.. మధ్యలో క్యాబేజీ మిశ్రమం పెట్టి అంచులు ముడిచి మళ్లీ పరోటాల్లా ఒత్తుకోవాలి. పెనం మీద రెండు వైపులా నూనె లేదా వెన్నతో కాల్చుకుంటే వేడివేడి మొఘలాయ్ పరోటాలు సిద్ధం

# తెర

## 'గాయపడ్డ సింహాం' 'బ్రైడ్ సాంగ్' రిలీజ్



డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్, విభిన్నమైన ప్రమోషనల్ సాంగ్ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచాయి. ఈ రోజు సెకండ్ సింగిల్ 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ఈ లేటెస్ట్ సింగిల్‌ను ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ను ఫ్రెష్‌గా, ఫన్‌తో నింపేలా రూపొందించారు. పెళ్లి ముందు ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న వధువు భావాలను అందంగా ప్రజెంట్ చేస్తోంది. సాధారణంగా కనిపించే సింపుల్ ప్రెజెంటేషన్‌కు భిన్నంగా, ఈ పాటలో వధువును బోల్డ్‌గా, స్టైలిష్‌గా, ఫుల్ ఆఫ్ లైఫ్‌గా చూపించారు. సంగీత దర్శకుడు స్వీకర్ ట్రెండీ బీట్స్‌తో పాటు ఫెస్టివ్ ఫ్లేవర్‌ను అద్భుతంగా మేళవించారు. ఆయన పాడిన ఇంగ్లీష్ పార్ట్స్, శ్రీమణి రాసిన ఎనర్జిటిక్ తెలుగు లైన్స్ కలిసి ఈ పాటకు కూల్, కాంటెంపరరీ టచ్‌ను ఇచ్చాయి. ఈ లిరిక్స్‌లో నేటి వెడ్డింగ్ హంగామా, సెల్ఫీలు, రీల్స్, గ్లామ్ టచెస్, వైరల్ అవ్వాలనే ఎగ్జైట్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తాయి.ఫారియా తన ఎనర్జిటిక్ మూవ్స్, ఎక్స్‌ప్రెసివ్ పెర్ఫార్మెన్స్‌తో స్క్రీన్‌పై మెరిసింది. బ్రైడల్ జాయ్‌ను ఎంతో సహజంగా క్యారీ చేస్తుంది.

## పెద్ది పహిల్వాన్ అవతార్‌లో పోస్టర్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా ఖిపెద్దిఖి హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. మొదటి రెండు పాటలకు, ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్‌లకు వచ్చిన అద్భుతమైన స్పందనతో దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తోంది. ముఖ్యంగా, రామ్ చరణ్ పుట్టినరోజు ప్రత్యేక గ్లింప్స్ స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఒక శక్తివంతమైన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్, ఆధ్యాత్మి కత తో కూడిన అవతార్‌లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్‌లో చరణ్ ఒక పల్లెటూరి అఖాడా మధ్యలో నిలబడి వుండగా, ఆయన ప్రెజెన్స్ ఒక్కసారిగా అందరినీ కట్టిపడేసింది. పహెల్వాన్‌లా తీర్చిది ద్దుకున్న శరీరం, రగ్గడ్ గడ్డం, వెనక్కి కట్టిన జుట్టు, అన్నీ కలిసి గ్రామీణ అసలైన వాతావరణాన్ని బలంగా ప్రజెంట్ చేస్తున్నాయి. భూమిలో లోతుగా నాటుకుపోయిన భారీ చెక్క గదను పట్టుకుని ఉన్న చరణ్, హనుమ ను గుర్తు చేసేలా అద్భుతంగా కనిపించారు. అతని చుట్టూ ఎగిసిపడుతున్న ధూళి ఆ క్షణంలోని ఇంటన్సిటీని మరింత పెంచుతోంది. బ్యాక్‌గ్రౌండ్‌లో కుస్తీ సాధన చేస్తున్న రెజ్లర్లు పోస్టర్‌కు మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ ఇతర ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది.

## తెలుగులో తొలి ఏఐ సినిమా అంబ' S రివెంజ్



హనుమాన్ విజయోత్సవం సందర్భంగా టైటిల్ పోస్టర్ విడుదల ఆధునిక సాంకేతికతతో పౌరాణిక చిత్రం చలనచిత్ర పరిశ్రమలో చరిత్ర సృష్టిస్తూ, సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ పూర్తి స్థాయి కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా "అంబ'S రివెంజ్" ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మాతగా, రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ పౌరాణిక చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. శ్రీ లలితకళా చిత్రాలు, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది.ఈ సందర్భంగా నిర్మాత శ్రీకాంత్‌రెడ్డి కుందూరు, క్రియేటివ్ డైరెక్టర్ జయవర్ధన్ మాడి మాట్లాడుతూ.. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టాము. "అంబ'S రివెంజ్" ప్రాజెక్టు కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను వినియోగిస్తూ విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరిస్తున్నాం. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబం ధించిన టైటిల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నాం. ఈ ప్రాజెక్టుకు సంబందించి పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తార" అని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో ఏఐ ఆధారిత కథాచిత్రాల దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. పౌరాణిక కథను ఆధునిక సాంకేతికతతో మిళితం చేస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రం తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## 'పల్లిచట్టంబి' ఫ్యామిలీ కలిసి చూసే మూవీ



'పల్లిచట్టంబి' ఫ్యామిలీ అంతా కలిసి చూసే ఒక బ్యూటిఫుల్ ఎమోషనల్ మూవీ హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్‌మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లిచట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. "పల్లి చట్టంబి" సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. హీరో టొవినో థామస్ మాట్లాడుతూ దర్శకుడు డిజో నాకు చాలాకాలంగా తెలుసు. మేమిద్దరం ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటూ ఉండేవాళ్లం. కొన్ని మూవీస్ కు డిస్కషన్స్ చేసుకున్నాం. అయితే అప్పటికి నాకు ఉన్న సినిమాల కారణంగా వెంటనే ఆయనతో సినిమా చేయలేకపోయాను. డిజో, నేను కలుస్తూనే ఉండేవాళ్లం. ఈ కథ ప్రకారం హీరో బలంగా కనిపించాలి. విలన్స్ ను విసిరిపారేసేలా ఉండాలి. అందుకే వెయిట్ పెరిగాను. అప్పటిదాకా డైటింగ్ చేసే నేను ఈ చిత్రం కోసం డైటింగ్ పక్కనపెట్టాను. హెయిర్ స్టైల్, మీస కట్టుతో ఒక మంచి లుక్‌లోకి మారాను. డిజోతో వర్క్ చేయడంలో ఎలాంటి ప్రెజర్ ఉండదు. సెట్ లో కూల్ గా వర్క్ చేసు కుంటూ వెళ్తాడు. ఆయనకు కోపం వస్తుందా అనేది కూడా తెలియదు.

## 'వంద దేవుళ్లు' మెలోడీ 'ఇది కలనో' విడుదల



'బిచ్చగాడు' లాంటి బ్లాక్ బస్టర్ తరువాత మళ్లీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో 'వంద దేవుళ్లు' అనే సినిమా రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. విజయ్ ఆంటోనీ, స్వాసిక మాసీ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ మూవీ నుంచి 'ఇది కలనో' అంటూ సాగే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటలో విజయ్ ఆంటోని, స్వాసిక కనిపిస్తున్న తీరు, వారి ప్రేమను వ్యక్త పరుస్తున్న విధానం ఎంతో చక్కగా ఉంది. ఇక ఈ పాటకు భాగ్య శ్రీ అందించిన సాహిత్యం, శిభి శ్రీనివాసన్, శిరీష భాగవతుల గాత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. బాలాజీ శ్రీరామ్ అందించిన బాణీ శ్రోతల్ని ఇట్టే కట్టి పడేసేలా ఉంది.ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు.

## 'యుఫోరియా' స్ట్రీమ్ కావడం గర్వంగా ఉంది

- గుణ శేఖర్



సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రలలో నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణయుక్త గుణ నిర్మాతలుగా తెరకెక్కించిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఏప్రిల్ 2 నుంచి ఈటీవి విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీస్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ప్రీస్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ లో డైరెక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా కెరీర్ రామోజీరావుగారి ఉషా కిరణ్ మూవీస్ సంస్థ లోనే ప్రారంభమైంది. నేను బాగా పని చేస్తున్నా నని ఆయన నన్ను ప్రోత్సహించారు. నిజానికి ఓటీటీ వాళ్లు కంటెంట్‌ను బోల్డ్‌గా చెప్పడానికి ప్రోత్సహిస్తారు. కానీ అలాంటి సంస్థలే ఈ కథ షాకింగ్‌గా ఉందని వెనకడుగు వేశాయి. నితిన్ గారు చెప్పినట్టు, "బోల్డ్" అంటే విజువల్‌గా కాదు, కంటెంట్ రూపంలో చెప్పేది. ఈటీవీ కథల ద్వారా సమాజానికి అద్దం పట్టే సినిమాలను తీయడంలో ముందుంది. "చిత్రం", "మయూరి", "మౌన పోరాటం' లాంటి ఎన్నో అద్భుత కథలను చెప్పారు. సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చూపించారు. అదే నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే 'యుఫోరియా' తీశాను. కంటెంట్ ఈజ్ కింగ్" అని ప్రేక్షకులు అంటున్నారు. అలాంటి కంటెంట్‌తో సినిమా తీసినప్పుడు ప్రేక్షకులు కూడా థియేటర్‌కి వచ్చి చూడాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకు అద్భుతమైన రివ్యూలు వచ్చాయి. కానీ చాలా మంది ఈ సినిమా ఓటీటీలో ఎప్పుడు వస్తుందో అడిగారు. ఇది థియేటర్ కోసం తీసిన సినిమా. ప్రేక్షకులు థియేటర్‌లో చూడాల్సిన సినిమా.

## ఉపాధి సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగముగా ఉపాధి హామీ పథకం సిబ్బంది వేతనదారులకు పని దినాలు కల్పించేందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సి ఉందని పార్వతి పురం మన్యం జిల్లా డుమా ప్రాజెక్టు డైరెక్టర్ కె రామచంద్రరావు దిశ నిర్దేశం చేశారు. బుధవారం నుంచి కొత్త సంవత్సరం ప్రారంభం కావడంతో మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులను ప్రజాప్రతినిధులు అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రావుపల్లి గ్రామ పంచాయతీలో మంచినీటి కోనేరు అభివృద్ధి పనులను రావుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహే శ్వరరావు (మహేష్)తో కలిసి జిల్లా డుమా ప్రాజెక్టు డైరెక్టర్ కె రామచంద్ర రావు గురువారం పండగ వాతావరణంలో ప్రారంభించారు. అనంతరం డుమా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా క్షేత్ర సహాయకులు తగు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. అదే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా సాంకేతిక సహాయకులు ముందస్తు కొలతలు ఇచ్చి వేతనదారులతో పనులు చేయించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో వేతనదారులు వడ దెబ్బకు గురికాకుండా ఉండేలా ఉపాధి హామీ పథకం సిబ్బంది అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో నీడ నిమి త్తం టెంట్ లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యము కల్పిం చాల్సి ఉందని సూచించారు. కార్యక్రమంలో డుమా ఏపీడి టి త్రివిక్రమరావు, తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి మత్తులో బొడ్డవర ప్రాంతం

**- బానిసలుగా మారుతున్న యువత... ఆందోళనలో కుటుంబసభ్యులు**

శృంగవరపుకోట, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : బొడ్డవర ప్రాంతం గంజాయి మత్తులో తేలియాడుతుంది. అల్లూరి సీతారామ రాజు(ఏజెన్సీ) జిల్లాకు బొడ్డవర ప్రాంతం ముఖ ద్వారంగా ఉంది. ఇక ఏజెన్సీ అరుకు ప్రాంతం నుంచి బొడ్డవర ప్రాంతం మీదుగా గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే విషయం అందరికీ తెలిసిందే. అయితే గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు బొడ్డవరలో పోలీసు చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. దీంతో చాలా వరకు గంజాయి అక్రమ రవాణాను నిరోధించారు. మరి ఏవిధంగా రహస్య దారులలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందో గానీ బొడ్డవర ప్రాంతంలో గంజాయి అక్రమ నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఇంతకీ గంజాయి నిల్వలు ఎక్కడ ఉన్నాయి ఎవరు దగ్గర ఉన్నాయనే విషయం తేలాల్సి ఉంది. ముఖ్యంగా బొడ్డవర ప్రాంతంలో ఉన్న పలువురు యువత గంజాయికు బానిసలుగా మారుతునట్లు తెలుస్తుంది. బొడ్డవర, అమ్మపాలెం అలాగే బొడ్డవర ప్రాంత పరిధిలో ఉన్న పలు గ్రామాల నుంచి పలువురు యువత అమ్మపాలెం గ్రామ సమీపంలో ఉన్న చెరువులు వద్ద అలాగే మామిడి, జీడీ తోటల్లో విచ్చలవిడిగా గంజాయి కాయించి సేవిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా గంజాయి మత్తులో యువత బొడ్డవర నుంచి అమ్మపాలెం మీదుగా లక్ష్మీపురం వెళుతున్న పలువురుపై దాడి చేసి నగదు సెల్ ఫోన్లు లాక్కుని పరారవుతున్నట్లు బాధితులు నుంచి వినికిడి. ప్రస్తుతం యువత గంజాయి మత్తుకు బానిసలవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా గంజాయి అక్రమ రవాణాపై గట్టి నిఘా తగిన చర్యలు చేపట్టకపోతే యువత గంజాయి మత్తుకు మరింత బానిసలై పెను ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు.

## తడి, పొడి చెత్త వాహనాల పంపిణీలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర



బలిజిపేట, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం పార్వతీపురం నియోజకవర్గ శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో పొడి చెత్త వాహన కంపెనీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన చేతుల మీదుగా 24 పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ట్రై సైకిల్, చెత్త బట్టలను అందజేశారు. ఎంపీడీవో కృష్ణవేణి, ఈవోపీఆర్డి పుష్పారావ్, తాసిల్దార్ బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు పెంకి వేణు నాయుడు అరకు పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షులు పోరాడ రవికుమార్ రాష్ట్ర కొప్పల వెలమ చైర్మన్ పెద్ద అంకులం కాలువ చైర్మన్ క్లస్టర్ ఇంచార్జిలు తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల వారీగా పనిచేస్తున్న సెక్రటరీ వీఆర్వో హౌసింగ్ ఎలక్ట్రికల్ మొదలగు అధికార సిబ్బందితో మాటామంతి నిర్వహించారు. అనంతరం అమరావతి ఆంధ్రుల రాజధాని శాశ్వత రాజధానిగా ప్రకటించిన ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తూ బాణా సంచులు కేకులు ఆనందోత్సవాలతో బోనాలు విజయ్ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది తెలుగు జాతి కీర్తించిన అమరావతిగా రాజ్యసభ ఆమోద మాత్రం తెలియడంతో ప్రజలలో ఆనందం వెల్లువెత్తుంది. కార్యక్రమంలో బోనాలు విజయ్ చంద్ర కేకులు కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ అమరావతికి రాజధాని తేదానికి కష్టపడిన ప్రతి ఒక్కరు కూడా ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## విలేజ్ రెవెన్యూ క్లినిక్‌లతో రైతులకు ఎంతో మేలు : తహసీల్దార్

సాలూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : రూరల్ ప్రాంత ప్రజలు రెవెన్యూ క్లినిక్ లకు వచ్చి తమ రెవెన్యూ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించుకోవచ్చని ఎమ్మార్వో ఎం.సురేష్ స్పష్టం చేశారు. గురువారం కుర్మరాజు పేట సచివాలయంలో ఎమ్మార్వో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటుచేసి అర్జీదారుల సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతు రెవెన్యూ క్లినిక్‌ల వలన భూ సమస్యలు ఇంకా సర్వే అలాగే పట్టాదారు పాస్ పుస్తకాల వంటి సమస్యలకు తక్షణమే పరిష్కారం దొరుకుతుందని క్లారిటీ ఇచ్చారు. మారుమూల గ్రామాలలో ఉన్న ప్రజలు తమ రెవిన్యూ సమ స్యలకు వ్యయప్రయాసలు లేకుండా ఈ రెవెన్యూ క్లినిక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అలాగే సచివాలయ స్థాయిలోనే పనులు అవుతాయని స్పష్టంచేశారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మన రాజధాని అమరావతి : ఎమ్మెల్యే



పార్వతీపురం, ఏప్రిల్ 2, ప్రభాత వార్త: రాష్ట్ర రాజధానిగా అమరావతి పేరు చెప్పేందుకు గర్వంగా ఉందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఒక ఉపాధి కల్పనగా, కల్పతరువుగా, ఆర్థిక శక్తిగా, ఒక స్వాంతం వ్యాలీసిటీగా అమరావతి నిలుస్తుందని అన్నారు. దాదాపుగా అన్ని పార్టీలు అమరావతి రాజధానికి పార్లమెంటులో తమ సంపూర్ణ మద్దతు తెలపడం ఆంధ్రుల విజయంగా ఎమ్మెల్యే అన్నారు. ఈరోజు నుంచి మూడు ముక్కల ఆట లేదు, రాజధాని విషయంలో అంటూ ప్రజలను తికమక పెట్టి, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే పరిస్థితి ఉండదని అన్నారు. పార్లమెంటులో అమరావతి రాజధానిగా ఆమోదం పొందడాన్ని జీర్ణించుకోలేని జగన్మోహన్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి మూవీగాన్ అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆ పరిస్థితి చూస్తే మతిభ్రమించి మాట్లాడుతున్నారా, అజ్ఞానంతో మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికే ప్రజలు ఛీ కొట్టారు అయినా కూడా బుద్ధి తెచ్చుకోకుండ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రతి అంశానికి రాజ్యాంగం ఉంటుంది. రాజ్యాంగబద్ధంగా కొన్ని అమలు చేసినప్పుడు దాన్ని ఎవరు టచ్ చేయలేరన్న విషయాన్ని మర్చిపోయి నోటికొచ్చినట్లు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటు సభ్యులు సమక్షంలో అమరావతికి చట్టబద్దత కల్పిస్తే నేను మళ్లీ వస్తే అసెంబ్లీలో పెట్టి తీసేస్తానంటూ జగన్మోహన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. వైకాపా పాలనలో రాజధాని అంటూ లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చదువుకునేవారిమని ఇకనుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ప్రతి ఒక్కరు గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఉందని అన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో అనేక అభివృద్ధి అంశాలు చూస్తామని విశాఖను ఆర్థిక రాజధానిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తయారు చేస్తున్నారని ఆయన విజనరీ అందరికీ అర్థమయ్యిందని భవిష్యత్తులో దాని ఫలాలు ప్రజలు పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బోను చంటి, కొప్పల వెలమ డైరెక్టర్ గొట్టపు వెంకట్ నాయుడు, మజ్జి వెంకటేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలి : జేసీ



పార్వతీపురం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అనవసరమైన జాప్యానికి తావివ్వరాదని జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇండెక్స్ రిజిస్టర్లు మరియు పెండింగ్‌లో ఉన్న దస్తావేజులను ఆయన పరిశీలించారు. తనిఖీలో సబ్ రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రామ్ మల్లిక్ నాయుడుకి ఘన సత్కారం



గరివిడి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: గరివిడి మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడుని గరివిడి ఎంపీపీ మీసాల విజయ లక్ష్మి దుస్సాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యాలయంకి రామ్‌మల్లిక్ నాయుడుని సాదరంగా స్వాగతించారు. మాజీ ఏ ఎం సి చైర్మన్ మీసాల విశ్వేశ్వర రావుతో పాటు టిడిపి, వైకాపా నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఒకరికి రెండురోజులు జైలు.. మరొకరి 10 వేలు ఫైన్

సాలూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఈ మధ్యన మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు రహదారి భద్రత దృష్ట్యా మత్తుదిగిపోయే గట్టి యాక్షన్ తీసుకుంటున్నారు. అందులో భాగంగా టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరు వ్యక్తులలో ఒకరికి రెండు రోజులు జైలుశిక్ష మరొకరికి 10 వేలు ఫైన్ జుడిషియల్ మెజిస్ట్రేట్ విధించారని టౌన్ సీఐ అప్పల నాయుడు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే యాక్సిడెంట్స్ జరగడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రజా సంతృప్తి స్థాయి పెంచాలి



చీపురుపల్లి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని చీపురుపల్లి డిడిఓ కే హేమ్సుందర్ అన్నారు. గురువారం నాడు చీపురుపల్లి మండలంలోని రామలింగాపురం గ్రామంలో ప్రజల నుండి పి జే ఆర్ సి ద్వారా ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చినప్పుడు, వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తిస్తూ వారు పెట్టుకున్న దరఖాస్తు ఎంతవరకు వచ్చింది, ఎంతవరకు సమస్య పరిష్కారం అయ్యింది,.సమస్య పరిష్కారం కాకపోతే కారణాలు ఏమిటి అని ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి డిపార్ట్మెంట్‌లు వారిగా, రెవెన్యూ పంచాయతీరాజ్, పోలీస్, రిజిస్ట్రేషన్ శాఖ, తదితర శాఖలకు వస్తున్న పిర్యాదులను పరిష్కరించి, ప్రజలలో సంతృప్తి స్థాయిలను పెంచాలని ఈ సందర్భంగా కోరారు. ప్రధానంగా ప్రజల గ్రీవెన్స్ నుండి వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం, ప్రజల ఫిర్యాదు పైన పరిష్కారం కాని సమస్యలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం రామలింగాపురం సచివాలయంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పి జి ఆర్ ఎస్ రిజిస్టర్ లు మెయింటైన్ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్ర సమాజానికి ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలి



గరివిడి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: పరిశుభ్ర సమాజానికి ప్రతీఒక్కరూ చెత్త నిర్మూలనలో బాగస్వామ్యులవ్వాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. చెత్త తొలగింపులో ప్రతీ సామాజికుడు చిత్త శుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు. పొడి చెత్త సేకరణకు గాను నూతనంగా మంజూరు అయిన స్వచ్ఛ రథాన్ని, చెత్త సేకరించే వాహనాలను ఎంపీపీ మీసాల విజయ లక్ష్మితో కలసి ఆయన గురువారం లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ రథంని ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వచ్ఛ రథం మీ మీ ప్రాంతాలకు వచ్చే సమయంలో పొడి చెత్త కిలోలు లెక్కన తూకం వేసి అందిస్తే దానికి తగినంత పైకం,లేదా సబ్బులు ఇతర సామగ్రి అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయ లక్ష్మి, మాజీ ఎంపిపి పైల బలరాం, మాజీ వైస్ ఎంపిపి బలగం వెంకట రావు,మండల టిడిపి అధ్యక్షుడు సారేపాక సురేష్,మాజీ ఏ ఎం సి చైర్మన్ మీసాల విశ్వేశ్వర రావు, వైకాపా, టీడీపీ నాయకులు బూడి శ్రీరాములు నాయుడు, గుడివాడ తమ్మినాయుడు, బోర రమణ మూర్తి,పాకలపాటి వర్మ రాజు, మహంతి రమణ మూర్తి, గొట్టిముక్కల సత్తిరాజు, దొర ,ఎంపిడిఓ ఎంవిబి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఈఓ ఆర్ డి ఎల్.పుష్పాంజలి, కొండ పాలెం కార్య నిర్వహణ అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు స్వచ్ఛ రథం , ప్రత్యేక అధికారులు పాలన తదితర అంశాలపై ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం, కిమిడి రామ్ మల్లిక్ నాయుడుతో ప్రత్యేక సమావేశమై చర్చించారు.

## పీఎఫ్ నగదుకు ఎదురుచూపు



రామభద్రపురం ఏప్రిల్ 2 ప్రభాత వార్త : పి ఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్ నగదు కొరకు 8 నెలల నుండి ఎదురుచూస్తున్నామని ...వాటిని జమచేయరూ అంటూ ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు జెసి రాజు ఆందోళనను వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాం గణంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావలసిన డిఏ బకాయిలు, పి అర్ సి బకాయిలు చెల్లింపు ఊసే లేదు, పిఆర్సీ కమిషన్, ఐ ఆర్ ప్రకటన లేదు... కనీసం అత్యవసర పరిస్థితుల్లోవివాహం, విద్య, వైద్య ఖర్చులకు ఉపయోగపడు తుందని నెల నెలా దాచుకున్న పిఎఫ్‌ను కూడా దరఖాస్తు చేసి 8 నెలలు అవుతున్నా చెల్లించకపోవటం దారుణ మన్నారు ఉద్యోగ విరమణ చెందిన ఉపాధ్యాయులకు పిఎఫ్ నగదును ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఎపిజిఎల్ఐ చెల్లింపులు కూడా ప్రభుత్వం చెల్లించలేదన్నారు. భవిష్యనిధులు కింద దాచుకున్న డబ్బులు రాక పోవటం,రుణాలు ఇవ్వకపోవడం ఉద్యోగ ,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సందర్భంలోనైనా ప్రభుత్వం పీఎఫ్ ,ఎపిజిఎల్ఐ నగదును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వీరితో పాటు అప్పల స్వామి, నాయుడు లు ఉన్నారు.

## పక్కిలో సామూహిక ఉపశమనం

బొబ్బిలి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: మండలంలో పక్కి గ్రామం సామూహిక ఉపనయన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ శ్రీ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులతో కొంతమంది యువకులకు సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించారు. 8 సంవత్సరాల నిండిన ప్రతి పిల్లవానికి ఉపనయన కార్యక్రమం నిర్వహించబడుతుందని ఇదంతా ఉచితంగా చేయబడుతుందని అన్నారు కార్యక్రమం బ్రహ్మశ్రీ లకోజి ఓంకారాచారి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఉపనయనం నిర్వహించబడిందని ఈ కార్యక్రమానికి భక్తులు విశేషంగా విచ్చేసి ఉపనయనం పొందిన యువకులకు దీవించి వారు కూడా వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శుభాశీస్సులు పొందారు ఈ కార్యక్రమంలో పక్కి గ్రామ వీరబ్రహ్మేంద్ర భక్తులు విశేషంగా విచ్చేయడం విశేషం ఆలయ పూజారి మురుమళ్ళ లక్ష్మణరావు ఆచారి పాల్గొన్నారు.

## అక్విడెక్టు నిర్మించి... ఎల్సీసీకి నీరదించాలి



మక్కువ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: వెంగల రాయ సాగర్ ప్రాజెక్టు సంబర వద్ద ఎడమ బ్రాంచ్ కాలువ పై గోముఖి ఆక్విడెక్ట్ ను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు మాట్లాడుతూ సంబర వద్ద గోముఖి నది పై ఆక్విడెక్ట్ కూలిపోయి 25 సంవత్సరాలు దాటిందని ఇంత వరకు ఆక్విడెక్ట్ పూర్తి చేయక పోవడం ఘోరమని ఈ ఆక్విడెక్ట్ పూర్తి కాక పోవడం తో సంబర, తోట వలస, కవిరిపల్లి, బట్టి వలస, ఎస్ పెద్దవలస, పెదఘూసిల, కాకుల వాని వలస, మార్కొండ పుట్టి, మర్రి వలస, కే పెద్ద వలస, నగళ్ళు గ్రామాలకు 4 వేల ఎకరాల భూమికి నీరు అందక రైతులు, గిరిజనులు పంట లేక, ఆదాయం రాక అనేక ఇబ్బందులు కు గురవుతున్నారని వెంటనే ఆక్విడెక్ట్ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్ ఎం సి, ఆర్ బి సి కాలువలు పరిధిలో చివరి ఆయకట్టు భూములు మరో 6 వేల ఎకరాల చివరి భూములు కు సాగునీరు అందడం లేదని అన్నారు, జైకా నిధులు 60 కోట్ల రూపాయలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వెంటనే జైకా నిధులు ఖర్చు చేసి వెంగల రాయ సాగర్ చివరి భూములు అన్నిటికీ నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘము జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సి ఐ టి యు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు పాల్గొన్నారు.

## త్వరలో టీడీపీ వ్యతిరేక శక్తులను బహిష్కరించే అవకాశం ?

శృంగవరపుకోట,ఏప్రిల్2, ప్రభాతవార్త.. ఎస్.కోట నియోజకవర్గంలో త్వరలో కొందరు టీడీపీ పార్టీ వ్యతిరేక శక్తులను పార్టీ నుంచి బహిష్కరించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.టీడీపీ పార్టీలో ఉండి కొందరు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా పబ్లిక్ లో విమర్శలు చేస్తున్నట్లు ఈవిషయాన్ని పార్టీ అదిష్టానం దృష్టికి పలువురు నేతలు తీసుకెల్లినట్లు తెలుస్తుంది.దీనిపై అదిష్టానం సీరియస్ గా ఉందని సమాచారం.ఇలాంటి వారు పార్టీలో ఉంటే పార్టీకి చెడ్డ పేరు వస్తుందని అదిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తుంది.అందువలన త్వరలో పార్టీ వ్యతిరేక శక్తులను బహిష్కరించే అవకాశం ఉందని సమాచారం.మరి పార్టీ వ్యతిరేక శక్తులు ఎవరో వేచి చూడాల్సిందే.

## మండల పరిషత్ డిప్యూటీ సీఎం బాధ్యతలు



దత్తిరాజేరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త మండల పరిషత్ డిప్యూటీ అభివృద్ధి అధికారిగా ఎస్ తాత గురువారం బాధ్యతలు స్వీకరించారు ఎంపీడీవో కిషోర్ కుమార్ సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు ఆయనకు మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు గతంలో ఆయన చీపురుపల్లి సబ్ డివిజన్ ఆఫీసులో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహించి పదోన్నతి పొంది దత్తిరాజేరు మండలానికి ఈవోపీఆర్డి అధికారిగా బాధ్యతలు చేపట్టారు ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్డి అధికారిమనోరమ శ్రీకాకుళం డుమా ఆఫీసుకు బదిలీ అయ్యారు ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి పరిచేందుకు నా వంతు కృషి చేస్తానని కార్యదర్శులు మరియు సచివాల సిబ్బంది ద్వారా పంచాయతీలు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు ప్రజా ప్రతినిధుల సహకరించాలన్నారు

## ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



కురుపాం,ఏప్రిల్2ప్రభాతవార్త. మండలంలో గురువారం వరకు జరిగిన 10వ తరగతి పబ్లిక్ చివరి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారి ఎన్. సత్యనారాయణ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలను నిర్వహించినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా మొత్తం 681 మంది విద్యార్థులకు గాను 679 మంది హాజరయ్యారని వెల్లడించారు. ధర్మలక్ష్మిపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 311 మందికి 310 మంది, కురుపాం ఆదర్శ పాఠశాలలో 210 మందికి 209 మంది, కురుపాం జిల్లా పరిషత్ పాఠశాలలో 157 మందికి 157 మంది హాజరైనట్లు వివరించారు. పరీక్షలు సజావుగా పూర్తవడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25
వార్త

## ప్రజాసేవ చేయడం పూర్వ జన్మ సుకృతం : సువ్వాడ



నెల్లిమర్ల, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : ప్రజా సేవ చేసేందుకు అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని టిడిపి సీనియర్ నాయకుడు, ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. మండలంలోని మధుపాడ గ్రామ సర్పంచ్ నల్లం అప్పారావుతో పాటు, పంచాయతీ వార్డు సభ్యులను వారి పదవీకాలం ముగుస్తున్న దృష్ట్యా గురువారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి శేఖర్, టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. అలాగే గ్రామ సచివాలయ ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భం గా మండల తెలుగు యువత అధ్యక్షుడు నల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవిశేఖర్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలం సర్పంచ్ హోదాలో నల్లం అప్పారావు సుపరిపాలన అందించారని, గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. గ్రామ ప్రజలు గుర్తుంచుకునేలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని వివరించారు. గ్రామాన్ని అభివృద్ధి చేసిన నాయకులను ప్రజలు ఎన్నడు మరిచిపోరని, అప్పారావు ఆదర్శనీయంగా నిలుస్తారని రవి శేఖర్ వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యదర్శి గేదెల రాజారావు, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షుడు నల్లం శ్రీనివాసరావు ఎచ్చర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్య దొర, నల్లం వెంకటేశ్వరరావు (బుజ్జి), గ్రామ పెద్దలు తోట వెంకటరావు, అచ్యుత రావు, మల్లిపాముల సుదర్శన రావు సచివాలయ ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోర్టులో కేసు వేసిన జిందాల్

శృంగవరపుకోట, ఏప్రిల్ 2, ప్రభాతవార్త : మండలం లోని బొడ్డవర ప్రాంతంలో సుమారు 18 ఏళ్ల క్రితం జరి గిన జిందాల్ సంస్థ భూసేకరణలో అక్రమంగా 12మంది బినామీలను సృష్టించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆసమయంలో బినామీలపై వచ్చిన ఆరోపణలు మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది.దీంతో బినామీల బాగోతం బయటపడింది.12మంది బినామీలకు సంభందించి సుమారు 36లక్షల రూపాయలు వారికి ముట్టినట్లు తేలింది.అయితే వీరు కేవలం బినామీలే అయినా వీరిని బినామీలుగా సృష్టించిన సృష్టి కర్తలకే 36లక్షల రూపాయలు నగదు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా బినామీలే దోషులుగా తేరేరని ఏసీబీ దర్యాప్తులో తేలింది.ఇక ఈవిషయాన్ని పక్కన పెడితే బినామీలు తీసుకున్న 36లక్షల రూపాయలు కట్టాలని లేకపోతే వారి ఆస్తులు జప్తు చేస్తామని ఇటీవల ఎస్.కోట రెవెన్యూ శాఖ అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు.ఏప్రిల్4వ తేదీతో వారికి ఇచ్చిన గడువు పూర్తి కానున్నట్లు సమాచారం.ఇక బినామీల ఆస్తులను జప్తు చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.కోర్టులో బినామీలు వేసిన కేసుకు సంభందించి స్టే ఆర్డర్ వస్తే బినామీల ఆస్తులపై జప్తు నిలిచిపోయే అవకాశం ఉందని తెలుస్తుంది.లేకపోతే బినామీల ఆస్తులపై రెవెన్యూ అధికారులు జప్తు కొనసాగే అవకాశం ఉందని సమాచారం.



## ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరింది

కొమరాడ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని మండల తెదేపా కన్వీనర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ శేఖర్ పాత్రుడు అన్నారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా ఆయన విలేకరులతో గురువారం మాట్లాడారు.పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా నిన్న లోక్ సభలో ఈ రోజు రాజ్యసభ లో సభ్యులు అమరావతి ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ఆమోదించ్నడ పట్ల హర్షం వ్యక్తం చేశారు. 29 గ్రామాల రైతుల త్యాగాల పునాదులపై నిర్మితమవుతున్న నవ్యాంధ్ర భవిష్యత్తు అమరావతే అన్నారు. భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం నా ఇల్లు.. నా పొలం అనేవి ముఖ్యం కాదని, మన రాష్ట్రమే ముఖ్యమని రాజధాని ప్రాంత రైతులు చాటి చెప్పారన్నారు. 33 వేల ఎకరాల భూమిని అమరావతి కోసం ధారబోశారన్నారు.

## గుండెపోటుతో అధ్యాపకుడి మృతి

బలిజిపేట, ఏప్రిల్ 2, ప్రభాతవార్త: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న జరజాపు జగన్నాథం(జగన్) గురువారం గుండెపోటుతో మరణించాడు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనానికి బయలుదేరుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఇతనే స్వగ్రామం పాచిపెంట. ప్రస్తుతం బొబ్బిలిలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఇతనికి ఇద్దరు పిల్లలు. గతంలో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ప్రస్తుతం బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, కళాశాల ప్రగతికి నిరంతరం పాటుపడే జగన్ ఇక మరి లేడు అనే విషయం తెలుసుకున్న సహచర అధ్యాపకులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఉదయం స్పాట్ వాల్యూషన్ విధులకు హాజరయ్యేందుకు, బొబ్బిలిలో తన నివాసం నుండి బయలుదేరిన జగన్, హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు.సమీపంలో ఆసుపత్రికి మెరుగైన చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇతని పార్థివ దేహాన్ని స్వగ్రామం పాచిపెంట తరలించారు.స్పాట్ వాల్యూషన్ క్యాంపులో జగన్ మృతి చెందిన వార్త తెలియటంతో ప్రాంగణం అంతా ఒక్కసారిగా అంతులేని విషాదంలో మునిగిపోయింది. డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ తరఫున జగన్ మృతికి సంతాపం తెలియజేశారు. క్యాంప్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న డిఐఈఓ వై. నాగేశ్వరరావు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ గా వ్యవహరిస్తున్న పాలకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బొబ్బిలి రేణుక తదితరులు నివాళులు అర్పించారు. కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమతో పాటు సహచర అధ్యాపకుడిగా, వృత్తినిబద్ధతను కలిగి ఉంటూ, ఆయనతో పనిచేసినఅధ్యాపకులు పాచిపెంట పెళ్లి పార్థవదేహం నివాళులర్పించారు.

## ట్రైన్ ట్రాక్‌పై గుర్తు తెలియని శవం

లక్కవరపుకోట, ఏప్రిల్ 2, (ప్రభాత వార్త): రంగ రాయపురం గ్రామ పరిధిలో విశాఖపట్నం అరకు ప్రధాన రహదారి ప్రక్క గుండా వెళ్లే విశాఖపట్నం కిరండోల్ రైల్వే లైన్ పై గుర్తు తెలియని వ్యక్తి శవం ప్రమాదంకి గురి అయి కనిపించడంతో అ ప్రాంతంలో కలకలం రేగింది. మృతుడు మధ్య వయసు కలిగిన తెల్ల కలర్ చొక్కా కాఫీ కలర్ ఫాంట్ వేసుకుని వున్నాడు. ప్రమాదం ఎప్పుడు జరిగింది. ఆత్మ హత్యా ప్రమాదమా అనే విషయం తెలియదు. కొత్త వలస రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే రైల్వేపోలీసులకు సమాచారం ఇవ్వాలిఅనివారు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పంచాయతీ ప్రజాప్రతినిధులకు సత్కారం



భోగాపురం, ప్రభాతవార్త: సవరవిల్లి ప్రెసిడెంట్ ఉప్పాడ విజయ్ భాస్కర్ రెడ్డి, వార్డు మెంబర్లకు ఘనంగా సత్కరించిన భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్య నారాయణ రెడ్డి, ఎంపీటీసీ పట్నా తాతయ్యలు, సవరవిల్లి గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు,వాలంటరీలు పాల్గొన్నారు.

## బిల్లు ఆమోదంతో దేశమంతటా సంబరాలు



చీపురుపల్లి ఏప్రిల్ 2 ప్రభాతవార్త : అమరావతి రాజధానిని ఆమో దిస్తూ పార్లమెంట్లో బిల్లు ఆమోదం కావడంతో చీపురుపల్లి శాసనసభ్యు లు కిమిడి కళా వెంకటరావు సారథ్యంలో చీపురుపల్లిలో గురువారం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు. చీపురుపల్లి వెలసిన శ్రీ శ్రీ కనకమలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రథమ పూజలు నిర్వహించి అనంతరం ర్యాలీగా చీపురుపల్లి పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ విప్ గద్దె బాబురావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కిమిడి మల్లిక నాయుడు, తెలుగుదేశం నాయకులు రౌతు కామ నాయుడు, కే, త్రిమూర్తుల రాజు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, గరివిడి నాయకులు పైల బలరాం, ఆరిపాక సు రేష్, గ్రామీణ ప్రాంత నాయకులు సనపతి శ్రీనివాసరావు, గడే సన్యాసప్పలనాయుడు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కురుపాం ఏప్రిల్ 2, ప్రభాతవార్త: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి నారాయణరావు అన్నారు. గురువారం ఏకాలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మత్తు పానీయాలకు ,పదార్థాలకు దూరంగా ఉండా లని అలాగే ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

03-04pg10.qxd:03-04pg10.qxd 1/1/02 6:48 AM Page 1



## డస్సెన్ రిటైర్మెంట్



**జోహాన్నెస్ బర్గ్:** దక్షిణాఫ్రికా స్టార్ ఆటగాడు రస్సీ వాన్‌డెర్ డస్సెన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు సోషల్‌మీడియా వేదికగా వెల్లడించాడు. కెరీర్‌లో తనకు సహకరించిన దక్షిణాఫ్రికా బోర్డుకు, సహచర ఆటగాళ్లకు, కోచ్‌లకు డస్సెన్ కృతజ్ఞతలు తెలిపాడు. 37 యేళ్ల రస్సీ వాన్ డెర్ డస్సెన్... దక్షిణాఫ్రికా తరఫున 71 వన్డేలు ఆడి ఆరు సెంచరీలతో 2657 పరు గులు... 57టీ20లలో 1406 పరుగులు సాధిం చాడు. అలాగే 18 అంతర్జాతీయ టెస్టుల్లో ఆడిన డస్సెన్.. 5 అర్ధసెంచరీలు సహా 905 రన్స్ చేశాడు. ఇపీఎల్‌లో డస్సెన్ తన వంతు పాత్ర పోషించాడు. 2022 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ఆడాడు. సౌతాఫ్రికా లీగ్‌లో కేప్ టౌన్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు.

# ఆట

# ఈడెన్‌లో సన్‌రైజింగ్





**కోల్‌కతా:** ఈడెన్ గార్డెన్స్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మెరిసింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 ప్లస్ పరుగులు సాధించి ఎట్టకేలకు విజయం అందుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌ను దాని సొంతగడ్డపై65రన్స్‌తో ఓడించి ఐపీఎల్‌లో గెలుపు బోణీ కొట్టింది.

227 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నైట్‌రైడర్స్ ఆరంభం ధాటిగా మొదలైంది. డేవిడ్ పెయిన్ వేసిన తొలి ఓవర్లో అల్లెన్ 4,4,6,6, 4తో 25 రన్స్ సాధించాడు. కేవలం 7బంతుల్లోనే 26 రన్స్ చేసిన అల్లెన్‌ను దూబే అవుట్ చేశాడు. రహానే(8),కామరూన్ గ్రీన్2), అంకుల్(0) నిరాశ పరిచారు. అభిషేక్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో జోరు చూపిన రఘువంశ్ 29 బంతుల్లో 52 రన్స్ చేశాడు. రింకూ సింగ్ 25 బంతుల్లో 35రన్స్‌తో రాణించాడు. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడంతో నైట్‌రైడర్స్ 16 ఓవర్లలో 161రన్స్‌కు ఆలౌటైంది. బ్యాటింగ్‌లో రాణించిన నితీష్ కుమార్ బౌలింగ్‌లోనూ కీలక సమయంలో రింకూసింగ్, అంకుల్ వికెట్లను తీశాడు. ఎస్‌ఆర్‌హెచ్ ఫీల్డర్లు రెండు రనౌట్లు చేశారు. ఇతర ఎస్‌ఆర్‌హెచ్ బౌలర్లలో జయ్ దేవ్ ఉనద్కత్ 3, మలింగ రెండు వికెట్లు తీశారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ(21 బంతుల్లో 48), ట్రావిస్ హెడ్(21 బంతుల్లో 46) మెరుపు ఆరంభం ఇచ్చారు. తొలి ఓవర్‌లో ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముజర్బానీ వేసిన రెండో ఓవర్లో ట్రావిడ్ రెండు ఫోర్లు, అభిషేక్ సిక్స్‌తో జూలు విదిల్చారు.ఇక అరోరా ఓవర్లోనైతే ట్రావిస్ రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో 21 రన్స్ సాధిస్తే.. వరుణ్ చక్రవర్తికి అభిషేక్ చుక్కలు చూపాడు. సిక్స్‌తో మొదలుపెట్టి.. 6, 4, 4,4... ఇలా 25 రన్స్ సాధించాడు. ఆరో ఓవర్లో ట్రావిస్ ఫోర్, సిక్స్ బాదిన ట్రావిస్‌ను కార్తిక్ అవుట్ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 82 పరుగులు అందించారు. ట్రావిస్ అవుటైనా అభిషేక్ జోరు తగ్గలేదు. నరైన్ బంతుల్లో ఫోర్, సిక్స్ బాదాడు. మరోఎండ్‌లో కార్తిక్‌బౌలింగ్‌లో ఇషాన్ వరుస మూడు ఫోర్లతో అలరించాడు.జోరుగా సాగుతున్న ఎస్‌ఆర్‌హెచ్ ఇన్నింగ్స్‌కు మజర్బానీ బ్రేక్ వేశాడు. ఒకే ఓవర్లో మజర్బానీ 2 వికెట్లు, అంకుల్ రాయ్ ఓ వికెట్ తీయడంతో 7 పరుగుల తేడాతో ఎస్‌ఆర్‌హెచ్ మూడు వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో క్రీజ్‌లోకి వచ్చిన క్లాసెన్(35 బంతుల్లో 52), నితీష్ కుమార్ (24 బంతుల్లో 39) భారీ హిట్టింగ్‌లకు వెళ్లకుండా స్కోరును ముందుకు నడిపారు. అయిదోవికెట్‌కు 82 పరుగులు జోడించి ఎస్‌ఆర్‌హెచ్ స్కోరును 200 పరుగులు దాటించారు. చెరో ఓ 4 ఫోర్లు, ఓ సిక్స్ బాదారు. చివరి మూడు ఓవర్లలో 42 పరుగులు సాధించడంతో ఎస్‌ఎస్‌ఆర్ స్కోరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులకు చేరుకుంది. కేకేఆర్ బౌలర్లలో ముజర్బానీ 4 వికెట్లు, అరోరా 2 వికెట్లు పడగొట్టారు.

### అభిషేక్ శర్మ సిక్సర్ల సెంచరీ

సన్‌రైజర్స్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ.. ఐపీఎల్‌లో సిక్సర్ల సెంచరీ పూర్తి పూర్తిచేశాడు. నైట్‌రైడర్స్‌పై నాలుగు సిక్స్‌లు బాదిన అభిషేక్... ఎస్ఆర్ హెచ్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా నిలిచాడు. వార్నర్ ఎస్‌ఆర్‌హెచ్ తరఫున 143 సిక్సర్లు బాదాడు. వార్నర్, అభిషేక్ తర్వాతి స్థానాల్లో క్లాసెన్ (89), కేన్ విలియమ్సన్ (64), ట్రావిస్ హెడ్ (50) ఉన్నారు.

## అండమాన్‌లో తొలి సర్ఫింగ్ జాతీయ పోటీలు



**అండమాన్:** అండమాన్‌లో ఏప్రిల్ 9 నుంచి జాతీయ సర్ఫ్ అండ్ సుప్ ఛాంపియన్‌షిప్ జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలతో దేశీయ సర్ఫింగ్ సీజన్ ప్రారంభం కానుంది. జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ఆటగాళ్లకు ఇది చక్కని వేదికగా నిలవనుందని భారత సర్ఫింగ్ ఫెడరేషన్ పేర్కొంది. లిటిల్ అండమాన్ ప్రో 2026లో మేటి సర్ఫింగ్ క్రీడాకారులందరూ బరిలోకి దిగనున్నారు. వీరి ప్రదర్శనకు అండమాన్ దీవుల్లోని బట్లర్ బే బీచ్ వేదిక కానుంది. దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన తీరప్రాంతాల్లో ఒకటైన బట్లర్ బే బీచ్‌లో తొలిసారి సర్ఫింగ్ పోటీలు జరుగుతాయి.

## పోలీస్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఒడిశా, అసోం రైఫిల్స్



**హైదరాబాద్, మార్చి 2(వార్త క్రీడా ప్రతినిధి):** 74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ మహిళల ఫైనల్లో ఒడిషా, అసోం రైఫిల్స్ జట్లు ప్రవేశించాయి. హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన మొదటి సెమీఫైనల్లో ఒడిషా 2-0 గోల్స్ తేడాతో సీఐఎస్ఎఫ్‌పై గెలుపొందింది. మరో సెమీఫైనల్లో అసోం రైఫిల్స్ 3-1 గోల్స్ తేడాతో ఎస్ఎస్‌బి జట్టును ఓడించింది. కాగా పురుషుల విభాగంలో సీఐఎస్ఎఫ్5-1తో అండమాన్ నికోబార్‌పై, అసోం రైఫిల్స్ 2-1తో మణిపూర్‌పై, ఒడిషా 7-5తో ఢిల్లీపై, ఐటీబిపి 4-2తో ఎస్ఎస్‌బిపై, గోవా 1-0తో బిఎస్ఎఫ్‌పై, సీఆర్‌పిఎఫ్ 1-0తో రాజస్థాన్‌పై,కేరళం 3-0తో పంజాబ్‌పై, సిక్కిం 4-1తో మిజోరంపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్ చేరాయి.






## చేపాక్‌లో సిఎస్‌కె బ్యాటింగ్‌కు పరీక్ష



**చెన్నై:** ఐపీఎల్‌లో నేడు జరిగే ఆసక్తికర పోరులో చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడనున్నాయి. రాజస్థాన్ చేతిలో ఓడిన సీఎస్‌కే సొంత గ్రౌండ్లో విక్టరీతో గెలుపు బోణీ చేయాలని చూస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో గుజరాత్‌ను చిత్తుచేసిన పంజాబ్ కింగ్స్... అదే జోష్‌ను ఈ మ్యాచ్‌లో నూ కొనసాగించి రెండో గెలుపు అందుకోవడంపై ఫోకస్ పెట్టింది.

అయిదుసార్లు ఛాంపియన్ సీఎస్‌కే... తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో బోల్తా కొట్టింది. సీఎస్‌కేకు తొలిసారి ఆడుతున్న టీమిండియా ఓపెనర్ సంజూ శాంమ్సన్‌తో పాటు నిరాశపరిచిన కెప్టెన్ రుతురాజ్, యంగ్ గన్ ఆయూష్ మాత్రే, మాథ్యూ షార్ట్, శివమ్ దూబే ... ఈ మ్యాచ్‌లో కుదురుకుంటారన్న ఆశాభావంతో ఉంది. వీరు పరుగుల వేటలో పడితే పంజాబ్ కింగ్స్ బౌలర్లకు చుక్కలే. సూపర్ ఆల్‌రౌండర్ జేమీ ఓవర్టన్ చక్కని ఫామ్‌లో ఉండడం సీఎస్‌కేకు కలిసివచ్చే అంశం. మాట్ హెన్రీ, ఖలీల్ ఆహ్మద్, నూర్ ఆహ్మద్, కంబోజ్ రూపంలో సీఎస్‌కే బౌలింగ్ ప్రత్యర్థిని కట్టడిచేయాల్సి ఉంటుంది.

ఇటు పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కూడా తమ తొలి మ్యాచ్‌లో తడబడింది. స్వల్ప స్కోరును చేధించడానికి ఆపసోపాలుపడింది.కూపర్ కానలీ (72నాటౌట్) క్రీజ్‌లో నిలబడకపోతే పరిస్థితి మరోలా ఉండేది. గత సీజన్‌లో అద్భుతంగా రాణించిన ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్యా, ప్రభసిమ్రాన్ సింగ్ నుంచి ఆ జట్టు మెరుపు ఆరంభాన్ని ఆశిస్తోంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, నెహాల్ వధేరా, మార్కస్ స్టొయినిస్‌లతో కూడిన మిడిల్ ఆర్డర్ గాడిన పడాల్సి ఉంది. బౌలింగ్‌లో మాత్రం మెరుగ్గా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత పేస్ అటాకర్ అర్షదీప్ సింగ్ భారీగా పరుగులిచ్చినా...మిగతా బౌలర్లు ప్రత్యర్థిని చక్కగా కట్టడి చేశారు. ముఖ్యంగా స్పిన్నర్లు చాహల్, విజయ్‌లపై మరోసారి పంజాబ్ భారీ ఆశలు పెట్టుకుంది. రెండు జట్లలోనూ మ్యాచ్ ఫినిషర్లు ఉండడంతో చెపాక్‌లో పరుగుల వరద పారనుంది.

**హెడ్ టు హెడ్**

సీఎస్‌కే, పంజాబ్ కింగ్స్ జట్లు 32 సార్లు తలపడ్డాయి. ఇరు జట్లు సమవుజ్జీగా ఉన్నాయి. చెరో 16 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

**పిచ్ రిపోర్ట్**

సీఎస్‌కే ఈ ఐపీఎల్‌లో సొంత గ్రౌండ్‌లో తొలిసారి మ్యాచ్ ఆడబోతోంది. చెన్నై చెపాక్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. స్పిన్నర్లకు కొంత సహకారం లభించినా... భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. బంతి బ్యాట్‌పైకి చక్కగా వస్తుంది. దీంతో బ్యాట్స్‌మెన్ దాటిగా ఆడగలరు. ఇటీవలి టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో జింబాబ్వేపై టీమిండియా 254 రన్స్ చేసింది.

**చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** సంజు సామ్సన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, మాథ్యూ షార్ట్, శివమ్ దూబే, కార్తిక్ శర్మ, జేమీ ఓవర్టన్, నూర్ అహ్మద్, మాట్ హెన్రీ, అన్షుల్ కంబోజ్, ఖలీల్ అహ్మద్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** సర్ఫరాజ్ ఖాన్/రాహుల్ చాహర్

**పంజాబ్ కింగ్స్ తుది జట్టు(అంచనా):** ప్రభ్‌సిమ్రాన్ (వికెట్ కీపర్), కూపర్ కానలీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వధేరా,శశాంక్ సింగ్, స్టోయినిస్, మార్కో జాన్సెన్, బార్ట్‌లెట్, విజయకుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ప్రియాన్ష్ ఆర్యా

## లక్ష్యాలను అధిగమించిన పరోక్ష పన్నుల వసూళ్లు

### రూ.15.52 లక్షల కోట్లు వసూలయినట్లు ఆర్థికశాఖ వెల్లడి

వాణిజ్యం




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాలను అధిగమించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 101.2 శాతం అంచనాలను అందుకున్నట్లు తెలిపారు. మొత్తంగా చూస్తే జిఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు పన్నుల రూపంలో రూ.15.52 లక్షలకోట్లు వసూలయినట్లు ఆర్థికశాఖప్రకటించింది. కస్టమ్స్ సుంకాల వసూళ్లు 102శాతంగా ఉన్నాయి.ఎక్సైజ్ సుంకాలు వసూళ్లు కూడా 101శాతం లక్ష్యాలు సాధించినట్లు వెల్లడించింది. పరోక్షపన్నులు ఈ ఆర్థిక సంవత్సరంలో క్రమేపీ పెరుగుతూ వచ్చాయని 2021నుంచి చూస్తే 10.82 లక్షలకోట్లనుంచి 15.లక్షలకోట్లవరకూ వసూళు జరిగాయి. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.52 లక్షల కోట్లకు చేరినట్లు తేలింది.

రానున్న ఆర్థికసంవత్సరానికి రూ.17.50 లక్షలకోట్లు బడ్జెట్‌లో అంచనాలున్నాయి. పరోక్షపన్నుల్లో జీఎస్టీయే ఎక్కువ వాటాతో ఉంది. పన్నువసూళ్లలో పెరుగుదలవల్ల ప్రభుత్వం ఆర్థికలోటును కట్టడిచేసుకునే వెసులుబాటు కలుగుతోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికలోటు జిడిపిలో 4.4శాతంగా ఉంటుందని అంచనావేసారు. దేశీయంగా వినియోగ వ్యయం పెరగడం, పన్ను యంత్రాంగంలో కఠిన కార్యాచరణ, లీకేజిల కట్టడి, ఆన్‌లైన్ నిర్వహణ వంటివే రాబడులు పెరిగేందుకు దోహదం చేసాయి. అయితే పాన్‌మసాలా పై విధించిన సెస్ మాత్రం అంచనాలు అందుకోలేదు. హెల్త్, నేషనల్ సెక్యూరిటీ సెస్సు విధించారు. 40శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరినుంచి ఈసెస్సు వసూలుచేస్తోంది.ఈ సెస్సు రూపంలో రూ.2330కోట్లు రాగలవని అంచనావేస్తే కేవలం 63శాతం లక్ష్యాలు మాత్రమే చేరుకోగలిగింది. కొత్తగా ప్రవేశ పెట్టిన పన్నులు కావడం వల్లనే ఈ తగ్గుదల సహజమేనని అధికారులు చెపుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సెస్సుల రూపంలోరూ.14 వేలకోట్లు వసూలు చేయాలని కేంద్రం లక్ష్యం విధించింది.

## బులియన్ మార్కెట్‌లో ధరల పతనం



**ముంబయి, ఏప్రిల్ 2:** బంగారం, వెండి ధరలు గురువారం పతనం అయ్యాయి. ముడిచమురుదరలు పెరగడం, గ్లోబల్‌కమోడిటీ మార్కెట్లలో కూడా పెరుగుదల నమోదుచేయడంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగం వివరాలు బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపించాయి. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజి ఎంసిఎక్స్‌లో పసిడిధరలు 4.3శాతం తగి అంటే రూ.6608 తగ్గిరూ.1,47,100గా నడిచింది. వెండిధరలు కూడా 7.8శాతం తగ్గింది. అంటే కిలో ఒక్కింటికి రూ.19,001తగ్గి రూ.2,24,500గా ఇంట్రాడేలో నమోదయింది. గ్లోబల్‌మార్కెట్లలో బంగారం 3.4శాతం పతనం అయి ఔన్స్ ఒక్కింటికి 4648 డాలర్లకు చేరింది.వెండిధరలు కూడా 6.2శాతం తగ్గి ఔన్స్‌ఒక్కింటికి 71.39 డాలర్లుగా నడిచింది. బ్రెంట్ ముడిచమురు 7.6శాతం పెరిగి బ్యారెల్‌కు 108.81 డాలర్లుగా ఉన్నాయి. డబ్ల్యుటిఐ ముడిచమురు బ్యారెల్‌కు 107.18 డాలర్లుగా ఉంది. కాగా దేశీయ స్పాట్ మార్కెట్‌లో 24కేరట్ల బంగారం పది గ్రాములకు రూ.1,48,970గాను 22 కేరట్ల బంగారం రూ.1,36,550గాను, 18 కేరట్లు రూ.1,11,730గాను కొనసాగాయి. అదేవిధంగా వెండిధలు కూడా తగ్గాయి. కిలో ఒక్కింటికి రూ.2.55 లక్షలుగా కొనసాగింది. దేశంలోని ప్రధానమెట్రో నగరాలన్నింటిలోనూ ఇవే ధరలు స్పాట్ మార్కెట్‌లో కొనసాగాయి.




## నష్టాలనుంచి సెన్సెక్స్ నిఫ్టీ రికవరీ



**ముంబయి, ఏప్రిల్ 2:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఇన్వెస్టర్లకు అనూహ్య ఫలితాలు చూపించాయి. ఉదయం ప్రారంభంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన సూచీలు, ట్రేడింగ్ ముగిసే సమయానికి అనూహ్యంగా పుంజుకుని లాభాల బాట పట్టాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన నేటి మార్కెట్ విశేషాలు ఇలా ఉన్నాయి. భారీ నష్టాల నుంచి పైపైకి ఎగబాకాయి.గురువారం ఉదయం మార్కెట్లు ప్రారంభం కావడమే భారీ నష్టాలతో మొదలయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూల పవనాలు, ముడిచమురు ధరల పెరుగుదల భయాల మధ్య సెన్సెక్స్ ఒకానొక దశలో ఏకంగా 1,526 పాయింట్ల మేర పతనమై ఇన్వెస్టర్లను వణికించింది. అయితే.. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి తలకిందులైంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 185.23 పాయింట్ల లాభంతో 73,319 వద్ద, నిఫ్టీ 33.70 పాయింట్ల స్వల్ప లాభంతో 22,713 వద్ద స్థిరపడ్డాయి. ఐటీ షేర్ల జోరు, రూపాయి పటిష్టతకు తోడు మార్కెట్ల రికవరీలో ఐటీ రంగం కీలక పాత్ర పోషించింది. హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. వీటికి తోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అండగా నిలిచింది. మార్కెట్లో రుచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బైక్ హాస్పిటాలిటీ, బాంబే సూపర్ హైబ్రిడ్ సీడ్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్లుగా నిలిచాయి. మరోవైపు ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, రిలయన్స్ వంటి బడా సంస్థల షేర్లు స్వల్ప నష్టాలను చవిచూశాయి.

## డాలర్ వర్సెస్ రూపాయి 93.21



**ముంబయి, ఏప్రిల్ 2:** భారత రూపాయి మారకం విలువ గురువారం మరింత పటిష్టపడింది. గడచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఒక్కరోజే పెద్ద మొత్తంలో లాభపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 1.7 శాతం బలపడి 93.21 వద్ద స్థిరపడింది. ఒకేరోజు ఏకంగా 157 పైసలు పటిష్టం అయిందని ఫోరెక్స్ నిపుణులు వెల్లడించారు. కరెన్సీ స్పెక్యులేషన్‌ను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకుంటున్న కఠిన చర్యలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణం. 3 రోజుల సెలవుల తర్వాత మార్కెట్లు తిరిగి ప్రారంభమైన వెంటనే రూపాయి ర్యాలీ కనిపించింది. స్పెక్యులేషన్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఆఫ్‌షోర్ డెరివేటివ్ మార్కెట్లపైనా ఆర్బీఐ ఆంక్షలను విస్తరించింది. రెసిడెంట్, నాన్‌రెసిడెంట్ క్లయింట్లకు రూపాయి నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్డీఎఫ్) అందించకుండా బ్యాంకులను నిషేధించింది. రద్దు చేసుకున్న ఫార్వర్డ్ కాంట్రాక్టులను మళ్లీ బుక్ చేసుకునే అవకాశం కంపెనీలకు లేదని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో చాలా ఆసియా కరెన్సీలు బలహీనపడినా రూపాయి బలపడటం గమనార్హం.

## ఇంధన సర్‌ఛార్జిలు పెంచిన ఇండిగో

**ముంబయి, ఏప్రిల్ 2:** విమానాల్లో వినియోగించే ఇంధన ధరలు ఇటీవల భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకున్నది. టిక్కెట్లపై వసూలు చేసే ఫ్యూయల్ ఛార్జీలను భారీగా పెంచింది. దేశీయ, అంతర్జాతీయ టిక్కెట్లపై కనిష్ఠంగా రూ.275, గరిష్ఠంగా రూ.10 వేల వరకు పెంచింది. ఈ ఛార్జీలు రేపటి నుంచి (ఏప్రిల్ 2) అమల్లోకి వస్తాయని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) సవరించిన రోజునే ఇండిగో విమానయాన టిక్కెట్ల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరుగుతున్న విషయం తెలిసిందే. గత నెల రోజుల్లో ఏటీఎఫ్ ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయని, దీనివల్ల విమానయాన సంస్థ నిర్వహణ వ్యయాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతోందని ఇండిగో తెలిపింది. ఇంధన ధరల పెరుగుదలను పూర్తిగా భర్తీ చేయడానికి విమాన ప్రయాణ ఛార్జీలను భారీగా సవరించవలసి ఉంటోందని పేర్కొంది. ప్రయాణికులపై అధిక భారం పడకుండా స్వల్ప మొత్తంలో బదిలీ చేశామని తెలిపింది. ఈ ధరలు నేటి అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది.

## ఈక్విటీ మ్యూచువల్‌ఫండ్స్‌లో ఐదు కొత్త స్కీమ్స్




**ముంబయి, ఏప్రిల్2:**ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఐదు కొత్తపథకాలు,మరో ఎస్ఐఎఫ్ స్కీమ్ కొనుగోళ్లకు అందుబాటులోకి వచ్చాయి.జియో బ్లాక్ రాక్, జెరోధా మ్యూచువల్ ఫండ్స్ వంటి ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను భర్తీచేస్తూ ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు న్యూ ఫండ్ ఆఫర్స్‌తో వచ్చాయి. చిన్న మొత్తాల్లో పెట్టుబడి పెట్టే వారితో పాటు ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేసే వారికి సైతం ఇప్పుడు అవకాశం ఉంది. ఈ ఫండ్స్‌లో నెలకు రూ.100, రూ.500, రూ.1000 తోనూ చేరవచ్చు. ఈ 5కొత్త ఫండ్స్‌లో నాలుగు ఇండెక్స్ ఫండ్స్ ఉండగా ఒకటి లార్జ్ క్యాప్ ఫండ్ ఉంది. అలాగే లాంగ్‌షార్ట్ ఫామ్‌లో ఒక ఎస్ఐఎఫ్ స్కీమ్ లాంచ్ అయింది. ఛాయిస్ మ్యూచువల్ ఫండ్స్ మరో రెండు కొత్త ఫండ్స్ లాంచ్ చేసింది. ఛాయిస్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, ఛాయిస్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం లాంచ్ అయ్యాయి. ఈ రెండు కొత్త ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తోంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా నిర్ణయించారు. ఆ తర్వాత ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. జెరోధా మ్యూచువల్ ఫండ్ నుంచి రెండు ఇండెక్స్ ఫండ్స్ లాంచ్ అయ్యాయి. ఒక ఫండ్ ఏప్రిల్ 6వ తేదీ వరకు, మరొకటి ఏప్రిల్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.